




సమాజ హితం – మా అభిమతం

www.arunaprabha.com

# అరుణ ప్రభ

ARUNAPRABHA TELUGU DAILY

తెలుగు దినపత్రిక

RNI NO. TEL TEL/2023/89778








రంగారెడ్డి - హైదరాబాద్ సంపుటి : 04 సంచిక : 176, పేజిలు : 12, వెల రూ. 5/- మంగళవారం -18 - ఆగష్టు - 2026

PUBILSHED FROM RANGAREDDY, HYDERABAD, CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD CHITTOR, VISHAKAPATANAM, SRIKAKULAM, ELLURU, ONGOL, VIJAYAWADA, SPSR NELLORE, PRAKASHM, GUNTUR, KURNOOL, KADAPA





### 148 రోజుల్లోనే డీఎస్సీ ప్రక్రియ పూర్తి..

## ప్రతి ఏటా డీఎస్సీ నిర్వహిస్తాం

- ఏపీ అసెంబ్లీలో మంత్రి నారా లోకేశ్
- విద్యా వ్యవస్థను బలోపేతం చేసేందుకు విప్లవాత్మక మార్పులు తెచ్చామని వెల్లడి
- వైసీపీ ప్రభుత్వం ఉపాధ్యాయులకు మద్యం దుకాణాల వద్ద నిలబెట్టిందని మండిపాటు

అమరావతి: ఆంధ్రప్రదేశ్ శాసనసభ వర్షాకాల సమావేశాలు ఈరోజు ప్రారంభమయ్యాయి. సభలో విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ మాట్లాడుతూ... డీఎస్సీ నిర్వహణ, విద్యావ్యవస్థలో చేపట్టిన

### బంగాళాఖాతంలో తీవ్ర అల్పపీడనం.. ఉత్తరాంధ్రకు అలర్ట్

- అల్పపీడనం నేడు వాయుగుండంగా బలపడే అవకాశం




- మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లొద్దని హెచ్చరిక

### 'దిమాగీ నక్సల్ పార్టీ'.. ఒక్క రోజులోనే 1.6 లక్షల ఫాలోవర్లు!




- 'దిమాగీ నక్సల్ పార్టీ' పేరుతో కొత్త ఇన్‌స్టాగ్రామ్ ఖాతా
- 24 గంటల్లోనే 1.6 లక్షలకు పైగా ఫాలోవర్లు
- ఖాతాలో ప్రస్తుతం 62 పోస్టులు
- ఖాతాను ఎవరు నిర్వహిస్తున్నారో లేని స్పష్టత
- ఈ నెలలోనే ప్రారంభమైన అకౌంట్

## బోల్తా కొట్టిన బండిని పట్టాలెక్కించామని,

# ఇక పరుగెత్తించడమే మిగిలింది

### సెప్టెంబర్ నెలలో శాసనసభ సమావేశాలను నిర్వహిస్తాం

రాష్ట్రంలో నిరుద్యోగ యువకులను

కొందరు రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారు

- విడతల వారిగా ప్రభుత్వంలోని ఖాళీలన్నీ భర్తీ చేస్తాం
- ఒక్కటొక్కటిగా అన్ని సమస్యలు పరిష్కరించుకుంటూ ముందుకు వెళుతోంది
- రూ. 424 కోట్ల మేరకు వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన
- రైతులు, ఆడిబిడ్డలు, నిరుద్యోగ యువకుల సంక్షేమం కోసం ప్రభుత్వం పనిచేస్తోంది



హైదరాబాద్: రాష్ట్రంలో నిరుద్యోగ యువకులను కొందరు రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారని, అలాంటి వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హితవు పలికారు. మిగతా 2 లో




### నిజాలు బయటకు రావాలంటే సీబీఐ విచారణ ఒక్కటే సరైన మార్గం బొత్స సత్యనారాయణ

- డీఎస్సీ అంశంపై శాసనమండలిలో వైసీపీ రచ్చ
- నారా లోకేశ్ తక్షణమే రాజీనామా చేయాలన్న బొత్స సత్యనారాయణ
- నిరుద్యోగులను ప్రభుత్వం మోసం చేసిందని మండిపాటు

### రాహుల్ గాంధీ ఆస్తుల కేసులో కేంద్రానికి సుప్రీంకోర్టు కీలక ప్రశ్న.. లక్నో హైకోర్టు ఉత్తర్వులపై స్టే!




- రాహుల్ గాంధీ ఆదాయానికి మించిన ఆస్తుల కేసు
- కేసులోని ఆరోపణలు అంత తీవ్రమైనవైతే సీబీఐ, ఈడీ ఇన్నాళ్లు ఎందుకు ఊరుకున్నాయన్న సుప్రీంకోర్టు




### భాజపా జాతీయ ఉపాధ్యక్షురాలిగా పురందేశ్వరి.. కాషాయ దళం కొత్త టీమ్ ఇదే!

- భాజపా నూతన జాతీయ కార్యవర్గాన్ని ప్రకటన
- 13 మంది జాతీయ ఉపాధ్యక్షులతో పాటు వివిధ కీలక పదవులకు ఎంపిక చేసిన వారి జాబితాలను విడుదల
- మాజీ సీఎం వసుంధర రాజే సింధియా(రాజస్థాన్)తో పాటు తీరథ్ సింగ్ రావత్ (ఉత్తరాఖండ్)
- రామ్ మాధవ్ (ఢిల్లీ), బైజయంత్ జయ్ పాండా (ఒడిశా), రేఖా వర్మ, వర్షాబెన్ నరేంద్రభాయ్

## టీచర్లకు న్యాయపరంగా

# అండగా ఉంటాం

★ ఇది కక్ష సాధింపు చర్యేనని సోషల్ మీడియాలో విమర్శలు

- ★ టెట్ నుంచి మినహాయింపు కోరిన ఐదుగురు టీచర్లను సస్పెండ్ చేశారన్న జగన్
- ★ చంద్రబాబు ప్రభుత్వంపై తీవ్ర ఆగ్రహం
- ★ సస్పెన్షన్లు ఎత్తివేసి క్షమాపణ చెప్పాలని డిమాండ్



అమరావతి: ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) నుంచి మినహాయింపు కోరుతూ కేంద్ర ప్రభుత్వ ప్రతినిధులను కలిసిన ఐదుగురు టీచర్లను సస్పెండ్ చేశారంటూ వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఉద్యోగులు, ముఖ్యంగా ఉపాధ్యాయులపై మిగతా 2 లో

## కేబీఆర్ పార్కు

# చుట్టూ కొత్త మార్పులు..

### 7 అండర్‌పాస్‌లు.. 7 ఫ్లైఓవర్లు కేబీఆర్ పార్కు చుట్టూ కొనసాగనున్న నిర్మాణాలు

ఆయా మార్గాల్లో వన్-- వే విధానం

నగర పోలీస్ కమిషనర్ సజ్జనర్ వెల్లడి




హైదరాబాద్: కేబీఆర్ పార్కు చుట్టూ 'హెచ్--సిటీ' ప్రాజెక్టులో భాగంగా రూ.1,090 కోట్లతో చేపట్టనున్న పనులు రెండు ప్యాకేజీల్లో జరుగుతాయని నగర పోలీసు కమిషనర్ వీసీ సజ్జనర్ ఆదివారం ప్రకటించారు. ఇందులో భాగంగా ఆరు జంక్షన్లలో ఏడు చోట్ల అండర్‌పాస్‌లు, మిగతా 2 లో




## రేవంత్ ఇల్లు కూడా నిషేధిత జాబితాలో ఉంది సామాన్యుల పరిస్థితి ఏమిటన్న హరీశ్ రావు

- జాబితా నుంచి సీఎం ఇంటిని తొలగించే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపణ
- నిషేధిత ఆస్తుల జాబితాపై విచారణ జరిపి శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్

హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నివాసం కూడా నిషేధిత ఆస్తుల జాబితాలో ఉందని, దానిని ఆ జాబితా నుంచి తొలగించేందుకు





## 22ఏ భూములపై పొంగులేటి కీలక ఆదేశాలు..

- ప్రజలను ఇబ్బంది పెడితే సహించేది లేదని హెచ్చరిక
- 22ఏ భూములపై పొంగులేటి కీలక ఆదేశాలు
- ప్రజలను కార్యాలయాల చుట్టూ తిప్పొద్దని సూచన







అరుణ ప్రభ
ARUNAPRABHA TELUGU DAILY



## డీఎస్సీ నియామకాల్లో డీవియేషన్ లేదు.. దమ్ముంటే అసెంబ్లీకి వచ్చి చర్చించాలి: వైసీపీకి చంద్రబాబు సవాల్

అమరావతి: మెగా డీఎస్సీ నియామకాల్లో ఒక్క డీవియేషన్ కూడా జరగలేదని, ప్రతిభ ఆధారంగానే అత్యంత పారదర్శకంగా ప్రక్రియను పూర్తి చేశామని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ఈ అంశంపై వైసీపీ చేస్తున్నవి కేవలం హిట్ అండ్ రన్ ఆరోపణలేనని, వారికి దమ్ము, ధైర్యం ఉంటే శాసనసభకు వచ్చి చర్చించాలని ఆయన సవాల్ విసిరారు. ఒడిశా కూలీలతో, 90 ఏళ్ల జగన్ జెన్ జీ వృద్ధులతో ఫేక్ ప్రదర్శనలు చేయిస్తూ డీఎస్సీపై దుష్ప్రచారం చేస్తున్నారని ఆయన తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఇవాళ శాసనసభలో మెగా డీఎస్సీ నియామకాలపై జరిగిన చర్చలో సీఎం సుదీర్ఘంగా మాట్లాడారు.

విద్యాభివృద్ధికి టీడీపీ కట్టుబడి ఉంది

విద్యార్థులకు మంచి విద్య, నైపుణ్యాలు అందిస్తే వారే అత్యుత్తమ మానవ వనరులుగా తయారవుతారని తమ ప్రభుత్వం విశ్వసిస్తుందని చంద్రబాబు అన్నారు. ఎన్టీఆర్ హయాంలో రెసిడెన్షియల్ పాఠశాలలు, మహిళా యూనివర్సిటీ ఏర్పాటుతో విద్యా సంస్థలకు శ్రీకారం చుట్టామని గుర్తుచేశారు. తాను ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ప్రతి కిలోమీటరుకు ఓ ప్రాథమిక పాఠశాల, మండలానికి ఓ జూనియర్ కాలేజీ, జిల్లాకు ఓ మెడికల్ కాలేజీ ఏర్పాటు చేశామని తెలిపారు. 2019-24 మధ్య ఐదేళ్లలో ఒక్క ఉపాధ్యాయ పోస్టును కూడా భర్తీ చేయని పాలకులు, విద్యారంగంపై డబ్బులు కొల్లగొట్టుకున్నారని ఎద్దేవా చేశారు. ఇప్పటివరకు 14 డీఎస్సీలు జరిగితే, వాటిలో 11 డీఎస్సీలను టీడీపీ, ఎన్డీయే ప్రభుత్వాల హయాంలోనే నిర్వహించాం, అవినీతికి ఆస్కారం లేకుండా నియామకాలు చేపట్టామని వివరించారు.

148 రోజుల్లోనే పారదర్శకంగా నియామకాలు

గత పాలకులు ఐదేళ్లలో చేయలేని పనిని, తాము అధికారంలోకి వచ్చిన వెంటనే తొలి సంతకంతో చేసి చూపించామని చంద్రబాబు అన్నారు. మెగా డీఎస్సీ ద్వారా 15,941 ఉద్యోగాలను కేవలం 148 రోజుల్లోనే పారదర్శకంగా భర్తీ చేశామని వివరించారు. టెట్, డీఎస్సీ నోటిఫికేషన్ల నుంచి హారిజాంటల్, వర్టికల్ రిజర్వేషన్ల ప్రక్రియ వరకు అన్నీ కట్టుదిట్టంగా చేపట్టామన్నారు. 13 సబ్జెక్టులకు 42 వేల ప్రశ్నలను ఎంపిక చేసి, 154 కేంద్రాల్లో కంప్యూటర్ ఆధారిత (సీబీటీ) విధానంలో పరీక్షలు నిర్వహించి, ఫలితాలను కూడా పారదర్శకంగా విడుదల చేశామని తెలిపారు. మెరిట్ కమ్ రోస్టర్ విధానంలోనే పూర్తి ప్రతిభ ప్రకారం 15,941 మందిని ఎంపిక చేశామని, నియామక ప్రక్రియ వివరాలన్నీ ఆన్‌లైన్‌లో ఉన్నాయని, ఇంతకంటే పారదర్శకత ఎక్కడ ఉంటుందని ప్రశ్నించారు. ఫిర్యాదుల పరిష్కారానికి జోనల్, రాష్ట్రస్థాయి కమిటీలతో పాటు అప్పీలేట్ అథారిటీని కూడా ఏర్పాటు చేశామన్నారు.

వైసీపీవి ఫేక్ ఆందోళనలు, కుట్రలు

డీఎస్సీపై వైసీపీ నిరాధార ఆరోపణలు చేస్తోందని సీఎం ధ్వజమెత్తారు. "గొడ్డలి పార్టీ నేతలు ఒడిశా కూలీలతో, 90 ఏళ్ల జగన్ జెన్ జీ వృద్ధులతో ఫేక్ ధర్నాలు చేయిస్తున్నారు. ప్రభుత్వంలో పనిచేసి రిటైరైన ఓ ఐఏఎస్ అధికారి, ఓ మాజీ మంత్రి ఇష్టానుసారం మాట్లాడుతున్నారు" అని విమర్శించారు. వైసీపీ ఆరోపణలను సహించలేకే డీఎస్సీలో ఉద్యోగాలు సాధించిన టీచర్లే స్వయంగా రోడ్లపైకి వస్తున్నారని, మొన్న కర్నూలులో, నిన్న విజయవాడలో భారీగా ఆందోళనలు చేశారని గుర్తుచేశారు. "పిల్లలకు పాఠాలు చెబుతాం.. మా ప్రతిభను కించపరిస్తే గుణపాఠం కూడా చెబుతాం" అని వారు నినదించిన విషయాన్ని చంద్రబాబు సభ దృష్టికి తెచ్చారు.

అసెంబ్లీకి రాకుండా పబ్లిటా?

తమ ప్రభుత్వం ప్రజలకు జవాబుదారీ అని, కుట్రలు చేసే పార్టీలకు కాదని చంద్రబాబు తేల్చిచెప్పారు. "ధైర్యం ఉంటే అసెంబ్లీకి వచ్చి చర్చించాలి. అడ్డంగా దొరికిపోతామనే భయంతో వారు సభకు రావడం లేదు. సిగ్గులేని ఆ పార్టీ సభ్యులు అసెంబ్లీకి రాకుండా బయట పబ్లిసిటీ ఆడుతుంటున్నారు. రెండున్నరేళ్లుగా సభకు రాకుండానే జీతాలు, ప్రివిలేజెస్ తీసుకుంటున్నారు. నా జీవితంలో ఇలాంటి పార్టీని చూడలేదు" అని తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. తనకు ప్రజల పట్ల పూర్తి బాధ్యత ఉందని, రాష్ట్రంలో ఎలాంటి కుట్రలు పనిచేయవని, ఉపాధ్యాయ నియామకాలు అత్యంత జవాబుదారీతనంతో జరిగాయని సీఎం పునరుద్ఘాటించారు.

## రాహుల్ గాంధీ ఆస్తుల కేసులో కేంద్రానికి సుప్రీంకోర్టు కీలక ప్రశ్న.. లక్నో హైకోర్టు ఉత్తర్వులపై స్టే!

ఢిల్లీ: కాంగ్రెస్ అగ్ర నేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఆదాయానికి మించిన ఆస్తుల కేసు విచారణలో భాగంగా కేంద్ర దర్యాప్తు సంస్థలు (సీబీఐ, ఈడీ), కేంద్ర ప్రభుత్వంపై భారత అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు సంచలన వ్యాఖ్యలు చేసింది. ఈ వ్యవహారంలో సీబీఐ, ఈడీ విచారణకు ఆదేశిస్తూ లక్నో హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులపై సుప్రీంకోర్టు స్టే విధించింది. విచారణ సందర్భంగా కేంద్రం తరఫున వాదనలు వినిపించిన అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్.వి.రాజు స్పందిస్తూ... ఈ కేసులోని ఆరోపణలు అత్యంత తీవ్రమైనవని, ఇది ఆదాయానికి మించిన ఆస్తుల కిందకు వస్తుందని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై తీవ్రంగా స్పందించిన సుప్రీంకోర్టు ధర్మాసనం... "ఆరోపణలు అంత తీవ్రమైనవే అయితే మీ దర్యాప్తు సంస్థలు ఇన్నాళ్లూ ఏం చేస్తున్నాయి? దర్యాప్తు లేదా విచారణ ప్రారంభించడానికి కోర్టు నుంచి ఒత్తిడి లేదా ఆదేశాలు వచ్చే వరకు ఎందుకు వేచి చూశాయి? చట్టప్రకారం మీకున్న స్వయంప్రతిపత్తి అధికారాలతో సొంతంగా ఎందుకు చర్యలు తీసుకోలేదు?" అని ప్రశ్నించింది.

## టీచర్లకు న్యాయపరంగా అండగా ఉంటాం

మొదటి పేజి తరువాయి

ప్రభుత్వ ఉద్యోగులు, ముఖ్యంగా ఉపాధ్యాయులపై ముఖ్యమంత్రి చంద్రబాబు కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపిస్తూ నేడు సోషల్ మీడియా వేదికగా ధ్వజమెత్తారు. "మొదటి రోజు వైఎస్ఆర్ కడప జిల్లా టీచర్ల సంఘం వారిని, రెండో రోజు అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల టీచర్లను సస్పెండ్ చేశారు. ఆ ఐదుగురు ఉపాధ్యాయులను ఎందుకు సస్పెండ్ చేశారు? వారు చేసిన నేరం ఏమిటి?" అని జగన్ సూటిగా ప్రశ్నించారు. సర్వీసులో చేరినప్పుడు లేని టెట్ నిబంధనను ఇప్పుడు అమలు చేయడంపై ఒక్క మండలి పైగా సీనియర్ టీచర్ల ఇబ్బందులు పడుతున్నారని ఆయన పేర్కొన్నారు. ఈ నిబంధన నుంచి మినహాయింపు కోరుతూ తమకు అండగా నిలిచిన ఎమ్మెల్సీ సహకారంతో కేంద్ర ప్రభుత్వానికి వినతిపత్రం ఇవ్వడం నేరమా? అని జగన్ నిలదీశారు. తక్షణమే ఉపాధ్యాయుల సస్పెన్షన్లను రద్దు చేసి, వారికి ముఖ్యమంత్రి క్షమాపణ చెప్పాలని జగన్ డిమాండ్ చేశారు. ఈ అన్యాయమైన సస్పెన్షన్లపై న్యాయపోరాటంలో టీచర్లకు వైసీపీ పూర్తి అండగా ఉంటుందని పేర్కొన్నారు. "మీ రెడ్ బుక్ అరాచక పాలన ఇప్పుడు ప్రభుత్వ ఉపాధ్యాయులను కూడా వదలడం లేదు. చంద్రబాబు గారూ.. నిజానికి మీరే కేంద్ర ప్రభుత్వాన్ని ఈ టెట్ నిబంధనను తొలగించాలని కోరాలి కదా? ఎన్డీఏలో భాగస్వామిగా ఉండి అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రంపై ఎందుకు ఒత్తిడి తీసుకురాలేదు?" అని జగన్ విమర్శించారు. "మీరు చేయాల్సిన పని చేయలేదు. ఉపాధ్యాయుల సమస్యలను గాలికొదిలేశారు. మా పార్టీ ఎంపీల మద్దతుతో వారు తమ సమస్యను కేంద్రం దృష్టికి తీసుకెళ్తే ప్రయత్నం చేస్తే, దానికి రాజకీయ రంగు పులిమి సస్పెండ్ చేశారు. మీరు చేయలేని పనిని వారు చేయడానికి ప్రయత్నించడమే వారి తప్పా? ఒక సమస్యను పరిష్కరించలేని పోయి, దానికి రాజకీయ దురుద్దేశాలు ఆపాదించడం దారుణం. ఇంతగా ఎలా దిగజారిపోయారు?" అని జగన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉద్యోగులకు మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలన్నింటినీ చంద్రబాబు గాలికొదిలేశారని జగన్ ఆరోపించారు. ప్రభుత్వం ఏర్పడి మూడో ఏడాది నడుస్తున్నా మధ్యంతర భృతి (ఐఆర్), పీఆర్సీ హామీలు నెరవేర్చలేదని, ఐదు డీఏలు పెండింగ్‌లోనే ఉన్నాయని గుర్తుచేశారు. "చంద్రబాబు గారూ.. అధికార అహంకారంతో మీరు వ్యవహరిస్తున్న తీరును, మీ నియంతృత్వ విధానాలను ప్రజలు గమనిస్తున్నారు. వివరకు మీ నీడను చూసి కూడా మీరు సహించలేని స్థాయికి చేరుకున్నారు" అని జగన్ విమర్శించారు.

## 22ఏ భూములపై పొంగులేటి కీలక ఆదేశాలు.. ప్రజలను ఇబ్బంది పెడితే సహించేది లేదని హెచ్చరిక

హైదరాబాద్: 22ఏ నిషేధిత భూముల జాబితాలో ప్రైవేటు భూములు చేరుతున్న అంశంపై తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కీలక ఆదేశాలు జారీ చేశారు. 22ఏను అడ్డుపెట్టుకుని ప్రజలను ఇబ్బంది పెడితే సహించేది లేదని అధికారులను హెచ్చరించారు. భూ సమస్యల పరిష్కారం కోసం ప్రజలను పదేపదే కార్యాలయాల చుట్టూ తిప్పుకోవద్దని స్పష్టం చేశారు. దరఖాస్తులను జాప్యం లేకుండా పరిష్కరించాలని ఆదేశించారు. 22ఏ జాబితాలో భూమి ఉందనే కారణంతోనే దరఖాస్తును తిరస్కరించవద్దని మంత్రి సూచించారు. అసలు ఆ భూమి నిషేధిత జాబితాలోకి ఎలా వచ్చిందో పరిశీలించాలని చెప్పారు. సంబంధిత రెవెన్యూ రికార్డులను క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాతే నిర్ణయం తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. నిజమైన భూ హక్కుదారులకు న్యాయం చేస్తూనే ప్రభుత్వ భూములను కాపాడాలని సూచించారు. నిషేధిత భూముల అంశంపై రాష్ట్ర సచివాలయంలో మంత్రి పొంగులేటి సమీక్ష నిర్వహించారు. హైదరాబాద్, రంగారెడ్డి జిల్లా కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, ఆర్డీవోలు, సబ్ రిజిస్ట్రార్లు ఈ సమావేశానికి హాజరయ్యారు. ప్రజల నుంచి వస్తున్న దరఖాస్తులు, ఫిర్యాదులపై అధికారులను మంత్రి వివరాలు అడిగి తెలుసుకున్నారు. భూ సమస్యలపై ప్రజలు నేరుగా ఫిర్యాదు చేసేందుకు త్వరలో టోల్‌ఫ్రీ నంబర్ ఏర్పాటు చేస్తామని మంత్రి తెలిపారు. 22ఏ భూముల విషయంలో నిబంధనల పేరుతో ప్రజలకు అనవసర ఇబ్బందులు కలిగించకుండా సమస్యలను పరిష్కరించాలని అధికారులకు స్పష్టం చేశారు.

## 148 రోజుల్లోనే డీఎస్సీ ప్రక్రియ పూర్తి.. ప్రతి ఏటా డీఎస్సీ నిర్వహిస్తాం

అమరావతి: ఆంధ్రప్రదేశ్ శాసనసభ వర్షాకాల సమావేశాలు ఈరోజు ప్రారంభమయ్యాయి. సభలో విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ మాట్లాడుతూ... డీఎస్సీ నిర్వహణ, విద్యావ్యవస్థలో చేపట్టిన సంస్కరణలపై కీలక వివరాలు వెల్లడించారు. డీఎస్సీ పరీక్ష ప్రక్రియను ప్రభుత్వం ఎంతో బాధ్యతాయుతంగా నిర్వహించిందని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీకి కట్టుబడి ఏకంగా 148 రోజుల్లోనే నియామక ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేశామని సభకు తెలియజేశారు. రాబోయే రోజుల్లో కూడా ప్రతి ఏటా క్రమం తప్పకుండా డీఎస్సీ నిర్వహిస్తామని ఆయన స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ విద్యా వ్యవస్థను బలోపేతం చేసేందుకు విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చామని లోకేశ్ వివరించారు. ఉపాధ్యాయుల నియామకాలు, బదిలీలను అత్యంత పారదర్శకంగా తెలిపారు. ఉపాధ్యాయులకు అంతర్జాతీయ స్థాయి శిక్షణ అందించేందుకు సింగపూర్, ఫిన్‌లాండ్ వంటి దేశాలకు పంపిస్తుంటే, గత వైసీపీ ప్రభుత్వం ఉపాధ్యాయులను మద్యం దుకాణాల వద్ద నిలబెట్టి కించపరిచిందని ఎద్దేవా చేశారు. ప్రజా ప్రభుత్వంలో వ్యవస్థను ప్రక్షాళన చేసి స్వేచ్ఛ ప్రతి ఒక్కరికీ ఉందన్నారు. డీఎస్సీ నియామక ప్రక్రియపై న్యాయస్థానాల్లో 336 కేసులు దాఖలైన విషయాన్ని మంత్రి గుర్తుచేస్తూ, కోర్టు ఆదేశాలకు అనుగుణంగా దేశ చరిత్రలోనే తొలిసారిగా డీఎస్సీలో వర్టికల్, హారిజాంటల్ రిజర్వేషన్లను పక్కాగా అమలు చేశామని వెల్లడించారు. ఇక ఉపాధ్యాయ అర్హత పరీక్ష టెట్ కి సంబంధించి 3.68 లక్షల మంది అభ్యర్థుల దరఖాస్తు చేసుకోగా, అందులో 1.87 లక్షల మంది ఉత్తీర్ణత సాధించారని గణాంకాలను అసెంబ్లీ వేదికగా లోకేశ్ సమర్పించారు.

## 'దిమాగీ నక్సల్ పార్టీ'.. ఒక్క రోజులోనే 1.6 లక్షల ఫాలోవర్లు!

ఢిల్లీ: ప్రధాని నరేంద్ర మోదీ స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో ప్రస్తావించిన 'దిమాగీ నక్సల్' పదం ఇప్పుడు సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారింది. ఇదే పేరుతో ఓ కొత్త ఇన్‌స్టాగ్రామ్ ఖాతా వెలుగులోకి వచ్చింది. ఖాతా ప్రారంభించిన 24 గంటల్లోనే 1.6 లక్షలకు పైగా ఫాలోవర్లు చేరడం ఆసక్తికరంగా మారింది. 'దిమాగీ నక్సల్ పార్టీ' పేరుతో ఉన్న ఈ ఖాతాలో 62 పోస్టులు ఉన్నాయి. దాదాపు 35 ఖాతాలను ఫాలో అవుతోంది. ఇన్‌స్టాగ్రామ్‌లోని వివరాల ప్రకారం ఈ నెలలోనే ఖాతా తెరిచారు. ఇప్పటివరకు ఒకసారి యూజర్ నేమ్‌ను మార్చినట్లు సమాచారం ఉంది. అయితే ఈ ఖాతాను ఎవరు నిర్వహిస్తున్నారనే వివరాలు మాత్రం వెల్లడికాలేదు. ఇటీవల స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో ప్రధాని మోదీ 'దిమాగీ నక్సల్' అనే పదాన్ని ఉపయోగించారు. మావోయిస్టులపై పోరులో సాధించిన విజయాలను ప్రస్తావించిన ఆయన.. అడవుల్లో సాయుధ నక్సలిజాన్ని అణిచివేయగలిగామని చెప్పారు. అయితే సాయుధ నక్సల్స్ తగ్గిపోయినా.. 'దిమాగీ నక్సల్స్' ఇంకా ఉన్నారని వ్యాఖ్యానించారు. మోదీ చేసిన ఈ వ్యాఖ్యల తర్వాత అదే పేరుతో ఇన్‌స్టాగ్రామ్ ఖాతా వెలుగులోకి రావడం ఇప్పుడు సోషల్ మీడియాలో ఆసక్తి రేపుతోంది. అయితే ఖాతా వెనుక ఎవరున్నారు? దాని ఉద్దేశం ఏంటి? అనే విషయాలు మాత్రం స్పష్టంగా తెలియలేదు.

## భారత్‌లో పుట్టిన ఫేక్ న్యూస్‌ను నమ్మి.. ఇజ్రాయెల్ ప్రధాని సంచలన ప్రకటన!

ఢిల్లీ: ఇరాన్ అణు కార్యక్రమంపై ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు చేసిన కీలక వ్యాఖ్యకు ఆధారమైన సమాచారం నకిలీదని తేలింది. సోషల్ మీడియాలో ఓ గుర్తుతెలియని ఖాతా పెట్టిన తప్పుడు పోస్టు గంటల వ్యవధిలోనే ఇజ్రాయెల్, అమెరికాకు చేరింది. చివరకు అదే సమాచారాన్ని నెతన్యాహు తన ప్రసంగంలో ప్రస్తావించారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వంలోని ఐక్యరాజ్యసమితి రాయబారి మైక్ వాల్జ్ కూడా ఆ పోస్టును షేర్ చేశారు. ఆగస్టు 5న భారత్‌కు చెందిన ఓ ఎక్స్ ఖాతా ఈ తప్పుడు ప్రచారానికి తెరతీసింది. ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్ కమాండర్ బ్రిగేడియర్ జనరల్ అహ్మద్ వహీది అణ్వాయుధాల తయారీని ఎప్పటికీ ఆపబోమని చెప్పినట్లు ఆ పోస్టులో పేర్కొన్నారు. దానికి ఆయన ఫొటోతో పాటు అణు విస్ఫోటనాన్ని పోలిన ఏఐ చిత్రం జత చేశారు. అయితే వహీది అలాంటి వ్యాఖ్యలు చేసినట్లు ఎలాంటి ఆధారం లేదు. ఇరాన్ అణ్వాయుధం తయారు చేసిందన్న దానికి కూడా ఆధారాలు లేవు. ఆ పోస్టు తొలుత భారత్‌లోనే మరో ఖాతాకు చేరింది. అక్కడి నుంచి హిందీలోకి అనువదించారు. ఆ తర్వాత ఇజ్రాయెల్‌కు చెందిన 'మొసాద్ కామెంటరీ' పేరున్న ఖాతా దాన్ని మరింత ప్రచారం చేసింది. ఆ ఖాతాకు ఇజ్రాయెల్ గూఢచార సంస్థ మొసాద్‌తో సంబంధం ఉన్నట్లు ఎలాంటి నిర్ధారణ లేదు. కొద్దిసేపటికే ఇజ్రాయెల్ ఛానల్ 14 ఆ వ్యాఖ్యలను ప్రసారం చేసింది. ఆ తర్వాత నెతన్యాహు కుమారుడు యైర్ నెతన్యాహు కూడా పోస్టును షేర్ చేశారు. కొన్ని గంటల్లోనే ఈ తప్పుడు సమాచారం ఇజ్రాయెల్ ప్రధాని ప్రసంగంలోకి చేరింది. జెరూసలెంలోని మౌంట్ హెర్జల్‌లో జరిగిన కార్యక్రమంలో నెతన్యాహు దాన్ని ఇరాన్ అణ్వాయుధాలపై సంకేతంగా ప్రస్తావించారు. అమెరికా రాయబారి వాల్జ్ కూడా ఇరాన్ తన అణు ఉద్దేశాలను అంగీకరించిందంటూ పోస్టు చేశారు. అయితే తర్వాత ఆ పోస్టును ఎలాంటి వివరణ లేకుండా తొలగించారు. ఇరాన్ విదేశాంగ శాఖ ప్రతినిధి ఇస్మాయిల్ బఘాయి ఈ వైరల్ ప్రచారాన్ని ఖండించారు. ఇరాన్‌పై సాగుతున్న తప్పుడు ప్రచారంలో ఇదొక ఉదాహరణ అని చెప్పారు. ఈ ఘటన ఒక్క తప్పుడు పోస్టు ఎంత వేగంగా ప్రపంచవ్యాప్తంగా వ్యాపించగలదో చూపించింది. నిజానిజాలు నిర్ధారించకముందే అది రాజకీయ చర్చలోకి వెళ్లడం ఇప్పుడు తీవ్ర చర్చకు దారితీస్తోంది.

## బంగాళాఖాతంలో తీవ్ర అల్పపీడనం.. ఉత్తరాంధ్రకు అలర్ట్

ఢిల్లీ: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం మరింత బలపడి తీవ్ర అల్పపీడనంగా మారింది. వాయవ్య బంగాళాఖాతంలో, ఉత్తర ఒడిశా-పశ్చిమ బెంగాల్ తీరాలకు దగ్గరలో కేంద్రీకృతమైన ఈ వ్యవస్థ సోమవారం నాటికి వాయుగుండంగా మారే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) ప్రకటించింది. దీని ప్రభావంతో ఉత్తర కోస్తాంధ్రలో రానున్న నాలుగైదు రోజులు వర్షాలు కురుస్తాయని తెలిపింది. ఈ నేపథ్యంలో రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఉత్తరాంధ్ర తీర ప్రాంతానికి హెచ్చరికలు జారీ చేసింది. తీవ్ర అల్పపీడనం కారణంగా ఉత్తరాంధ్ర తీరం వెంబడి గంటకు 40 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. సముద్రం అల్లకల్లోలంగా ఉంటుందని, అలల ఉద్ధృతి ఎక్కువగా ఉంటుందని పేర్కొంది. అందువల్ల మత్స్యకారులు సముద్రంలోకి వేటకు వెళ్లవద్దని, ఇప్పటికే వెళ్లినవారు వెంటనే సురక్షిత ప్రాంతాలకు తిరిగి రావాలని అధికారులు సూచించారు. ఈ అల్పపీడన ప్రభావంతో సోమవారం శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, పోలవరం, ఏలూరు, నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో పిడుగులతో కూడిన మోస్తరు వర్షాలు పడొచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. అదేవిధంగా మన్యం, అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి, కాకినాడ, తూర్పు, పశ్చిమ గోదావరి, కృష్ణా, ప్రకాశం, చిత్తూరు జిల్లాల్లో తేలికపాటి జల్లులు కురిసే అవకాశం ఉందని తెలిపారు. ఈ వాతావరణ వ్యవస్థ ప్రభావంతో దేశవ్యాప్తంగా నైరుతి రుతుపవనాలు చురుగ్గా కదులుతున్నాయి. ముఖ్యంగా ఉత్తర ఒడిశా, పశ్చిమ బెంగాల్‌లలో అతిభారీ వర్షాలు, మధ్య భారతం మీదుగా పయనించి జమ్మూకశ్మీర్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్, ఢిల్లీ, పంజాబ్ వంటి రాష్ట్రాల్లో ఆగస్టు 18 వరకు భారీ వర్షాలు కురుస్తాయని ఐఎండీ వెల్లడించింది. అయితే, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో ఇప్పటికీ వర్షాభావ పరిస్థితులు కొనసాగుతుండటం గమనార్హం.

## రేవంత్ ఇల్లు కూడా నిషేధిత జాబితాలో ఉంది: హరీశ్ రావు

హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నివాసం కూడా నిషేధిత ఆస్తుల జాబితాలో ఉందని, దానిని ఆ జాబితా నుంచి తొలగించేందుకు ప్రభుత్వం తెరవెనుక ప్రయత్నాలు చేస్తోందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్ రావు సంచలన ఆరోపణలు చేశారు. ఈ అంశంపై సమగ్ర విచారణ జరిపి, తక్షణమే శ్వేతపత్రం విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సోమవారం హరీశ్ రావు మీడియాతో మాట్లాడుతూ, "ముఖ్యమంత్రి నివాసానికే ఈ పరిస్థితి ఎదురైతే, ఇక సామాన్య ప్రజల గతి ఏమిటి?" అని ప్రశ్నించారు. అసలు ఏ ప్రాతిపదికన ఆస్తులను నిషేధిత జాబితాలో చేర్చారో విచారణ జరపాలని, ఆ జాబితాలో ఉన్న ఆస్తులు పూర్తి వివరాలను బహిర్గతం చేయాలని కోరారు. ఈ సమస్య పరిష్కారానికి ప్రభుత్వం స్పష్టమైన కాలపరిమితిని ప్రకటించాలని డిమాండ్ చేశారు. నిషేధిత జాబితాకు సంబంధించి సమాచార హక్కు చట్టం కింద దరఖాస్తు చేసినప్పటికీ, ప్రభుత్వం నుంచి ఎటువంటి సమాధానం రావడం లేదని ఆయన విమర్శించారు.

## భాజపా జాతీయ ఉపాధ్యక్షురాలిగా పురందేశ్వరి.. కాషాయ దళం కొత్త టీమ్ ఇదే!

అమరావతి: భాజపా నూతన జాతీయ కార్యవర్గాన్ని ప్రకటించింది. 13 మంది జాతీయ ఉపాధ్యక్షులతో పాటు వివిధ కీలక పదవులకు ఎంపిక చేసిన వారి జాబితాలను విడుదల చేసింది. భాజపా జాతీయ ఉపాధ్యక్షుల జాబితాలో కేంద్ర మాజీ మంత్రి, ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి (ఆంధ్రప్రదేశ్), మాజీ సీఎం వసుంధర రాజే సింధియా(రాజస్థాన్)తో పాటు తీరథ్ సింగ్ రావత్ (ఉత్తరాఖండ్), రామ్ మాధవ్ (ఢిల్లీ), బైజయంత్ జయ్ పాండా (ఒడిశా), రేఖా వర్మ, వర్షాబెన్ నరేంద్రభాయ్ దోషీ (గుజరాత్), డాక్టర్ భారతీ ప్రవీణ్ పవార్ (మహారాష్ట్ర), సర్దార్ మన్‌ప్రీత్ సింగ్‌బాదల్ (పంజాబ్), లాల్ సింగ్ ఆర్య (మధ్యప్రదేశ్), ప్రొఫెసర్ ఎం.నాగరాజ (కర్ణాటక), ప్రొఫెసర్ తారిఖ్ మన్సూర్ (ఉత్తర్‌ప్రదేశ్), డాక్టర్ మధుచంద్ర కర్ (పశ్చిమబెంగాల్) చోటు దక్కించుకున్నారు. వీరంతా భాజపా జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ సారథ్యంలో పనిచేయనున్నారు. అలాగే, కేంద్ర మాజీమంత్రి స్మృతి ఇరానీ జాతీయ ప్రధాన కార్యదర్శుల్లో ఒకరిగా నియమితులై పార్టీలోని కీలకమైన సంస్థాగత బాధ్యతల్లోకి తిరిగి వచ్చారు.

భాజపా కొత్త టీమ్ ఇదే..

పార్టీ ప్రధాన కార్యదర్శి (సంస్థాగత): బీఎల్ సంతోష్ (ఢిల్లీ), జాతీయ సంయుక్త ప్రధాన కార్యదర్శులు: శివ్‌ప్రకాశ్ (ముంబయి), సౌదన్ సింగ్ (చండీగఢ్),, జాతీయ ప్రధాన కార్యదర్శులు: వినోద్ తావ్డే (మహారాష్ట్ర), సునీల్ బన్సాల్ (ఢిల్లీ), బిప్లబ్ కుమార్ దేబ్ (త్రిపుర), స్మృతి ఇరానీ (ఉత్తర్‌ప్రదేశ్), డా.సతీష్ పూనియా (రాజస్థాన్), గజేంద్ర పటేల్ (మధ్యప్రదేశ్), హరీష్ ద్వివేది (ఉత్తర్‌ప్రదేశ్), సంజయ్ భాటియా (హరియాణా),

జాతీయ కార్యదర్శులు: కవిత పటిదార్ (మధ్యప్రదేశ్), సురేంద్రన్ (కేరళం), డా.భోలా సింగ్ (ఉత్తర్‌ప్రదేశ్), డా ప్రదీప్ వర్మ (ఝార్ఖండ్), జగదీశ్ ఈశ్వర్‌భాయ్ పటేల్ (గుజరాత్), డా సందీప్ పాఠక్ (ఢిల్లీ), ఫాంగ్నాన్ కొన్యాక్ (నాగాలాండ్), సంగీత యాదవ్ (ఉత్తర్‌ప్రదేశ్), అనిల్ ఆంటోనీ (కేరళం), డా ఎం.వెంకటేశన్ (తమిళనాడు), మనోజ్ తిగ్గ (పశ్చిమబెంగాల్), సిద్ధార్థ శంభు (బిహార్), డా.స్వదేశ్ సింగ్ (ఢిల్లీ), మృగంకా దేవ్ బర్మన్ (అస్సాం), రోహన్ గుప్తా (గుజరాత్), జయప్రకాశ్ (ఢిల్లీ)

జాతీయ కోశాధికారి: పీయూష్ గోయల్ (మహారాష్ట్ర), జాతీయ సంయుక్త కోశాధికారి: రాజేశ్ మంగల్ (రాజస్థాన్), సెంట్రల్ ఆఫీస్ ఇన్‌ఛార్జి: తరుణ్ చుగ్ (పంజాబ్), సెంట్రల్ ఆఫీస్ కార్యదర్శి : మహేంద్ర పాండే (ఉత్తరాఖండ్), నార్త్ ఈస్ట్ కోఆర్డినేటర్- డా సంబిత్ పాత్రా (ఒడిశా), నార్త్ ఈస్ట్ జాయింట్ కోఆర్డినేటర్ - రాజీవ్ బబ్బర్ (ఢిల్లీ), ఆల్ సెల్స్ కోఆర్డినేటర్: విష్ణుదత్ శర్మ (మధ్యప్రదేశ్), ఆల్ సెల్స్ జాయింట్ కోఆర్డినేటర్స్: రితురాజ్ సిన్హా (బిహార్), విష్ణువర్ధన్ రెడ్డి (ఆంధ్రప్రదేశ్)

మోర్చా ప్రెసిడెంట్స్:

యువమోర్చా: డా.హేమాంగ్ జోషి (గుజరాత్), మహిళా మోర్చా : రూప్ కుమారి చౌధరి (ఛత్తీస్‌గఢ్), ఓబీసీ మోర్చా : అమర్‌పాల్ మౌర్య (ఉత్తర్‌ప్రదేశ్), కిసాన్ మోర్చా - బన్సిలాల్ గుర్జర్ (మధ్యప్రదేశ్), ఎస్సీ మోర్చా : శివేష్ కుమార్ రామ్ (బిహార్), ఎస్టీ మోర్చా : డా మన్నాలాల్ రావత్ (రాజస్థాన్), మైనార్టీ మోర్చా - కున్వర్ బాసిత్ అలీ (ఉత్తర్‌ప్రదేశ్), మీడియా కన్వీనర్: అనిల్ బలూని (ఉత్తరాఖండ్), మీడియా కో-కన్వీనర్లు: ఆశీష్ ఉషా అగర్వాల్ (మధ్యప్రదేశ్), ప్రదీప్ భండారి (ఢిల్లీ), సిద్ధార్థ్ యాదవ్ (ఢిల్లీ), సోషల్ మీడియా కన్వీనర్: దీపక్ మస్కే (ఛత్తీస్‌గఢ్), సోషల్ మీడియా కో-కన్వీనర్లు: ప్రీతి గాంధీ (మహారాష్ట్ర), శివానంద్ ద్వివేది (ఢిల్లీ), అలోక్ భట్ (ఉత్తరాఖండ్), అరుణ్ యాదవ్ (హరియాణా), మరోవైపు, త్వరలోనే కేంద్రమంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ జరగనున్నట్లు కేంద్రమంత్రి రామ్‌దాస్ అఠవాలే వెల్లడించారు. భాజపా, మిత్రపక్షమైన ఎన్సీపీకి చెందిన కొత్త వారిని మంత్రివర్గంలోకి తీసుకుంటారనే ప్రచారం జరుగుతోంది. సంస్థాగత మార్పులు చేసిన నేపథ్యంలో కొత్తవారికి చోటు దక్కే అవకాశాలు ఉన్నట్లు సమాచారం. తాజాగా ప్రకటించిన జాతీయ కార్యవర్గం, ఇతర ముఖ్య పదవుల్లో తెలంగాణ నుంచి ఎవరికీ చోటు దక్కకపోవడం గమనార్హం.

## బోల్తా కొట్టిన బండిని పట్టాలెక్కించామని, ఇక పరుగెత్తించడమే మిగిలింది

మొదటి పేజి తరువాయి

ప్రజా ప్రభుత్వం రైతు, మహిళ, యువతకు ప్రథమ ప్రాధాన్యతనిస్తూ ఒక్కటొక్కటిగా అన్ని సమస్యలు పరిష్కరించుకుంటూ ముందుకు వెళుతోందని చెప్పారు. విడతల వారిగా ప్రభుత్వంలోని ఖాళీలన్నీ భర్తీ చేస్తామని పునరుద్ఘాటించారు. నిరుద్యోగ యువకుల కలలను సాకారం చేయడానికి ప్రభుత్వం అన్ని రకాలుగా ప్రయత్నిస్తుందని హామీ ఇచ్చారు. ప్రజా పాలన -- ప్రగతి బాట కార్యక్రమంలో భాగంగా పరకాల నియోజకవర్గంలో ముఖ్యమంత్రి దాదాపు రూ. 424 కోట్ల మేరకు వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన, మరికొన్ని అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంభోత్సవం చేశారు. అనంతరం స్థానికంగా ఏర్పాటు చేసిన సభలో ముఖ్యమంత్రి మాట్లాడారు. ప్రజాప్రభుత్వం అధికారం చేపట్టిన మొదటి ఏడాదిలోనే 70 వేల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేసిన విషయాన్ని గుర్తుచేశారు. నిరుద్యోగ యువతకు ప్రభుత్వం తగిన ప్రాధాన్యతనిస్తోందని, ఇటీవలి కాలంలో పోలీసు నియామకాలకు నోటిఫికేషన్ జారీ చేయడమే కాకుండా వయో పరిమితిని కూడా సడలించామని వివరించారు. విడతల వారిగా నియామకాలు చేపడుతామని, రాబోయే కాలంలో ఖాళీలన్నింటినీ భర్తీ చేస్తామని స్పష్టం చేశారు. రైతులు, ఆడిబిడ్డలు, నిరుద్యోగ యువకుల సంక్షేమం కోసం ప్రభుత్వం పనిచేస్తోందని, ఇలాంటి సమయంలో యువకులు సమయం వృథా చేసుకోవద్దని సూచించారు. వరంగల్ జిల్లాకు చైతన్యం, ఉద్యమ చరిత్ర, పోరాట స్ఫూర్తి ఉందని, స్వాతంత్ర్యానంతరం కూడా ఈ జిల్లా నుంచి ప్రజా జీవితంలో సర్వం ఒడ్డిన మహనీయులు ఉన్నాయని గుర్తుచేశారు. సెప్టెంబర్ నెలలో శాసనసభ సమావేశాలను నిర్వహిస్తామని, అనుభవజ్ఞులైన ప్రతిపక్ష నాయకుడు కె. చంద్రశేఖర్ రావు సభకు హాజరై అభివృద్ధి, సంక్షేమంపై చర్చించి అవసరమైన సూచనలు, సలహాలు ఇవ్వాలని కోరారు. రాష్ట్రంలో అప్పుల భారం మోస్తూనే ఒక్కొక్కటిగా సమస్యలను పరిష్కరించుకుంటూ ముందుకు వెళుతున్నామని తెలిపారు. బోల్తా కొట్టిన బండిని పట్టాలెక్కించామని, ఇక పరుగెత్తించడమే మిగిలిందని అన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి గారు, దనసరి అనసూయ సీతక్క గారు, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ గారు, ఎంపీలు వేం నరేందర్ రెడ్డి గారు, బలరాం నాయక్ గారు, కడియం కావ్య గారు, ఎమ్మెల్సీ, పీసీసీ అధ్యక్షుడు బి. మహేష్ కుమార్ గౌడ్ గారితో పాటు ప్రజాప్రతినిధులు అధికారులు పాల్గొన్నారు.

## నిజాలు బయటకు రావాలంటే సీబీఐ విచారణ ఒక్కటే సరైన మార్గం: బొత్స సత్యనారాయణ

అమరావతి: ఆంధ్రప్రదేశ్ శాసనమండలి సమావేశాలు మెగా డీఎస్సీ వివాదంతో తీవ్ర ఉద్రిక్తతల మధ్య ప్రారంభమయ్యాయి. కూటమి ప్రభుత్వం చేపట్టిన టీచర్ నియామకాల ప్రక్రియలో పెద్ద ఎత్తున అక్రమాలు జరిగాయంటూ ప్రతిపక్ష వైసీపీ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తింది. దీనిపై సభలో సమగ్ర చర్చ జరగాలని, బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తక్షణమే రాజీనామా చేయాలని శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ డిమాండ్ చేశారు. నియామకాల్లో చోటుచేసుకున్న అవకతవకలు, స్పోర్ట్స్ కోటా కేటాయింపుల్లో అవకతవకల్లో నిజాలు బయటకు రావాలంటే సీబీఐ విచారణ ఒక్కటే సరియైన మార్గమని ఆయన స్పష్టం చేశారు. శాసనమండలిలో వైసీపీ ఇచ్చిన వాయిదా తీర్మానాన్ని చైర్మన్ తిరస్కరించడంతో సభలో ఒక్కసారిగా కలకలం రేగింది. కూటమి ప్రభుత్వం 'మెగా డీఎస్సీ' పేరుతో నిరుద్యోగులను 'దగా డీఎస్సీ'గా మోసం చేసిందని విపక్ష సభ్యులు నినాదాలతో హోరెత్తించారు. పరీక్షలు రాయని వారికి కూడా ఉద్యోగాలు ఇచ్చారనే ఆరోపణలు ఉన్నాయని, ఉద్యోగాల బేరసారాలకు సంబంధించిన ఆడియో టేపులు బయటకు వచ్చినా ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం వెనుక మర్మమేంటని బొత్స ప్రశ్నించారు. ప్రతిపక్షం లేవనెత్తిన ప్రశ్నలకు సమాధానం చెప్పలేక ప్రభుత్వం చర్చ నుంచి పారిపోతోందని విమర్శించారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన గ్రూప్-1 నియామకాలపై అధికార పక్షం చేస్తున్న ఆరోపణలనూ ప్రస్తావించారు. నిజంగా గ్రూప్-1లో అక్రమాలు జరిగాయని భావిస్తే, దానితో పాటు ప్రస్తుత డీఎస్సీ ప్రక్రియపై కూడా ఒకేసారి సీబీఐ విచారణ వేయాలని ఆయన సవాల్ విసిరారు. రాష్ట్రంలో మూడేళ్ల క్రితం నుంచి ఉద్యోగార్థులు ఎదురుచూస్తున్న తరుణంలో, మెరిట్ జాబితా నిర్వహణలో పారదర్శకత లోపించిందని దుయ్యబట్టారు.

## కేబీఆర్ పార్కు చుట్టూ కొత్త మార్పులు.. 7 అండర్‌పాస్‌లు.. 7 ఫ్లైఓవర్లు

హైదరాబాద్: కేబీఆర్ పార్కు చుట్టూ 'హెచ్--సిటీ' ప్రాజెక్టులో భాగంగా రూ.1,090 కోట్లతో చేపట్టనున్న పనులు రెండు ప్యాకేజీల్లో జరుగుతాయని నగర పోలీసు కమిషనర్ వీసీ సజ్జనర్ ఆదివారం ప్రకటించారు. ఇందులో భాగంగా ఆరు జంక్షన్లలో ఏడు చోట్ల అండర్‌పాస్‌లు, మరో ఏడు చోట్ల ఫ్లైఓవర్లు కానున్నాయని పేర్కొన్నారు. ఈ పనుల నేపథ్యంలో అమలు చేస్తున్న వన్-- వే మంగళవారం నుంచి అమలులోకి వస్తుందని ప్రకటించారు. రెండేళ్ల పాటు కొనసాగే ఈ పనుల నేపథ్యంలో వాహన చోదకులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పటిష్ట చర్యలు తీసుకుంటున్నామన్నారు.

'హెచ్--సిటీ' పనులు ఇలా..

ప్యాకేజీ--1 (3 జంక్షన్లు): (జూబ్లీహిల్స్ చెక్ పోస్ట్, కేబీఆర్ పార్క్ ఎంట్రన్స్, ముగ్ధ) కేబీఆర్ పార్క్ ఎంట్రన్స్--ముగ్ధ జంక్షన్ల వద్ద: జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ నుంచి క్యాన్సర్ హాస్పిటల్ వైపు నేరుగా వెళ్లే ట్రాఫిక్ కోసం కేబీఆర్ ఎంట్రన్స్ వద్ద 330 మీటర్ల పొడవుతో రెండు లైన్ల అండర్‌పాస్. పంజాగుట్ట నుంచి జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ వైపు వెళుతూ కుడిపైపు తిరిగే వాహనాల కోసం కేబీఆర్ పార్కు ఎంట్రన్స్ వద్ద 900 మీటర్ల పొడవుతో మూడు లైన్ల ఫస్ట్ లెవెల్ స్టీల్ ఫ్లైఓవర్. కేబీఆర్ ఎంట్రన్స్ నుంచి పంజాగుట్ట వైపు నేరుగా వెళ్లే ట్రాఫిక్ కోసం ముగ్ధ జంక్షన్ వద్ద 260 మీటర్ల పొడవుతో మూడు లైన్ల అండర్‌పాస్.

జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ జంక్షన్ వద్ద: రోడ్ నం. 45 జంక్షన్ నుంచి కేబీఆర్ పార్కు ఎంట్రన్స్, యూసుఫ్‌గూడ వైపు వెళ్లే, అక్కడ కుడిపైపు తిరిగే ట్రాఫిక్ కోసం 740 మీటర్ల 'వై ఆకారపు' (4/3/2 లేన్ల) అండర్‌పాస్. కేబీఆర్ పార్క్ ఎంట్రన్స్ నుంచి రోడ్ నం. 36 వైపు నేరుగా వెళ్లే ట్రాఫిక్ కోసం 745 మీటర్ల పొడవుతో నాలుగు లైన్ల లెవెల్ స్టీల్ ఫ్లైఓవర్. యూసుఫ్‌గూడ వైపు నుంచి రోడ్ నం.45 వైపు నేరుగా వెళ్లే ట్రాఫిక్ కోసం 770 మీటర్ల పొడవుతో రెండు లైన్ల సెకండ్ లెవెల్ స్టీల్ ఫ్లైఓవర్.

ప్యాకేజీ--2 (4 జంక్షన్లు)

(రోడ్ నం.45, ఫిలింనగర్, అగ్రసేన్, బసవతారకం క్యాన్సర్ హాస్పిటల్)

రోడ్ నం.45: ఫిలింనగర్ నుంచి జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ వైపు నేరుగా వెళ్లే ట్రాఫిక్ కోసం 290 మీటర్ల పొడవుతో రెండు లైన్ల అండర్‌పాస్. జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ నుంచి రోడ్ నం. 45 వైపు కుడివైపు వెళ్లే వాహనాల కోసం 500 మీటర్ల పొడవుతో రెండు లైన్ల ఫస్ట్ లెవెల్ స్టీల్ ఫ్లైఓవర్.

ఫిలింనగర్: అగ్రసేన్ జంక్షన్ నుంచి రోడ్ నం.45 వైపు నేరుగా వెళ్లే ట్రాఫిక్ కోసం 430 మీటర్ల పొడవుతో అండర్‌పాస్. ఫిలింనగర్ వైపు నుంచి వస్తూ అగ్రసేన్ చౌరస్తా వద్ద కుడివైపునకు తిరిగే ట్రాఫిక్ కోసం 600 మీటర్ల పొడవుతో రెండు లైన్ల ఫస్ట్ లెవెల్ స్టీల్ ఫ్లైఓవర్.

అగ్రసేన్ జంక్షన్: బసవతారకం క్యాన్సర్ హాస్పిటల్ నుంచి ఫిలింనగర్ వైపు నేరుగా వెళ్లే ట్రాఫిక్ కోసం 410 మీటర్ల పొడవుతో రెండులైన్ల అండర్‌పాస్. ఫిలింనగర్ నుంచి రోడ్ నం.12 వైపు కుడివైపు తిరిగే వాటి కోసం 590 మీటర్ల రెండు లైన్ల ఫస్ట్ లెవెల్ స్టీల్ ఫ్లైఓవర్: బసవతారకం క్యాన్సర్ హాస్పిటల్: కేబీఆర్ పార్క్ ఎంట్రన్స్ నుంచి వస్తూ అగ్రసేన్ చౌరస్తా వైపు వెళ్లే ట్రాఫిక్ కోసం 330 మీటర్ల పొడవుతో రెండు లైన్ల అండర్‌పాస్. అగ్రసేన్ చౌరస్తా నుంచి రోడ్ నం.10 వైపు వెళ్లే ట్రాఫిక్ కోసం 540 మీటర్ల పొడవుతో ఫస్ట్ లెవెల్ స్టీల్ ఫ్లైఓవర్.

ప్రయాణ ఇబ్బందులకు చెక్..

హెచ్--సిటీ ప్రాజెక్టు పూర్తయితే కేబీఆర్ పార్క్ ఎంట్రన్స్, రోడ్ నం. 45, ఫిలింనగర్, అగ్రసేన్, క్యాన్సర్ హాస్పిటల్ జంక్షన్ల వద్ద 100 శాతం, జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ వద్ద 80 శాతం మేర ప్రయాణ ఇబ్బందులు తొలగుతాయి.

## డిగ్రీ పూర్తి కాగానే క్రికెటర్ శ్రీ చరణికి ప్రభుత్వ ఉద్యోగం

అమరావతి: భారత మహిళా క్రికెట్ జట్టులో అద్భుతమైన బౌలర్‌గా రాణిస్తున్న తెలుగు తేజం శ్రీ చరణికి త్వరలోనే ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వనున్నట్లు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ప్రకటించారు. ఆమె డిగ్రీ పూర్తి చేసిన వెంటనే ఉద్యోగం కల్పించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారని వెల్లడించారు. సోమవారం ప్రారంభమైన ఏపీ అసెంబ్లీ వర్షాకాల సమావేశాల్లో మెగా డీఎస్సీ, స్పోర్ట్స్ కోటాపై జరిగిన చర్చలో ఆయన ఈ విషయాన్ని తెలిపారు. క్రీడాకారులను ప్రోత్సహించడమే తమ ప్రభుత్వ విధానమని, వారికి టెస్టులు పెట్టాల్సిన అవసరం లేదని, వారి ప్రతిభే కొలమానమని లోకేశ్ స్పష్టం చేశారు. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ.. "ప్రధాని నరేంద్ర మోదీ స్ఫూర్తితో రాష్ట్రంలో క్రీడలను, క్రీడాకారులను పెద్ద ఎత్తున ప్రోత్సహించాలన్నది మా ప్రభుత్వ నిర్ణయం. యువత క్రీడలను ఒక ప్రొఫెషన్‌గా తీసుకోవాలి, రిటైర్ అయ్యాక వారి భవిష్యత్తుకు భరోసా కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని ప్రధాని చెబుతున్నారు. కేంద్రం తీసుకొచ్చిన అద్భుతమైన క్రీడా పాలసీని స్వీకరించి, రాష్ట్రంలో మరింత పకడ్బందీగా అమలు చేస్తున్నాం" అని వివరించారు. గతంలో తమ ప్రభుత్వం క్రీడాకారులకు అండగా నిలిచిన తీరును లోకేశ్ గుర్తుచేశారు. "బ్యాడ్మింటన్ స్టార్ పీవీ సింధుకు ప్రభుత్వ ఉద్యోగం ఇచ్చింది మా ప్రజా ప్రభుత్వమే. త్వరలోనే ఆమె కన్ఫర్డ్ ఐఏఎస్ అధికారి కాబోతున్నారు. ఆమెకు భూమి కూడా కేటాయించాం. అదే విధంగా, ఉత్తరాంధ్ర బిడ్డ, ట్రాక్ అండ్ ఫీల్డ్‌లో ఒలింపిక్ ఆశాకిరణం జ్యోతి యర్రాజి విషయంలోనూ ముఖ్యమంత్రి చంద్రబాబు వెంటనే స్పందించి ప్రభుత్వ ఉద్యోగం మంజూరు చేశారు. ఇప్పుడు శ్రీ చరణికి కూడా అదే విధంగా భరోసా ఇస్తున్నాం" అని పేర్కొన్నారు.

డీఎస్సీ స్పోర్ట్స్ కోటా నియామకాలపై వైసీపీ చేస్తున్న ఆరోపణలను మంత్రి లోకేశ్ తీవ్రంగా ఖండించారు. ఈ నియామకాల ప్రక్రియ అత్యంత పారదర్శకంగా జరిగిందని స్పష్టం చేశారు. "కేంద్ర ప్రభుత్వ సూచనల మేరకు రాష్ట్రంలో గతంలో ఉన్న 29 క్రీడాంశాలను 65కి పెంచాం. వాటిలో కూడా ప్రయారిటీ-1, ప్రయారిటీ-2గా విభజించి, మొదట ప్రయారిటీ-1 అభ్యర్థులనే భర్తీ చేశాం. స్పోర్ట్స్ సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌ను 'శాప్' (ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ) ఆధ్వర్యంలో సుమారు నెల రోజుల పాటు వివిధ దశల్లో కఠినంగా నిర్వహించాం. మొత్తం ప్రక్రియ పూర్తయి, అభ్యర్థులు శిక్షణ కూడా తీసుకుని ఏడాది గడిచాక ఇప్పుడు ఆరోపణలు చేయడం బాధాకరం" అని లోకేశ్ అన్నారు. "ఏదో కూన రవికుమార్, ఎంపీ భరత్ వంటి వారు లేదా ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్‌లో ఉన్న నాయకులు సర్టిఫికెట్లు ఇచ్చేశారని, వాటిని ఆమోదించారని నిరాధార ఆరోపణలు చేస్తున్నారు. వాటికి ఆధారాలు ఉంటే బయటపెట్టాలి. శాప్ ఆధ్వర్యంలో స్పోర్ట్స్ కోటా భర్తీని ఎంతో పకడ్బందీగా పూర్తి చేశాం" అని ఆయన సభకు వివరించారు. క్రీడాకారుల భవిష్యత్తుపై ఉన్న అపోహలను తొలగించి, వారికి అన్ని విధాలా అండగా నిలవడమే తమ ప్రభుత్వ లక్ష్యమని లోకేశ్ పునరుద్ఘాటించారు.

అరుణ ప్రభ
ARUNAPRABHA TELUGU DAILY
మంగళవారం - 18- ఆగష్టు - 2026

# రక్తంలో షుగర్ పెరిగితే డయాబెటిస్ ఉన్నట్టేనా?.. వాస్తవాలేంటి?

డయాబెటిస్ లేనివారిలోనూ రక్తంలో చక్కెర తాత్కాలికంగా పెరిగే ఛాన్స్

ఆహారం, ఒత్తిడి, నిద్రలేమి దీనికి కారణం కావచ్చంటున్న వైద్య నిపుణులు

కఠినమైన వ్యాయామం తర్వాత కూడా షుగర్ లెవల్స్ తాత్కాలికంగా పెరుగుతాయని వెల్లడి

పదేపదే రీడింగ్స్ ఎక్కువగా వస్తేనే వైద్యుడిని సంప్రదించాలని సూచన



తరచూ షుగర్ పెరగడం ప్రీడయాబెటిస్‌కు తొలి సంకేతం కావొచ్చని వ్యాఖ్య

రక్తంలో చక్కెర (గ్లూకోజ్) స్థాయిలు అకస్మాత్తుగా పెరగడాన్ని చాలామంది డయాబెటిస్‌గా భావిస్తుంటారు. కానీ, డయాబెటిస్ లేని ఆరోగ్యవంతులలో కూడా షుగర్ లెవల్స్ తాత్కాలికంగా పెరగడం సాధారణమేనని వైద్య నిపుణులు చెబుతున్నారు. ఇలా ఎందుకు జరుగుతుంది? ఎంత తరచుగా పెరుగుతుంది? తిరిగి సాధారణ స్థాయికి వస్తుందా లేదా? అనేదే ముఖ్యమైన విషయం. మనం తినే ఆహారం, చేసే వ్యాయామం, నిద్రపోయే సమయం, అనుభవించే ఒత్తిడి వంటి అనేక అంశాల ఆధారంగా మన శరీరం గ్లూకోజ్ స్థాయిలను నిరంతరం సర్దుబాటు చేసుకుంటుంది. అందుకే ఒక్కసారి రీడింగ్ ఎక్కువగా వచ్చినంత మాత్రాన డయాబెటిస్ ఉందని నిర్ధారించుకోలేం.

ఆహారం, ఒత్తిడి కీలక పాత్ర

మనం పిండిపదార్థాలు (కార్బోహైడ్రేట్లు) ఉన్న ఆహారం తీసుకున్నప్పుడు, జీర్ణవ్యవస్థ వాటిని గ్లూకోజ్‌గా విడగొడుతుంది. ఈ గ్లూకోజ్ రక్తంలో కలిసి షుగర్ స్థాయిలను పెంచుతుంది. దీనికి ప్రతిస్పందనగా క్లోమం ఇన్సులిన్‌ను విడుదల చేస్తుంది. ఈ ఇన్సులిన్ రక్తంలోని గ్లూకోజ్‌ను కండరాలు, ఇతర కణజాలాల్లోకి చేరవేసి శక్తిగా మార్చడంలో సహాయపడుతుంది. తెల్ల అన్నం, బంగాళాదుంపలు, తీపి పానీయాలు వంటివి షుగర్ లెవల్స్‌ను వేగంగా పెంచుతాయి. అదే సమయంలో ఫైబర్ ఎక్కువగా ఉండే కూరగాయలు, ప్రోటీన్లు, ఆరోగ్యకరమైన కొవ్వులతో కూడిన ఆహారం తీసుకుంటే గ్లూకోజ్ నెమ్మదిగా రక్తంలో కలుస్తుంది.

అంతేగాక తీవ్రమైన ఒత్తిడికి గురైనప్పుడు కూడా షుగర్ రీడింగ్స్ ఎక్కువగా ఉండొచ్చు. ఒత్తిడి సమయంలో కార్టిసాల్, అడ్రినలిన్ వంటి హార్మోన్లు విడుదలవుతాయి. ఇవి కాలేయంలో నిల్వ ఉన్న గ్లూకోజ్‌ను రక్తంలోకి విడుదల చేయమని సంకేతాలిస్తాయి. ఇది శరీర సహజ ప్రతిస్పందన అయినప్పటికీ, తాత్కాలికంగా షుగర్ లెవల్స్ పెరుగుతాయి. అనారోగ్యం, జ్వరం, నిద్రలేమి వంటివి కూడా ఇన్సులిన్ పనితీరును ప్రభావితం చేసి గ్లూకోజ్ స్థాయిలను పెంచుతాయి.

వ్యాయామం, మందుల ప్రభావం

ఏరోబిక్స్ వంటి వ్యాయామాలు సాధారణంగా రక్తంలో చక్కెరను తగ్గించడానికి సహాయపడతాయి. అయితే, కఠినమైన వ్యాయామం చేసినప్పుడు శరీరం శక్తి కోసం అడ్రినలిన్‌ను విడుదల చేస్తుంది. ఇది కాలేయం నుండి ఎక్కువ గ్లూకోజ్‌ను రక్తంలోకి పంపేలా చేస్తుంది. ఫలితంగా వ్యాయామం తర్వాత కొంతసేపు షుగర్ లెవల్స్ పెరిగినట్టు కనిపించవచ్చు. అయితే, క్రమం తప్పని వ్యాయామం దీర్ఘకాలంలో ఇన్సులిన్ సెన్సిటివిటీని మెరుగుపరుస్తుంది. కొన్ని రకాల మందులు, ముఖ్యంగా స్టెరాయిడ్స్ వంటివి కూడా గ్లూకోజ్ స్థాయిలను పెంచుతాయి. కొత్త మందులు వాడిన తర్వాత రీడింగ్స్ తరచుగా ఎక్కువగా ఉంటే, మీరే మందులు ఆపకుండా వైద్యుడిని సంప్రదించడం ముఖ్యం.

ఎప్పుడు తీవ్రంగా పరిగణించాలి?

ఒక్కసారి రీడింగ్ ఎక్కువగా వచ్చినంత మాత్రాన కంగారు పడాల్సిన పనిలేదు. కానీ, తరచుగా రీడింగ్స్ ఎక్కువగా వస్తుంటే, దానికి తోడు అధిక దాహం, తరచుగా మూత్రవిసర్జన, కారణం లేకుండా బరువు తగ్గడం, తీవ్రమైన అలసట, దృష్టి మసకబారడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యుడిని సంప్రదించాలి. పదేపదే గ్లూకోజ్ స్థాయిలు పెరగడం అనేది శరీరం ఇన్సులిన్‌కు తక్కువగా స్పందిస్తుందనడానికి సంకేతం. దీన్నే 'ప్రీడయాబెటిస్' అంటారు. ఈ దశలో లక్షణాలు కనిపించకపోవచ్చు.

అందుకే అధిక బరువు, కుటుంబంలో డయాబెటిస్ చరిత్ర, అధిక రక్తపోటు వంటి ప్రమాద కారకాలు ఉన్నవారు పరీక్షలు చేయించుకోవడం మంచిది. వైద్యులు ఫాస్టింగ్ బ్లడ్ గ్లూకోజ్, ఎహెచ్1సి వంటి పరీక్షలు చేసి గత 2-3 నెలల సగటు గ్లూకోజ్ స్థాయిలను అంచనా వేస్తారు. అంతిమంగా ఒక షుగర్ రీడింగ్ అనేది కేవలం ఒక కొలమానం మాత్రమే, అదే వ్యాధి నిర్ధారణ కాదు. తరచుగా రీడింగ్స్ ఎక్కువగా ఉంటేనే దాన్ని తీవ్రంగా పరిగణించాలని వైద్య నిపుణులు చెబుతున్నారు.

# సూక్ష్మ పోషకాలు: ఏవి ఎందుకు అవసరమో తెలుసుకోండి!

శరీరానికి తక్కువ మోతాదులో అవసరమయ్యే విటమిన్లు, ఖనిజాలే సూక్ష్మ పోషకాలు

రోగనిరోధక శక్తి, ఎముకల ఆరోగ్యం, శక్తి ఉత్పత్తికి ఇవి అత్యంత కీలకం

విటమిన్ ఎ కంటి చూపుకు, ఐరన్ రక్త వృద్ధికి, కాల్షియం ఎముకల పటిష్టతకు అవసరం



సమతుల ఆహారం ద్వారానే ఈ పోషకాలను తగినంతగా పొందడం సాధ్యం

మన శరీరం ఒక సంక్లిష్టమైన యంత్రం లాంటిది. ఇది సక్రమంగా పనిచేయాలంటే కేవలం పిండిపదార్థాలు, ప్రోటీన్లు, కొవ్వులు వంటి స్థూల పోషకాలు మాత్రమే సరిపోవు. వాటితో పాటు చాలా తక్కువ పరిమాణంలో అవసరమయ్యే విటమిన్లు, ఖనిజ లవణాలు కూడా అత్యంత కీలకం. వీటినే సూక్ష్మ పోషకాలు అని పిలుస్తారు. ఇవి మన శరీరానికి నేరుగా శక్తిని ఇవ్వకపోయినా, జీవక్రియలు సజావుగా సాగడంలో, రోగనిరోధక శక్తిని పెంచడంలో, అవయవాల పనితీరులో కీలక పాత్ర పోషిస్తాయి. రోజువారీ ఆహారంలో మనం తీసుకునే పదార్థాల ద్వారానే వీటిని పొందగలం. మన ఆరోగ్యానికి అత్యవసరమైన కొన్ని ముఖ్యమైన సూక్ష్మ పోషకాలు, వాటి ఉపయోగాలు, అవి లభించే ఆహార పదార్థాల జాబితా ఇక్కడ ఉంది.

విటమిన్లు:

విటమిన్ ఎ: ఇది కంటి చూపును మెరుగుపరచడంలో కీలక పాత్ర పోషిస్తుంది. రేచీకటి వంటి సమస్యలను నివారిస్తుంది. రోగనిరోధక శక్తిని పెంచడంతో పాటు చర్మ ఆరోగ్యాన్ని కాపాడుతుంది. క్యారెట్లు, గుమ్మడికాయ, చిలగడదుంప, ఆకుకూరల్లో ఇది పుష్కలంగా లభిస్తుంది.

విటమిన్ బి12: శరీరంలో ఎర్ర రక్త కణాల తయారీకి, నరాల వ్యవస్థ పనితీరుకు ఇది చాలా అవసరం. డీఎన్ఏ సంశ్లేషణలోనూ దీనిది ముఖ్యమైన పాత్ర. శాకాహారులలో దీని లోపం ఎక్కువగా కనిపిస్తుంది. పాలు, గుడ్లు, చేపలు, మాంసం వంటి వాటిలో ఇది లభిస్తుంది.

ఫోలేట్ (విటమిన్ బి9): గర్భిణులకు ఇది అత్యంత ముఖ్యమైన విటమిన్. కణ విభజన, డీఎన్ఏ తయారీ, ఎర్ర రక్త కణాల ఉత్పత్తికి ఫోలేట్ అవసరం. ఆకుకూరలు, పప్పు ధాన్యాలు, శనగల్లో ఇది సమృద్ధిగా ఉంటుంది.



విటమిన్ సి: ఇది ఒక శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్. రోగనిరోధక శక్తిని బలోపేతం చేస్తుంది. చర్మం, ఎముకలు, కండరాలను కలిపి ఉంచే కొల్లాజెన్ తయారీకి ఇది కీలకం. శరీరం ఐరన్‌ను గ్రహించడానికి కూడా సహాయపడుతుంది. ఉసిరి, జామ, నారింజ, నిమ్మ వంటి పండ్లలో ఇది అధికంగా ఉంటుంది.

విటమిన్ డి: 'సన్‌షైన్ విటమిన్' అని పిలిచే ఇది, శరీరం కాల్షియంను గ్రహించడానికి చాలా అవసరం. ఎముకలు, దంతాల పటిష్టతకు, కండరాల పనితీరుకు ఇది కీలకం. సూర్యరశ్మి ద్వారా శరీరం దీన్ని తయారు చేసుకుంటుంది. కొవ్వు ఉన్న చేపలు, గుడ్లలోనూ లభిస్తుంది.

విటమిన్ ఇ: ఇది కూడా ఒక యాంటీఆక్సిడెంట్. శరీర కణాలను ఫ్రీ రాడికల్స్ నష్టం నుంచి కాపాడుతుంది. చర్మ సౌందర్యాన్ని పెంచుతుంది. బాదం, వేరుశనగ, పొద్దుతిరుగుడు విత్తనాలలో ఇది ఎక్కువగా ఉంటుంది.

విటమిన్ కె: రక్తం గడ్డకట్టే ప్రక్రియలో ఇది ప్రధాన పాత్ర పోషిస్తుంది. గాయాలు తగిలినప్పుడు అధిక రక్తస్రావాన్ని నివారిస్తుంది. ఎముకల ఆరోగ్యానికి కూడా ఇది చాలా అవసరం. ఆకుపచ్చని ఆకుకూరలు, బ్రోకలీలో విటమిన్ కె సమృద్ధిగా దొరుకుతుంది.

ఖనిజాల లవణాలు

ఐరన్: శరీరంలో హిమోగ్లోబిన్ తయారీకి ఐరన్ అత్యంత కీలకం. ఇది ఊపిరితిత్తుల నుంచి శరీరంలోని అన్ని భాగాలకు ఆక్సిజన్‌ను రవాణా చేస్తుంది. దీని లోపం వల్ల రక్తహీనత వస్తుంది. ఆకుకూరలు, పప్పులు, మాంసం, బెల్లంలో ఇది అధికంగా లభిస్తుంది.

కాల్షియం: ఎముకలు, దంతాల నిర్మాణానికి, వాటి పటిష్ఠతకు కాల్షియం ప్రధాన ఆధారం. కండరాల సంకోచ వ్యాకోచాలకు, నరాల పనితీరుకు కూడా ఇది అవసరం. పాలు, పెరుగు, నువ్వులు, రాగి వంటి వాటిలో కాల్షియం పుష్కలంగా దొరుకుతుంది.

మెగ్నీషియం: శరీరంలో జరిగే వందలాది జీవక్రియలకు మెగ్నీషియం అవసరం. శక్తి ఉత్పత్తి, కండరాలు, నరాల పనితీరును నియంత్రిస్తుంది. గింజలు, విత్తనాలు, ఆకుకూరలలో ఇది సమృద్ధిగా ఉంటుంది.

జింక్: రోగనిరోధక వ్యవస్థ సక్రమంగా పనిచేయడానికి జింక్ చాలా ముఖ్యం. గాయాలు త్వరగా మానడానికి, డీఎన్ఏ, ప్రోటీన్ల సంశ్లేషణకు సహాయపడుతుంది. పప్పులు, గింజలు, మాంసంలో జింక్ లభిస్తుంది.

అయోడిన్: థైరాయిడ్ గ్రంథి సరైన రీతిలో పనిచేయడానికి, థైరాయిడ్ హార్మోన్లను ఉత్పత్తి చేయడానికి అయోడిన్ అవసరం. అయోడైజ్డ్ ఉప్పు, సముద్రపు చేపలలో ఇది ఉంటుంది.

పొటాషియం: శరీరంలోని ద్రవాల సమతుల్యతను కాపాడటంలో, నరాల సంకేతాలను ప్రసారం చేయడంలో, కండరాల పనితీరులో ఇది సహాయపడుతుంది. అరటిపండు, బంగాళాదుంప, పప్పు ధాన్యాలలో ఇది ఎక్కువగా దొరుకుతుంది.

సెలీనియం: ఇది కూడా ఒక యాంటీఆక్సిడెంట్. థైరాయిడ్ పనితీరుకు, కణాలను నష్టం నుంచి కాపాడటానికి సహాయపడుతుంది. చేపలు, గుడ్లు, గింజలలో సెలీనియం లభిస్తుంది.

కాబట్టి, మన రోజువారీ ఆహారంలో రంగురంగుల పండ్లు, కూరగాయలు, ఆకుకూరలు, పప్పు ధాన్యాలు, గింజలు చేర్చుకోవడం ద్వారా ఈ సూక్ష్మ పోషకాలను తగినంతగా పొంది, సంపూర్ణ ఆరోగ్యంతో జీవించవచ్చు. ఆరోగ్యమే మహాభాగ్యం అని గుర్తుంచుకోవాలి.

# జిమ్ చేస్తున్నారా? హెల్తీగా తింటున్నారా? అయినా హార్ట్ ఎటాక్ రావొచ్చు.. కారణమేంటంటే!



జిమ్‌కు వెళ్తున్నారు.. క్రమం తప్పకుండా వ్యాయామం చేస్తున్నారు.. ఆరోగ్యకరమైన ఆహారం తీసుకుంటున్నారు.. బరువు కూడా అదుపులోనే ఉంది. మరి గుండెకు ఎలాంటి ప్రమాదం ఉండదని అనుకుంటున్నారా? అది పూర్తిగా నిజం కాదు. బయటికి ఎంతో ఫిట్‌గా కనిపించే వ్యక్తుల్లోనూ గుండెపోటు వచ్చే ప్రమాదం ఉంటుంది. ఇందుకు ప్రధాన కారణాల్లో ఒకటి.. శరీరంలో నిశ్శబ్దంగా పెరిగే అధిక కొలెస్ట్రాల్!

భారత్‌లో ముఖ్యంగా యువతలో గుండెపోటు కేసులు పెరుగుతున్నాయన్న ఆందోళన వ్యక్తమవుతోంది. సాధారణంగా అధిక బరువు, వ్యాయామం లేకపోవడం, ధూమపానం వంటి వాటినే గుండెపోటుకు ప్రధాన కారణాలుగా భావిస్తాం. అయితే ఫిట్‌నెస్ ఒక్కటే గుండె ఆరోగ్యానికి పూర్తి రక్షణ ఇవ్వదని నిపుణులు చెబుతున్నారు.

ఫిట్‌గా ఉన్నా.. గుండెకు ముప్పు ఎలా?

ఓ 44 ఏళ్ల వ్యక్తిని ఉదాహరణగా తీసుకుంటే.. అతను క్రమం తప్పకుండా హాఫ్ మారథాన్‌లో పాల్గొనేవాడు. ఆరోగ్యకరమైన ఆహారం తీసుకునేవాడు. ధూమపానం చేసేవాడు కాదు. బరువు కూడా సాధారణంగానే ఉండేది. అయితే పరుగెత్తుతున్న సమయంలో ఛాతిలో అసౌకర్యం కలగడంతో వైద్యులను సంప్రదించాడు. సాధారణ పరీక్షల్లో పెద్దగా సమస్య కనిపించలేదు. కానీ రక్త పరీక్షలో ఎల్‌డీఎల్ కొలెస్ట్రాల్ 190 ఎంజీ/డీఎల్‌గా తేలింది. తదుపరి పరీక్షల్లో గుండెకు రక్తాన్ని సరఫరా చేసే ధమనుల్లో ఏకంగా 90 శాతం బ్లాకేజీ ఉన్నట్లు గుర్తించారు. చివరకు అతనికి యాంజియోప్లాస్టీ చేయాల్సి వచ్చింది.

కొలెస్ట్రాల్ అంటే లావు మాత్రమే కాదు!

కొలెస్ట్రాల్ గురించి చాలామందిలో ఒక అపోహ ఉంది. శరీరంలో కొవ్వు ఎక్కువగా ఉంటేనే కొలెస్ట్రాల్ పెరుగుతుందని భావిస్తారు. కానీ అది నిజం కాదు. కొలెస్ట్రాల్‌లో ఎక్కువ భాగాన్ని మన శరీరమే, ముఖ్యంగా కాలేయం, ఉత్పత్తి చేస్తుంది. అందువల్ల సన్నగా ఉన్నవారిలోనూ కొలెస్ట్రాల్ స్థాయిలు ప్రమాదకరంగా పెరగవచ్చు.

ముఖ్యంగా ఫ్యామిలియల్ హైపర్‌కొలెస్టెరోలీమియా వంటి జన్యుపరమైన పరిస్థితులు ఉన్నవారిలో మంచి ఆహారం తీసుకున్నా, రోజూ వ్యాయామం చేసినా ఎల్‌డీఎల్ స్థాయిలు అధికంగా ఉండొచ్చు.

అసలు ప్రమాదం ఏంటంటే..

అధిక కొలెస్ట్రాల్‌ను 'సైలెంట్ కిల్లర్' అని ఎందుకు అంటారు. అది పెరుగుతున్నప్పుడు సాధారణంగా ఎలాంటి స్పష్టమైన లక్షణాలు కనిపించవు. రక్తంలో అధికంగా ఉన్న ఎల్‌డీఎల్ కొలెస్ట్రాల్ క్రమంగా ధమనుల గోడల్లో పేరుకుపోతుంది. కాలక్రమంలో అక్కడ ప్లాక్ ఏర్పడి రక్తనాళాలను ఇరుకుగా చేస్తుంది. గుండెకు రక్త సరఫరా తగ్గే వరకు చాలామందికి తమ శరీరంలో ఏం జరుగుతుందో తెలియకపోవచ్చు.

ఛాతినొప్పి, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, అసాధారణ అలసట వంటి లక్షణాలు కనిపించే సమయానికి సమస్య ఇప్పటికే ముదిరి ఉండొచ్చు. కొందరిలో అయితే హార్ట్ ఎటాక్ రావడమే మొదటి హెచ్చరికగా మారుతుంది.

భారతీయులకు మరింత జాగ్రత్త అవసరం

భారతీయుల్లో ఇతర పాశ్చాత్య జనాభాతో పోలిస్తే తక్కువ వయసులోనే కరోనరీ ఆర్టరీ వ్యాధులు వచ్చే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. అందుకే చిన్న వయసులో ఉన్నాం, ఫిట్‌గా ఉన్నాం, జిమ్ చేస్తున్నాం కాబట్టి గుండె విషయంలో ఎలాంటి పరీక్షలు అవసరం లేదనుకోవడం సరికాదు. ముఖ్యంగా కుటుంబంలో చిన్న వయసులోనే గుండెజబ్బులు వచ్చిన చరిత్ర ఉంటే మరింత అప్రమత్తంగా ఉండాలి.

30 ఏళ్లకే కొలెస్ట్రాల్ పరీక్ష?

నిపుణుల సూచన ప్రకారం కొలెస్ట్రాల్ స్థాయిలను చిన్న వయసులోనే పరీక్షించుకోవడం మంచిది. సాధారణ లిపిడ్ ప్రొఫైల్ ద్వారా ఎల్‌డీఎల్, హెచ్‌డీఎల్, ట్రైగ్లిజరైడ్స్ వంటి ముఖ్యమైన వివరాలు తెలుసుకోవచ్చు. అవసరాన్ని బట్టి వైద్యులు లైపోప్రొటీన్(ఎ), ఆపోబీ, ఎల్‌డీఎల్ పార్టికల్ టెస్టింగ్, సీఏసీ స్కోరింగ్ వంటి అదనపు పరీక్షలను సూచించవచ్చు. ముఖ్యంగా కుటుంబ చరిత్ర, వయసు, ఇతర ఆరోగ్య పరిస్థితులను బట్టి ఏ పరీక్ష అవసరమో వైద్యుడే నిర్ణయించాలి.

వ్యాయామం ఆపేయాలా? అస్సలు కాదు!

అధిక కొలెస్ట్రాల్ ప్రమాదం ఉందని తెలుసుకున్నంత మాత్రాన వ్యాయామాన్ని ఆపేయాల్సిన అవసరం లేదు. వ్యాయామం, సమతుల ఆహారం, సరైన బరువు.. ఇవన్నీ గుండె ఆరోగ్యానికి ముఖ్యమైనవే. అయితే అవి మాత్రమే సరిపోవు. వాటితో పాటు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడం కూడా అవసరం. బయటికి కనిపించే ఫిట్‌నెస్ మన ఆరోగ్యానికి ఒక భాగం మాత్రమే. రక్తంలో దాగి ఉన్న కొలెస్ట్రాల్ స్థాయిలు కూడా తెలుసుకోవాలి.

**గమనిక:** ఈ సమాచారం కేవలం అవగాహన కోసం మాత్రమే. వైద్య సలహాకు ప్రత్యామ్నాయంగా భావించొద్దు. ఎలాంటి ఆరోగ్య సమస్యలున్నా వైద్యులను సంప్రదించాలి.

# తిన్నది వంటపట్టడం లేదా?

రోజూ ఇలా చేయండి!

ఆరోగ్యకరమైన జీర్ణవ్యవస్థ కోసం నిపుణులు సూచిస్తున్న సాధారణ అలవాట్లు


ఆహారాన్ని నెమ్మదిగా, బాగా నమిలి తినాలి

భోజనానికి, నిద్రకు మధ్య కనీసం రెండు గంటల విరామం అవసరం

తిన్న వెంటనే కాసేపు నెమ్మదిగా నడవడం జీర్ణక్రియకు మేలు

తగినంత నీరు తాగడం, మితంగా తినడం చాలా ముఖ్యం

వ ం న ం తీసుకునే ఆహారం శరీరానికి శక్తినివ్వాలి. కానీ, ఆధునిక జీవనశైలిలో చాలామందికి తిన్నది సరిగ్గా జీర్ణం కాక గ్యాస్, అజీర్తి, కడుపు ఉబ్బరం వంటి సమస్యలు సర్వసాధారణం అయ్యాయి. మనం తినే పద్ధతిలో కొన్ని చిన్న మార్పులు చేసుకోవడం ద్వారా ఈ ఇబ్బందులను సులభంగా అధిగమించవచ్చు. తిన్న ఆహారం సక్రమంగా వంటపట్టి, శరీరం ఆరోగ్యంగా ఉండటానికి సహాయపడే ముఖ్యమైన అలవాట్ల గురించి తెలుసుకుందాం.



1. నెమ్మదిగా నమిలి తినడం

జీర్ణప్రక్రియ కడుపులో కాదు, నోట్లోనే మొదలవుతుంది. ఆహారాన్ని ఎంత బాగా నమిలితే, లాలాజలంలోని ఎంజైమ్‌లతో అంత బాగా కలిసి చిన్న ముక్కలుగా మారుతుంది. దీనివల్ల కడుపుపై భారం తగ్గి, జీర్ణక్రియ సులభమవుతుంది. చాలామంది హడావుడిగా, సరిగ్గా నమలకుండా మింగేస్తుంటారు. దీనివల్ల పెద్ద ఆహార ముక్కలను అరిగించడానికి జీర్ణాశయం తీవ్రంగా శ్రమించాల్సి వస్తుంది. ఫలితంగా అజీర్తి, గ్యాస్ వంటి సమస్యలు తలెత్తుతాయి. అందుకే ప్రతి ముద్దను కనీసం 20 నుంచి 30 సార్లు నమిలి తినడం అలవాటు చేసుకోవాలి. ఇది త్వరగా కడుపు నిండిన భావన కలిగించి, అతిగా తినడాన్ని కూడా నియంత్రిస్తుంది.

2. సమయపాలన పాటించడం

మన శరీరానికి ఒక జీవ గడియారం (బయోలాజికల్ క్లాక్) ఉంటుంది. రోజూ ఒకే సమయానికి భోజనం చేయడం వల్ల, ఆ సమయానికి జీర్ణరసాలు సక్రమంగా విడుదలై జీర్ణవ్యవస్థ చురుగ్గా పనిచేస్తుంది. సమయం కాని సమయాల్లో తినడం, భోజనం మానేయడం జీర్ణవ్యవస్థను గందరగోళానికి గురిచేస్తుంది. ముఖ్యంగా, తిన్న వెంటనే నిద్రపోవడం లేదా వ్యాయామం చేయడం వంటివి అస్సలు మంచిది కాదు. భోజనం తర్వాత కనీసం 10-15 నిమిషాల పాటు నెమ్మదిగా నడవడం వల్ల జీర్ణక్రియ మెరుగుపడుతుంది. రాత్రిపూట వీలైనంత త్వరగా భోజనం చేయడం అత్యంత ముఖ్యమైన అలవాటు. దీనివల్ల జీర్ణవ్యవస్థకు రాత్రంతా దాదాపు 10 నుంచి 12 గంటల పాటు పూర్తి విశ్రాంతి లభిస్తుంది.

3. సరైన మోతాదులో ఆహారం, నీరు

శరీరానికి నీరు చాలా అవసరం. కానీ భోజనం చేసేటప్పుడు ఎక్కువగా నీరు తాగితే, జీర్ణరసాలు పలుచబడి జీర్ణక్రియ మందగిస్తుంది. అందుకే భోజనానికి అరగంట ముందు, తిన్న అరగంట తర్వాత నీళ్లు తాగడం ఉత్తమమైన పద్ధతి. అలాగే, కడుపు బిగిసేలా తినకుండా, కాస్త ఖాళీ ఉంచుకొని మితంగా తినాలి. ఒకేసారి ఎక్కువ ఆహారం తీసుకోవడం జీర్ణాశయంపై తీవ్ర ఒత్తిడిని పెంచి, అజీర్ణానికి దారితీస్తుంది.



ఈ మూడు సాధారణ అలవాట్లను మన దైనందిన జీవితంలో భాగం చేసుకుంటే, ఎలాంటి మందులు లేకుండానే జీర్ణ సంబంధిత సమస్యలను దూరం చేసుకోవచ్చు. తద్వారా సంపూర్ణ ఆరోగ్యాన్ని సొంతం చేసుకోవచ్చు.

## ప్రముఖ కరాటే మాస్టర్
## ఎడ్ల వెంకటేష్ కు మార్షల్ ఆర్ట్స్ కరాటే లో 5 డాన్




నిజామాబాద్ నగరానికి చెందిన అంతర్జాతీయ బ్రూస్లీ అవార్డ్ గ్రహీత, గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ యూకె గోల్డ్ మెడలిస్ట్ ఎడ్ల వెంకటేష్ కరాటేలో 5వ డాన్ కన్ఫర్మ్ డిగ్రీ సాధించారు.ఒకినవా మార్షల్ ఆర్ట్స్ అకాడమీ తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల కరాటే మాస్టర్ లలో చిన్న వయసులో బ్లాక్ బెల్ట్ 5వ డాన్ కన్ఫర్మ్ సాధించడం విశేషం,16 ఆగస్ట్ ఆదివారం రోజున ఒకినవా మార్షల్ ఆర్ట్స్ మరియు జపాన్ కరాటే షాటోకై ఇండియా గ్రాండ్ మాస్టర్ ఎస్. శ్రీనివాసన్ నిర్వహించిన బ్లాక్ బెల్ట్ 5వ డాన్ కటాస్ & స్పారింగ్ ఎగ్జామ్ లో నిజామాబాద్ నగరానికి చెందిన ప్రముఖ కరాటే మాస్టర్ ఎడ్ల వెంకటేష్ ఉత్తమ ప్రతిభ కనబరిచి బ్లాక్ బెల్ట్ 5వ డాన్ డిగ్రీ సాధించారు.ఈ ఎగ్జామ్ అనంతరం గ్రాండ్ మాస్టర్ శ్రీనివాసన్ మార్షల్ ఆర్ట్స్ లోని కీలకమైన అడ్వాన్స్ కటాస్ ను ఎడ్ల వెంకటేష్ కు వివరంగా శిక్షణ ఇచ్చారు.ఈ సందర్భంగా గ్రాండ్ మాస్టర్ శ్రీనివాసన్ మాట్లాడుతూ నిజామాబాద్ నగరంలో కరాటే లో గత 25 సంవత్సరాలుగా క్రమశిక్షణతో కూడిన నాణ్యమైన కరాటే విద్యను అందించడంలో ఒకినవా మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఎడ్ల వెంకటేష్ ముందంజలో ఉంటారని కొనియాడారు.ఈ సందర్భంగా ఎడ్ల వెంకటేష్ తన గ్రాండ్ మాస్టర్ శ్రీనివాసన్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతూ ఈ తెలంగాణ రాష్ట్రంలో నిజామాబాద్ జిల్లాను కరాటే లో నంబర్ 1 గా చేయడమే తన లక్ష్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో హెడ్ క్వాటర్ చీఫ్ ఇన్ స్ట్రక్టర్ రమేష్ ఉన్నారు.

## బడులలో అసంపూర్తి పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయించాలి

నాణ్యతా ప్రమాణాలు పాటించని కాంట్రాక్టర్ లను బ్లాక్ లిస్టులో పెడతాం

వారం రోజుల్లోపు ఏకరూప దుస్తులు పంపిణీ చేయాలి

కలెక్టర్ తో కలిసి అధికారులతో సమీక్ష నిర్వహించిన ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి



నిజామాబాద్, ఆగస్టు 17 : ప్రభుత్వ విద్యా సంస్థలలో మౌలిక సదుపాయాలను మరింతగా మెరుగుపర్చేందుకు వీలుగా చేపట్టిన పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయించాలని ప్రభుత్వ సలహాదారు పి.సుదర్శన్ రెడ్డి సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని స్టేట్ చాంబర్ లో సోమవారం ఆయన కలెక్టర్ భవేష్ మిశ్రాతో కలిసి వివిధ శాఖల పనితీరుపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. వివిధ పాఠశాలల్లో పెండింగ్ లో ఉన్న అసంపూర్తి పనులను గుర్తించి, విద్యార్థులు సంఖ్య, స్థానిక అవసరాలకు అనుగుణంగా ప్రాధాన్యతా క్రమంలో చేపట్టి పూర్తి చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఎక్కడ కూడా తాగునీరు, టాయిలెట్స్ వంటి సమస్యలు లేకుండా చూడాలన్నారు. విద్యార్థులు ప్రయోజనాల విషయంలో ఎంతమాత్రం రాజీ పడకూడదని, నూటికి నూరు శాతం పనులు నాణ్యతతో జరిగేలా పకడ్బందీ పర్యవేక్షణ చేయాలన్నారు. నాణ్యతా ప్రమాణాలు పాటించని కాంట్రాక్టర్ లను బ్లాక్ లిస్టులో పెట్టాలని అధికారులకు సూచించారు. పెండింగ్ పనులను పూర్తి చేసేందుకు అవసరమైన నిధుల విషయమై ఉన్నతాధికారులను సంప్రదించి మంజూరు చేయిస్తానని తెలిపారు. అయితే పనులను పూర్తి చేయించే విషయంలో నిర్లక్ష్యం వహించకుండా, విద్యార్థులకు అన్ని సదుపాయాలు అందుబాటులో ఉండేలా చూడాలని హితవు పలికారు. మరుగుదొడ్లు, మూత్రశాలల నిర్మాణాలు, మరమ్మతుల కోసం వీబీజీరాంజీ పథకం కింద ప్రతిపాదనలు పంపాలని, నిధులను పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకునేలా చొరవ చూపాలన్నారు. జిల్లాలోని అన్ని పాఠశాలల విద్యార్థిని, విద్యార్థులకు వారం రోజుల్లోపు ఏకరూప దుస్తులు (యూనిఫాంలు) పంపిణీ జరిగేలా చర్యలు తీసుకోవాలని, స్వయం సహాయక సంఘాల ద్వారా యూనిఫాంలను వేగవంతంగా కుట్టించాలని ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి సూచించారు. ఉపాధ్యాయుల కొరత నెలకొని ఉన్న బడులలో ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా బోధకులను ఏర్పాటు చేసి, విద్యార్థులకు నాణ్యమైన విద్యను బోధించేలా కృషి చేయాలన్నారు. పౌర సరఫరాల శాఖ పనితీరును సమీక్షిస్తూ, డిఫాల్ట్ రైస్ మిల్లర్లపై చేపట్టిన చర్యల గురించి అడిగి తెలుసుకున్నారు. ఇప్పటివరకు ఎంత మంది నుండి ఏమేరకు బకాయిలు రాబట్టగలిగారు, ఇంకా ఎంత మంది సీ.ఎం.ఆర్ కు సంబంధించిన బకాయిలు చెల్లించేందుకు సముఖంగా ఉన్నారు తదితర వివరాలను ఆరా తీశారు. బకాయిలు చెల్లించని మిల్లర్లకు నోటీసులు జారీ చేసి, రెవెన్యూ రికవరీ యాక్టు కింద కేసులు నమోదు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. పంచాయతీ శాఖ పనితీరును సమీక్షిస్తూ, ప్రతి గ్రామ పంచాయతీ పరిధిలో పారిశుధ్యం పనులు, తాగునీటి సరఫరా సక్రమంగా జరిగేలా రోజువారీగా పకడ్బందీ పర్యవేక్షణ చేయాలన్నారు. ఈ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించే పంచాయతీ కార్యదర్శులపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. నిజామాబాద్ నగర పాలక సంస్థ పరిధిలోనూ ఇంటింటి చెత్తను వెంటదివెంట తరలించేందుకు వీలుగా డంపింగ్ యార్డ్ మల్టిపుల్ పాయింట్స్ ను ఏర్పాటు చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్ కు సూచించారు. సమీక్షా సమావేశంలో జెడ్పీ సీ.ఈ.ఓ సాయాగౌడ్, డీ.ఆర్.డీ.ఓ సాయన్న, డీ.ఎస్.ఓ శ్రీకాంత్ రెడ్డి, సివిల్ సప్లైస్ డీ.ఎం ప్రవీణ్, డీ.ఈ.ఓ పి.అశోక్, డీ.పీ.ఓ శ్రీనివాస్ రావు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణికి 80 ఫిర్యాదులు



నిజామాబాద్, ఆగస్టు 17 : ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ భవేష్ మిశ్రా అధికారులను ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 80 ఫిర్యాదులు అందాయి. వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్ తో పాటు, అదనపు కలెక్టర్ భుజంగరావు, ట్రైనీ కలెక్టర్ సురేష్, డీఆర్ఓ గీత, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, జిల్లా పరిషత్ సీఈఓ సాయాగౌడ్, డీపీఓ శ్రీనివాస్, డీఆర్డీఓ సాయన్న, ట్రైనీ ఆర్డీఓ సందీప్, రూరల్ ఎస్.హెచ్.ఓ శ్రీనివాస్ లకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా, ఫిర్యాదులను పెండింగ్ లో



పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. అన్ని శాఖల అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## యక్కంటి వెంకటరెడ్డికి
## 'మానం ఇన్‌స్పిరేషన్ ఆఫ్ ఇండియా అవార్డు--2026'




హైదరాబాద్ ఆగస్టు 17 (అరుణ ప్రభ) సామాజిక సేవా కార్యక్రమాలు, వ్యాపార రంగంలో విశిష్ట సేవలకు గుర్తింపుగా కూల్ ఎవరెస్ట్ ఐస్‌క్రీమ్స్ వ్యవస్థాపకుడు, లయన్స్ క్లబ్ ఆఫ్ కూకట్‌పల్లి అధ్యక్షుడు యక్కంటి వెంకటరెడ్డి (వైవీఆర్)కు 'మానం ఇన్‌స్పిరేషన్ ఆఫ్ ఇండియా అవార్డు--2026' ప్రదానం చేశారు.మానం ఫౌండేషన్ ఆధ్వర్యంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా హైదరాబాద్‌లోని చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభ కళాక్షేత్రంలో నిర్వహించిన కార్యక్రమంలో ఈ అవార్డును అందజేశారు. వ్యాపార రంగంలో తనదైన ముద్ర వేసుకోవడంతో పాటు సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ సమాజానికి స్ఫూర్తిగా నిలుస్తున్నందుకు వెంకటరెడ్డిని ఈ పురస్కారంతో సత్కరించినట్లు నిర్వాహకులు తెలిపారు.పేదలు, నిరుపేదలు, అవసరంలో ఉన్నవారికి అండగా నిలుస్తూ వివిధ సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్న వెంకటరెడ్డి ప్రజలతో సన్నిహిత అనుబంధాన్ని ఏర్పరుచుకున్నారని పేర్కొన్నారు. సమాజం పట్ల ఆయనకున్న బాధ్యత, సేవా దృక్పథాన్ని గుర్తించి ఈ అవార్డును ప్రదానం చేసినట్లు తెలిపారు.అవార్డు అందుకున్న సందర్భంగా వెంకటరెడ్డి మాట్లాడుతూ, తన సేవలను గుర్తించి ఈ గౌరవాన్ని అందించడం ఆనందంగా ఉందన్నారు. భవిష్యత్తులో మరింత బాధ్యతతో సామాజిక సేవా కార్యక్రమాలను కొనసాగిస్తూ ప్రజలకు సేవ చేస్తానని తెలిపారు.సామాజిక సేవకు ప్రోత్సాహకంగా నిలిచిన ఈ పురస్కారం తన సేవా ప్రయాణంలో మరో మైలురాయిగా నిలిచిందని వెంకటరెడ్డి పేర్కొన్నారు.


## నిశ్చితార్థ వేడుకలో
## పాల్గొన్న మాజీ జెడ్పీటీసీ కామిరెడ్డి శ్రీలత

కాబోయే నవదంపతులకు అక్షింతలు వేసి ఆశీర్వాదం.. శుభాకాంక్షలు తెలిపిన శ్రీలత



అరుణ ప్రభ:- మణుగూరు మండలంలోని డీవీ ఫంక్షన్ హాల్‌లో భూక్య సూర్యం--సుశీల దంపతుల కుమారుడు కృష్ణకుమార్--శ్రీలేఖల నిశ్చితార్థ వేడుక వైభవంగా జరిగింది. ఈ వేడుకకు బూర్గంపాడు మండల మాజీ జెడ్పీటీసీ కామిరెడ్డి శ్రీలత ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా కాబోయే నవవధూవరులకు అక్షింతలు వేసి ఆశీర్వదించిన శ్రీలత, వారి వైవాహిక జీవితం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో సాగాలని ఆకాంక్షిస్తూ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. కుటుంబ సభ్యులతో ఆత్మీయంగా ముచ్చటిస్తూ నిశ్చితార్థ వేడుకలో పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల నాయకులు కొనకంచి శ్రీను, తిరుపతి ఎసుబు, సోము లక్ష్మీ చైతన్య రెడ్డి, బెజ్జంకి కనకచారి, కర్రి నాగేశ్వరరావు, మణికంఠ, రిపోర్టర్ రాజా, గ్రామ పెద్దలు, బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొని కాబోయే నవదంపతులకు శుభాకాంక్షలు తెలిపారు.

## మనసుతో బేరసారాలు వద్దు



ప్రగతి సాధనే ముద్దు
మనిషి
మనసు కోరికలపుట్ట
కోరికలు అపరిమితం
కోరికలుతీర్చుకోవడంలో
పోటీపడతాడు

మనసుతో ఎప్పుడూ
బేరసారాలు ఆడుకూడదు
మెదడు ఎప్పుడూ
సుఖాన్ని కోరుకుంటుంది
గొప్ప విజయాలు
సాధించాలంటే ఆగిపో
నీవు చేయలేవు అని
ఆజ్ఞాపిస్తుంది

మనసు వినిపించే మాటలు
ఖాతరు చేయక కర్తవ్యాన్ని
పూర్తి చెయ్యాల్సిందే

ఆలోచనల అలజడిలో
అడుగులు తడబడనీయకు
క్షణం క్షణం మారే మనసుతో
బేరసారాలు చేయకు
యువత సాకులు వెతికే
సోమరితనానికి
స్వస్తి పలకాలి

పయనించాలి

మనసు ఒక మాయాజాలం
దాన్ని అంచనావేయడం కష్టం
మనసు ఆజ్ఞలకు లొంగిపోవద్దు
చేసే పనిలో శ్రద్ధ నైపుణ్యంతో




సాధించాలనే బలమైన
సంకల్ప మే యువత
శ్వాస కావాలి

భారత మాత గడ్డపై
నవశకాన్ని ప్రారంభించు
యువతరం మేలుకో
ప్రగతిని ఏలుకో
దీక్ష పట్టుదల ఆయుధమైతే
విజయాలు నీవశమౌతాయి
నిరాశ నిస్పృహలు
చీల్చుకుంటూ
అభివృద్ధి మార్గాన

ప్రగతి పురోగతి మార్గాన సాగిపోవాలి
మీ ప్రతిభను సమాజ ప్రగతికి
ఉపయోగించండి

ఓ యువత సాకులు వీడి సాగిపో
సంకల్పమే శ్వాసగా దేశ ప్రగతికి
బాటలు వేయి
నీశ్రమతో నవ భారతాన్ని నిర్మించి
వికసిత భారత్ లక్ష్యంగా సాగిపో

నేదునూరి కనకయ్య
రచయిత కాలమిస్ట్
కరీంనగర్94402345771

## ఖతార్‌లో తెలుగు సంఘాల ఐక్యత
## మల్లేశ్ సుంకరి కుటుంబానికి రూ.11,19,970 ఆర్థిక సహాయం

మృతదేహాన్ని స్వగ్రామానికి పంపించేందుకు సమష్టి కృషి.

కుమార్తె వివాహ నేపథ్యంలో కుటుంబానికి అండగా తెలుగు సంఘాలు

సహాయక కార్యక్రమంలో భాగస్వాములైన పలు సంఘాలు, దాతలు.



నిజామాబాద్ జిల్లా కొత్తపేట గ్రామానికి చెందిన మల్లేశ్ సుంకరి జూలై 23న ఖతార్‌లో గుండెపోటుతో ఆకస్మికంగా మృతి చెందారు. ఉపాధి కోసం విదేశాలకు వెళ్లిన ఆయన అకస్మాత్తుగా ప్రాణాలు కోల్పోవడంతో కుటుంబ సభ్యులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు.ఈ విషయం తెలుసుకున్న రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గద్దె భూమన్న, తెలంగాణ ప్రజా సమితి ఖతార్ అధ్యక్షుడు గద్దె శ్రీనివాస్ స్పందించారు. మల్లేశ్ కుటుంబ సభ్యులతో మాట్లాడి వారికి ధైర్యం చెప్పడంతోపాటు, మృతదేహాన్ని ఖతార్ నుంచి స్వగ్రామానికి పంపించేందుకు అవసరమైన ఏర్పాట్లపై దృష్టిసారించారు.



సంబంధిత వ్యక్తులు, సంఘాల ప్రతినిధులతో సమన్వయం చేసుకుంటూ మృతదేహం కొత్తపేట గ్రామానికి చేరేలా చర్యలు చేపట్టారు.మల్లేశ్ కుమార్తె వివాహం కొద్ది రోజుల్లోనే జరగనున్న విషయం తెలుసుకున్న గద్దె భూమన్న, గద్దె శ్రీనివాస్ కుటుంబానికి ఆర్థికంగా అండగా నిలవాలని నిర్ణయించారు. ఖతార్‌లోని తెలుగు సంఘాల ప్రతినిధులతో మాట్లాడి, బాధిత కుటుంబానికి తమవంతు సహాయం అందించాలని కోరారు.వారి విజ్ఞప్తికి ఖతార్‌లోని తెలుగు సంఘాలు, తెలుగు ప్రజలు, దాతలు స్పందించారు. ఆంధ్ర కళా వేదిక (ూఖ౦) ఆధ్వర్యంలో పెద్ద మొత్తంలో విరాళాలు సేకరించారు. ఆ సంస్థ అధ్యక్షుడు రమణయ్య, మేనేజ్‌మెంట్ సభ్యులు సహాయక కార్యక్రమంలో భాగస్వాములై కుటుంబానికి అండగా నిలిచారు.తెలంగాణ ప్రజా సమితి ఖతార్ (ప్రూా ఘ్ఖుతీ) కూడా స్వచ్ఛందంగా విరాళాల సేకరణ చేపట్టింది. సంఘం సభ్యులు, శ్రేయోభిలాషులు, దాతల నుంచి సహాయాన్ని సమీకరించడంలో తెలంగాణ ప్రజా సమితి ప్రతినిధులు కృషి చేశారు.తెలంగాణ వెల్ఫేర్ అసోసియేషన్ (౹ఔూ) అధ్యక్షుడు షోయెబ్, కమిటీ సభ్యులు తమవంతు సహకారం అందించారు. తెలంగాణ గల్ఫ్ సమితి (౹ఈు) అధ్యక్షుడు మధు, ఆ సంస్థ మేనేజ్‌మెంట్ సభ్యులు కూడా విరాళాల సేకరణలో భాగస్వాములై బాధిత కుటుంబానికి చేయూతనిచ్చారు.అన్ని తెలుగు సంఘాలు, వాటి కార్యవర్గ సభ్యులు, దాతలు, శ్రేయోభిలాషుల సహకారంతో మొత్తం రూ.11,19,970 సేకరించారు. ఖతార్‌లో సేకరించిన ఈ మొత్తాన్ని మల్లేశ్ సుంకరి కుటుంబానికి అందజేశారు. కుమార్తె వివాహం సమీపిస్తున్న సమయంలో అందిన ఈ సహాయం కుటుంబానికి ఆర్థికంగా కొంత భరోసా కల్పించింది.మృతదేహాన్ని స్వగ్రామానికి పంపించే ఏర్పాట్ల నుంచి విరాళాల సేకరణ, కుటుంబానికి ఆర్థిక సహాయం అందించడం వరకు చేపట్టిన కార్యక్రమంలో గద్దె భూమన్న, గద్దె శ్రీనివాస్ సమన్వయంతో వ్యవహరించారు. గత పది రోజులుగా ప్రతి అంశాన్ని పర్యవేక్షిస్తూ, కుటుంబ సభ్యులకు ఎప్పటికప్పుడు సమాచారం అందించడంతోపాటు వారికి ధైర్యం చెప్పారు.ఈ సేవా కార్యక్రమంలో రాధిక, సాయి, యెముల అందించిన సహకారం ముఖ్యమైనదని నిర్వాహకులు తెలిపారు. విరాళాల సేకరణతోపాటు అవసరమైన ఏర్పాట్లు, సమన్వయంలో మంద లక్ష్మణ్, అజ్జం నవీన్, నల్లవల్లి మోహన్, ఎలిశెట్టి రమేష్ కృషి చేశారు.బాధిత కుటుంబానికి సహాయం అందించేందుకు ముందుకొచ్చిన ఆంధ్ర కళా వేదిక అధ్యక్షుడు రమణయ్య, మేనేజ్‌మెంట్ సభ్యులు, తెలంగాణ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు షోయెబ్, కమిటీ సభ్యులు, తెలంగాణ గల్ఫ్ సమితి అధ్యక్షుడు మధు, మేనేజ్‌మెంట్ సభ్యులకు గద్దె భూమన్న, తెలంగాణ ప్రజా సమితి ఖతార్ అధ్యక్షుడు గద్దె శ్రీనివాస్ కృతజ్ఞతలు తెలిపారు.తెలంగాణ ప్రజా సమితి ఖతార్ సభ్యులు, ఆంధ్ర కళా వేదిక సభ్యులు, తెలంగాణ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు, తెలంగాణ గల్ఫ్ సమితి సభ్యులతోపాటు సహాయం అందించిన ప్రతి దాతకు ధన్యవాదాలు తెలిపారు. చిన్న మొత్తమైనా, పెద్ద మొత్తమైనా సహాయం అందించిన ప్రతి ఒక్కరి భాగస్వామ్యంతోనే రూ.11,19,970 సమీకరించడం సాధ్యమైందని పేర్కొన్నారు.విషయం తెలిసిన వెంటనే స్పందించిన వారు, మృతదేహాన్ని స్వగ్రామానికి పంపించేందుకు సహకరించిన వారు, విరాళాల సేకరణలో పాల్గొన్న వారు, దాతలను సంప్రదించిన వారు, కుటుంబ సభ్యులతో సమన్వయం చేసిన వారు, ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా సహాయం అందించిన ప్రతి ఒక్కరి సేవలు విలువైనవని నిర్వాహకులు పేర్కొన్నారు.ఖతార్‌లోని తెలుగు సంఘాలు ప్రాంతాలు, సంఘాల మధ్య భేదాలకు తావులేకుండా ఒక కుటుంబానికి అండగా నిలవడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. కష్టకాలంలో పరస్పరం సహాయం చేసుకోవాలనే సందేశాన్ని ఈ కార్యక్రమం అందించిందని తెలిపారు.ఈ సందర్భంగా మల్లేశ్ సుంకరికి నివాళులర్పిస్తూ, ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. మల్లేశ్ కుటుంబానికి భవిష్యత్తులోనూ అవసరమైన నైతిక సహకారం అందించాలని తెలుగు సంఘాల ప్రతినిధులు కోరారు.

# ఆకాష్--లలిత నిశ్చితార్థ వేడుకలో మాజీ జెడ్పీటీసీ కామిరెడ్డి శ్రీలత



అరుణ ప్రభ:-పాల్వంచ మండలంలోని పెద్దమ్మతల్లి సన్నిధిలో గల శ్రీ సాయి గణేష్ ఫంక్షన్ హాల్‌లో సోమవారం ఆకాష్--లలితల నిశ్చితార్థ వేడుక ఘనంగా జరిగింది.స్పైసీ రెస్టారెంట్ అధినేత నాగేశ్వరరావు--జ్యోతి దంపతుల కుమారుడు ఆకాష్ నిశ్చితార్థ వేడుకకు బూర్గంపాడు మండల మాజీ జెడ్పీటీసీ కామిరెడ్డి శ్రీలత--రామకొండారెడ్డి దంపతులు హాజరై కాబోయే నవవధూవరులను ఆశీర్వదించారు. అక్షింతలు వేసి నూతన జంటకు శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఆకాష్--లలితలు సుఖసంతోషాలతో నిండు నూరేళ్లు ఆనందంగా జీవించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పోతిరెడ్డి గోవిందరెడ్డి--నాగమణి దంపతులు, ఆవుల రామాంజిరెడ్డి--శ్రీదేవి దంపతులు, ఇలవల రాజశేఖర్‌రెడ్డి--మాధవి దంపతులు, బిజ్జం ప్రసన్న, సురేష్‌తో పాటు గ్రామ పెద్దలు, బంధుమిత్రులు పాల్గొని కాబోయే దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు.

# సోంపల్లిపై పోలవరం ముంపు ముప్పు.. రక్షణ చర్యలు చేపట్టాలి

## కిన్నెరసాని బ్యాక్‌వాటర్‌తో భయాందోళన.. ముంపు జాబితాలో గ్రామాన్ని చేర్చాలని ఎంపీడీవోకు వినతి



బూర్గంపాడు, ఆగస్టు 17 (ప్రజా క్షేత్రం): పోలవరం ప్రాజెక్టు ప్రభావంతో పాటు కిన్నెరసాని బ్యాక్‌వాటర్ కారణంగా సోంపల్లి గ్రామానికి ముంపు ముప్పు పొంచి ఉందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. భవిష్యత్‌లో భారీ వరదలు సంభవిస్తే గ్రామంలోని ఇళ్లు, వ్యవసాయ భూములు నీట మునిగే ప్రమాదం ఉందని పేర్కొంటూ, సోంపల్లిని పోలవరం ముంపు ప్రభావిత ప్రాంతాల జాబితాలో చేర్చాలని కోరారు.ఈ మేరకు సోంపల్లి గ్రామస్తులు బూర్గంపాడు మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీవో) జమలారెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు. కిన్నెరసాని బ్యాక్‌వాటర్‌తో పాటు వాగులు, వరదల ప్రభావానికి గ్రామం గురయ్యే పరిస్థితి ఉందని వారు వివరించారు. బూర్గంపాడుకు కరకట్ట నిర్మాణం చేపట్టినప్పటికీ, బ్యాక్‌వాటర్ ప్రభావం సోంపల్లి వైపు ఉండటంతో రైతులు, గ్రామస్థుల్లో ఆందోళన నెలకొందని తెలిపారు.ఇప్పటికే కిన్నెరసాని వరదల కారణంగా గ్రామంలోని పలువురు రైతుల వ్యవసాయ భూములు కోతకు గురయ్యాయని, దీంతో తీవ్రంగా నష్టపోతున్నామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. పోలవరం ప్రాజెక్టు పూర్తయిన అనంతరం గోదావరి నీటిమట్టాలు పెరిగే అవకాశం ఉన్న నేపథ్యంలో భవిష్యత్‌లో సోంపల్లిపై ముంపు ప్రభావం మరింత పెరిగే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.ముందస్తు చర్యలే మేలని వేడుకోలుముంపు వచ్చిన తర్వాత చర్యలు తీసుకోవడం కంటే ముందుగానే ప్రమాదాన్ని గుర్తించి రక్షణ చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరారు. సోంపల్లిని ముంపు ప్రభావిత గ్రామంగా గుర్తించి, కరకట్టలు, రక్షణ గోడలు తదితర అవసరమైన చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. చిన్న, సన్నకారు రైతుల భూములు, గ్రామస్తుల ఇళ్లకు నష్టం లేకుండా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. గ్రామ సమస్యను ఉన్నతాధికారులు దృష్టికి తీసుకువెళ్లి సోంపల్లికి శాశ్వత రక్షణ కల్పించేలా చర్యలు చేపట్టాలని ఎంపీడీవో జమలారెడ్డిని గ్రామస్తులు కోరారు.

# పేదింటి ఆడబిడ్డల పెళ్లిళ్లకు అండేది? కళ్యాణ లక్ష్మి.. షాదీ ముబారక్ చెక్కులు వెంటనే విడుదల చేయాలి: బీఆర్ఎస్ డిమాండ్









అరుణ ప్రభ:- బూర్గంపాడు పేద కుటుంబాల్లో ఆడబిడ్డ పెళ్లి అంటే ఆర్థిక భారం.. అలాంటి కుటుంబాలకు అండగా నిలిచిన కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలే ఇప్పుడు ఆధారంగా మారాయి. అయితే ఈ పథకాల కింద రావాల్సిన ఆర్థిక సాయం పెండింగ్‌లో ఉండటంతో లబ్ధిదారులు ఎదురుచూస్తున్నారని బీఆర్ఎస్ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. పెండింగ్ చెక్కులను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో బూర్గంపాడులో నిరసన చేపట్టారు.భారత రాష్ట్ర సమితి రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు, పినపాక నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు ఆదేశాలతో నిర్వహించిన ఈ నిరసనలో బీఆర్ఎస్ నాయకులు తహసీల్దార్ కార్యాలయం, ఎంపీడీవో కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించారు. అనంతరం సంబంధిత అధికారులకు వినతిపత్రాలు అందజేశారు.ఈ సందర్భంగా బీఆర్ఎస్ మాజీ బూర్గంపాడు జడ్పీటీసీ కామిరెడ్డి శ్రీలత మాట్లాడుతూ.. పేదింటి ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక భరోసా కల్పించాలనే ఉద్దేశంతో గత బీఆర్ఎస్ ప్రభుత్వం కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను అమలు చేసిందన్నారు. ఈ పథకాల ద్వారా వేలాది పేద కుటుంబాలకు వివాహ సమయంలో ఆర్థిక చేయూత లభించిందని పేర్కొన్నారు."పేదల సంక్షేమం కోసం ప్రవేశపెట్టిన పథకాలను నిర్లక్ష్యం చేయొద్దు. పెండింగ్‌లో ఉన్న చెక్కులను వెంటనే విడుదల చేయాలి" అని ఆమె ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అదేవిధంగా ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన తులం బంగారం హామీని అమలు చేయాలని కోరారు.పేద కుటుంబాల్లో ఆడబిడ్డల వివాహాలు ఆగిపోకుండా, తల్లిదండ్రులపై ఆర్థిక భారం పడకుండా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ బూర్గంపాడు వర్కింగ్ ప్రెసిడెంట్ జలగం జగదీష్, బూర్గంపాడు మండల యూత్ అధ్యక్షులు గోనెల నాని, సారపాక టౌన్ అధ్యక్షులు కొనకంచి శ్రీనివాస్, పినపాక నియోజకవర్గ యూత్ అధ్యక్షులు చల్లకోటి పూర్ణ, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు దారం కృష్ణారెడ్డి, బిఆర్ఎస్ పార్టీ ఉద్యమ నాయకులు గుర్రం సుదర్శన్, సారపాక పట్టణ యూత్ అధ్యక్షులు సోము లక్ష్మీ చైతన్య రెడ్డి, గుల్ మహమ్మద్, కర్రీ నాగేశ్వరరావు, బెజ్జంకి కనకాచారి, దాసరి మోహన్ రావు, పంగి సురేష్, మణికంఠ,బిఆర్ఎస్ పార్టీ మహిళా నాయకురాలు తాళ్ల గోమ్మూరు సర్పంచ్ గుమ్మడి కృష్ణవేణి, బూర్గంపాడు మాజీ సర్పంచ్ సిరిపురం స్వప్న, వెంకటరమణ, ఝాన్సీ రాణి, బిఆర్ఎస్ ముఖ్య నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# శిరసెత్తిన శిఖరాలు అమ్మా--బాపుల జీవితాన్ని శాశ్వత శిఖరాలుగా నిలిపిన మానవీయ విలువల అక్షర స్మారకం




డా నలిమెల భాస్కర్ రచించిన "శిరసెత్తిన శిఖరాలు -- అమ్మా బాపుల జీవన చిత్రణ" పై డా పెరుక రాజు సమీక్షకొన్ని పుస్తకాలు చదివి మూసివేస్తాం. కొన్ని పుస్తకాలు మనసును కదిలిస్తాయి. కానీ మరికొన్ని పుస్తకాలు జీవితాన్ని కొత్తగా అర్థం చేసుకోవడం నేర్పిస్తాయి. డా నలిమెల భాస్కర్ రచించిన "శిరసెత్తిన శిఖరాలు -- అమ్మా బాపుల జీవన చిత్రణ" అలాంటి అరుదైన గ్రంథం. ఇది కేవలం ఒక రచయిత తన తల్లిదండ్రులకు సమర్పించిన స్మృతిగ్రంథం మాత్రమే కాదు తెలంగాణ పల్లె జీవన విధానానికి, కుటుంబ విలువలకు, ఉపాధ్యాయ ధర్మానికి, ప్రకృతి ప్రేమకు, మానవీయ సంబంధాలకు, నిజాయితీకి అక్షరరూపంలో నిర్మించిన శాశ్వత స్మారకం.ఆషాఢం--2026లో సాహితీ సోపతి తెలంగాణ ప్రచురించిన 112 పేజీల ఈ గ్రంథం పరిమాణంలో చిన్నదైనా, భావగర్భితంలో మహత్తరమైనది. ప్రతి అధ్యాయం ఒక జ్ఞాపకం మాత్రమే కాదు---ఒక జీవన పాఠం. ప్రతి సంఘటన ఒక కుటుంబ చరిత్ర మాత్రమే కాదు ఒక తరం జీవించిన విలువలకు సజీవ సాక్ష్యం.1956లో నేటి రాజన్న సిరిసిల్ల జిల్లా, ఎల్లారెడ్డిపేట మండలం, నారాయణపురంలో శ్రీ రామచంద్రం -- శ్రీమతి బుచ్చమ్మ దంపతులకు జన్మించిన డా. నలిమెల భాస్కర్ బహుభాషావేత్త, పరిశోధకుడు, అనువాదకుడు, విశ్రాంత డిగ్రీ--పీజీ కళాశాల ఉపన్యాసకుడు. పద్నాలుగు భాషల్లో ప్రావీణ్యం సాధించి, నలభై ఐదుకు పైగా గ్రంథాలను, వాటిలో పదిహేను అనువాద గ్రంథాలను తెలుగు పాఠకులకు అందించారు. కేంద్ర సాహిత్య అకాడమీ అనువాద పురస్కారం, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ కాళోజీ పురస్కారం సహా అనేక ప్రతిష్ఠాత్మక పురస్కారాలు ఆయన సాహిత్య సేవకు లభించాయి. తన తల్లిదండ్రుల పేరుతో సాహితీ పురస్కారాన్ని ప్రారంభించడం ఆయన కృతజ్ఞతాభావానికి నిలువెత్తు నిదర్శనం.ఈ గ్రంథంలోని హృదయం బుచ్చమ్మ. ఆమె ఒక తల్లి మాత్రమే కాదు కుటుంబాన్ని తన శ్రమతో, ప్రేమతో, క్రమశిక్షణతో నిలబెట్టిన జీవనశిల్పి. తెల్లవారుజామున నాలుగు గంటలకే నిద్రలేచి, ముఖంపై చల్లని నీళ్లు చల్లి, "భాస్కర్... లేవురా! పాశి నోటితో చదివితే పాఠాలు మనసులో బాగా నిలుస్తాయి" అని తన కుమారుడిని ప్రేమగా నిద్రలేపే తల్లి రూపం పాఠకుడి కళ్లముందు సజీవంగా నిలుస్తుంది. ఆ తర్వాత ఇంటి పనులను ప్రారంభిస్తూ, ప్రతి పాత్రను పరిశుభ్రంగా ఉంచడం, కుటుంబ సభ్యుల అభిరుచికి తగ్గట్టుగా రుచికరమైన వంటలు చేయడం, ఇంటిని ఆప్యాయతతో నింపడం---ఇవన్నీ ఆమె వ్యక్తిత్వంలోని క్రమశిక్షణ, శ్రమ, మమకారాన్ని తెలియజేస్తాయి. తన పిల్లల భవిష్యత్తు కోసం ఆమె పడిన కష్టం, చేసిన త్యాగం, అనుభవించిన నిశ్శబ్ద పోరాటం ఈ గ్రంథంలో అత్యంత హృద్యమైన అధ్యాయంగా నిలుస్తుంది. బుచ్చమ్మ జీవితం ఒక తల్లి ప్రేమకు మాత్రమే కాదు కుటుంబాన్ని విలువలతో తీర్చిదిద్దిన మాతృశక్తికి చిరస్మరణీయ నిదర్శనం.రామచంద్రం ఒక తండ్రి మాత్రమే కాదు ఆదర్శ ఉపాధ్యాయుడు, నిజాయితీకి నిలువెత్తు నిదర్శనం, కర్తవ్యనిరతికి ప్రతీక. వాగులు, వంకలు, అడవిదారులు, వర్షాలు, వరదలను లెక్కచేయకుండా పాఠశాలకు చేరుకుని విద్యాబోధ చేసిన ఆయన జీవితం చదివినప్పుడు ఉపాధ్యాయ వృత్తి ఎంత పవిత్రమైనదో స్పష్టమవుతుంది. ప్రాణం కంటే విధినే గొప్పదిగా భావించిన ఆయన నిబద్ధత నేటి ఉపాధ్యాయులకు, యువతకు ఆదర్శప్రాయమైనది.పిల్లల చదువును జీవిత ధ్యేయంగా భావించిన తండ్రి, ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా విద్య విషయంలో ఎక్కడా రాజీపడలేదు. పిల్లల ఉన్నత విద్య, ఉద్యోగ స్థిరీకరణ, వివాహాలు---ప్రతి బాధ్యతను విలువలతో నిర్వహించారు. ప్రభుత్వ ఉద్యోగంలో ఉన్నప్పటికీ రచయిత కట్నం లేకుండా వివాహం చేసుకోవడం, అదే సమయంలో తన సోదరీమణుల వివాహ బాధ్యతలను నిర్వర్తించడం ఈ కుటుంబం ఆచరణలో చూపిన విలువలకు నిదర్శనం.లంబాడీల తండాలో రాత్రివేళ ఒంటరిగా విధులు నిర్వర్తించిన రామచంద్రం గారి ధైర్యం సరిహద్దులో కాపలా కాసే ఒక జవాను అప్రమత్తతను గుర్తు చేస్తుంది. లంచానికి జీవితాంతం దూరంగా నిలిచిన ఆయన వ్యక్తిత్వం నేటి సమాజానికి ఒక మౌన సందేశం.ఈ పుస్తకం మనిషి--మనిషి సంబంధాలను మాత్రమే కాదు మనిషి--ప్రకృతి సంబంధాన్ని కూడా అత్యంత హృద్యంగా ఆవిష్కరిస్తుంది. అడవిని తల్లిగా భావించిన ఆ తరం జీవన తత్వం, ప్రకృతిని కాపాడితేనే భావితరాలు సురక్షితమవుతాయనే సందేశం ఈ గ్రంథంలో అంతర్లీనంగా ప్రవహిస్తుంది. నేటి పర్యావరణ సంక్షోభ కాలంలో ఈ ఆలోచన మరింత ప్రాసంగికంగా అనిపిస్తుంది.పశువులను కుటుంబ సభ్యుల్లా ప్రేమించిన రోజుల్ని రచయిత ఎంతో ఆత్మీయంగా చిత్రించారు. ఒక బర్రె దూడ చనిపోతే కుటుంబమంతా దుఃఖించిన సంఘటన మనిషి--ప్రకృతి--జీవరాశుల మధ్య ఉన్న ఆత్మీయ బంధాన్ని గుర్తు చేస్తుంది. దమ్మన్నపేట ముచ్చట్లు, అక్క--బావలు, అల్లుళ్లు, చుట్టరికం, తెలంగాణ పల్లెల మల్లెలాంటి మనుషుల అనుబంధం ఈ గ్రంథాన్ని ఒక సామాజిక--సాంస్కృతిక దస్తావేజుగా నిలబెడుతుంది.డా. నలిమెల భాస్కర్ భాషలో కృత్రిమ అలంకారాల కంటే సహజత్వమే ఎక్కువ. తెలంగాణ నుడికారాన్ని సాహిత్య గౌరవంతో వినిపిస్తూ, జీవితం ఎలా ఉందో అలా చిత్రించారు. ఎక్కడా అతిశయోక్తి లేదు; ఎక్కడా కల్పిత నాటకీయత లేదు. అందుకే ప్రతి పుట పాఠకుడి హృదయాన్ని నేరుగా తాకుతుంది.కంటి లేజర్ చికిత్స అనంతరం ఆరోగ్యం పూర్తిగా సహకరించకపోయినా రచనలు, అనువాదాలు, సాహిత్య సేవను నిరంతరం కొనసాగిస్తున్న రచయిత నిజమైన సాహిత్య తపస్వి. గురువు అంటే పాఠాలు చెప్పేవాడు మాత్రమే కాదు తన జీవితాన్నే పాఠ్యగ్రంథంగా మార్చేవాడని ఆయన నిరూపించారు.డా. నలిమెల భాస్కర్ తన తల్లిదండ్రులను కేవలం స్మరించలేదు; వారి జీవితాన్ని సాహిత్యంగా శాశ్వతం చేశారు. అందుకే ఈ గ్రంథంలో బుచ్చమ్మ మాతృత్వానికి శిఖరం, రామచంద్రం గురుత్వానికి, నిజాయితీకి శిఖరం. ఈ రెండు శిఖరాల మధ్య పెరిగిన కుమారుడే డా. నలిమెల భాస్కర్. ఆ అనుభవాలను అక్షరాలుగా మలచడం వల్ల "శిరసెత్తిన శిఖరాలు" ఒక కుటుంబ చరిత్రను దాటి ప్రతి పాఠకుడి జీవితాన్ని తాకే మానవీయ మహాగ్రంథంగా రూపుదిద్దుకుంది.ఈ గ్రంథాన్ని పూర్తిగా చదివిన తర్వాత ఒక విషయం స్పష్టమవుతుంది---ఇది రచయిత తన తల్లిదండ్రుల కోసం మాత్రమే రాసిన గ్రంథం కాదు; ప్రతి తల్లి కోసం, ప్రతి తండ్రి కోసం, ప్రతి ఉపాధ్యాయుడి కోసం, ప్రతి కుటుంబం కోసం, ప్రతి యువకుడి కోసం, ప్రతి తెలుగు పాఠకుడి కోసం రాసిన జీవన దర్శిని. మానవీయ విలువలు, కుటుంబ అనుబంధాలు, ప్రకృతి ప్రేమ, గురుభక్తి, నిజాయితీ, సేవాభావం వంటి శాశ్వత విలువలను మళ్లీ మన ముందుకు తీసుకొచ్చిన అక్షరయజ్ఞం.ఈ పుస్తకాన్ని చదవడంలో ఆలస్యం చేయకండి. ఇది కేవలం చదివి ముగించే పుస్తకం కాదు; చదివిన తర్వాత మనసులో కొనసాగిపోయే పుస్తకం. మన తల్లిదండ్రులను మరింత ప్రేమించేలా, గురువులను మరింత గౌరవించేలా, మన మూలాలను మరువకుండా జీవించాలనే స్ఫూర్తిని కలిగించే గ్రంథం.

## తీర్పు

"శిరసెత్తిన శిఖరాలు" ఒక కుటుంబ చరిత్ర కాదు. ఒక యుగపు విలువల చరిత్ర. ఒక తండ్రి కథ కాదు. ఉపాధ్యాయ ధర్మగాథ. ఒక తల్లి గాథ కాదుమాతృత్వ మహాకావ్యం. తెలంగాణ పల్లె సంస్కృతి, మానవీయ సంబంధాలు, ప్రకృతి పట్ల మమకారం, విద్య పట్ల అంకితభావం, నిజాయితీ, సేవా తత్వం వంటి శాశ్వత విలువలను భావితరాలకు అందించే అపూర్వ సాహిత్య సంపద.ఈ పుస్తకం చదవడం అంటే ఒక పుస్తకాన్ని చదవడం కాదు ఒక తల్లిని దర్శించడం, ఒక తండ్రికి నమస్కరించడం, ఒక గురువును స్మరించడం, ఒక తెలంగాణ గ్రామాన్ని నడిచి చూడడం, మనిషిగా ఎలా జీవించాలో నేర్పిన ఒక యుగాన్ని హృదయంలో నిలుపుకోవడం. కాలం మారవచ్చు, తరాలు మారవచ్చు కానీ ఈ గ్రంథం చెప్పే విలువలు ఎన్నటికీ మారవు. అందుకే "శిరసెత్తిన శిఖరాలు" సమకాలీన తెలుగు సాహిత్యంలో మానవీయ విలువలకు చిరస్థాయిగా నిలిచే అక్షర శిఖరంగా నిలుస్తుంది. డా. పెరుక రాజుకవి, రచయితసాహిత్య విమర్శకుడు7810032848

# రోడ్లపై గోవుల స్వైర విహారం.. చర్యలు ఇంకెప్పుడు?



అరుణ ప్రభ:-సారపాక ప్రధాన రహదారులపై గోవుల సంచారం రోజురోజుకూ పెరుగుతుండటంతో వాహనదారులు, స్థానిక ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రోడ్లపై గోవులు అడ్డంగా సంచరించడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, వెంటనే అధికారులు చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.గోవుల సంచారాన్ని నియంత్రించాలని పలుమార్లు నిర్వహించిన గ్రామసభల్లో గ్రామస్తులు అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ సమస్య పరిష్కారం కాలేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్లపై పశువులను వదిలే యజమానులను గుర్తించి, వారికి నోటీసులు జారీ చేస్తామని గ్రామసభలో అధికారులు హామీ ఇచ్చినప్పటికీ ఇప్పటివరకు ఆ ప్రక్రియ అమలు కాలేదని ప్రశ్నిస్తున్నారు.ప్రధాన రహదారులపై పశువులు ఒక్కసారిగా అడ్డంగా రావడంతో ద్విచక్ర వాహనదారులు, ఇతర వాహనదారులు ప్రమాదాల బారిన పడే అవకాశం ఉందని స్థానికులు పేర్కొంటున్నారు. ప్రమాదాలు జరిగిన తర్వాత స్పందించే కంటే ముందుగానే అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.ఇకనైనా అధికారులు స్పందించి రోడ్లపై సంచరిస్తున్న గోవులను తొలగించడంతో పాటు, వాటిని రోడ్లపై వదిలే యజమానులకు నోటీసులు జారీ చేసి, నిబంధనల ప్రకారం చర్యలు చేపట్టాలని సారపాక గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

# పిజ్జాదిగూడ కాంగ్రెస్ నాయకులు ఆర్ఎస్ ప్రవీణ్ వాక్యాలను తీవ్రంగా ఖండన

**ప్రజల్లో ఉన్న నాయకుడిపై నిరాధార ఆరోపణలు చేస్తే సహించేది లేదు: తుంగతుర్తి రవి**



ఆగస్టు 17,అరుణ ప్రభ...మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా డీసీసీ అధ్యక్షులు, మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి వజ్రేష్ యాదవ్ గారిపై మాజీ ఐపీఎస్ అధికారి ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ చేసిన ఆరోపణలను ఈరోజు పీర్జాదిగూడ లోని బండి కన్వెన్షన్ లో నిర్వహించిన విలేకరుల సమావేశం లో హాజరైన డీసీసీ ప్రధాన కార్యదర్శి ఏనుగు జలెందర్ రెడ్డి,పోచారం డివిజన్ అధ్యక్షులు కర్రె రాజేష్,మేడిపల్లి డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తుంగతుర్తి రవి, పీర్జాదిగూడ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బండి శ్రీరాములు,దర్గా దయాకర్ రెడ్డి, వంగేటి ప్రభాకర్ రెడ్డి తీవ్రంగా ఖండించారు.తుంగతుర్తి రవి మాట్లాడుతూ, వజ్రేష్ యాదవ్ ఒకసారి ఉప సర్పంచ్‌గా, ఒకసారి సర్పంచ్‌గా ప్రజలకు సేవ చేసిన వ్యక్తి అని అన్నారు. మేడ్చల్ నియోజకవర్గంలో మూడు పర్యాయాలు ఎన్నికల్లో ఓడిపోయినా, నిరంతరం ప్రజల్లో ఉంటూ ప్రజా సమస్యలపై పోరాడుతున్న నాయకుడు వజ్రేష్ యాదవ్ గారు అని తెలిపారు.ఎన్నికల సమయంలో కోట్ల రూపాయలు ఖర్చు చేసి గెలిచిన వారు తమ బిఆర్ఎస్ పార్టీకి చెందిన వ్యక్తులేనని, ప్రజల కోసం నిరంతరం పనిచేసే నాయకుల గురించి పూర్తి సమాచారం తెలుసుకోకుండా బయట నుంచి వచ్చి ఆరోపణలు చేయడం సరికాదని విమర్శించారు.ఐపీఎస్ అధికారిగా పనిచేసిన వ్యక్తి ఎలాంటి ఆధారాలు లేకుండా భూకబ్జాల ఆరోపణలు చేయడం సిగ్గుచేటని, ఆరోపణలు నిజమైతే ఆధారాలను ప్రజల ముందు ఉంచాలని తుంగతుర్తి రవి డిమాండ్ చేశారు.ప్రజల్లో ఉంటూ ప్రజల కోసం పోరాడే నాయకుడి గురించి తెలుసుకోకుండా ఆరోపణలు చేయడం కాదు.. ముందుగా వాస్తవాలు తెలుసుకోవాలి.ఆధారాలు ఉంటే చూపించాలి, లేకపోతే నిరాధార ఆరోపణలు వెనక్కి తీసుకోవాలి అని తుంగతుర్తి రవి అన్నారు.రాజకీయ విమర్శలు ప్రజాస్వామ్యంలో సహజమే అయినప్పటికీ, వ్యక్తిగత ప్రతిష్ఠను దెబ్బతీసేలా నిరాధార ఆరోపణలు చేయడం మాత్రం సరికాదని ఆయన స్పష్టం చేశారు.ఈ కార్యక్రమం లో రంజిత్ కుమార్ రెడ్డి,ముదిగొండ రమేష్, బలరాం,యాసారం నాగేష్,మోహన్ కుమార్,సుదర్శన్ రెడ్డి,మహ్మద్ మజర్,బర్ల నాగరాజు,మణిరం నాయక్, ,జయందర్,రాజ రాజు,మహేష్ గౌడ్,సోమయ్య,శ్రీను నాయక్,సాయిరాం గౌడ్, బొల్లురి నాగరాజు,శరత్ గౌడ్, కపిల్, దుర్గ, తండా పరమేశ్వరి, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు డైరీలు అందజేసిన సర్పంచ్



ఎల్లారెడ్డిపేట, అరుణప్రభ: ఎల్లారెడ్డిపేట మండలంలోని రాచర్ల గొల్లపల్లి జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కొండ రమేష్ గౌడ్ విద్యార్థులకు రూ.8 వేల విలువైన విద్యార్థి డైరీలను తన సొంత ఖర్చులతో అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆయన ఆకాంక్షించారు. పాఠశాల అభివృద్ధికి ఎల్లప్పుడూ తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు.అదేవిధంగా ఏడో తరగతి వరకు ఇదే పాఠశాలలో కలిసి చదువుకున్న రాచర్ల గొల్లపల్లి గ్రామ పూర్వ విద్యార్థులు 'యూపీఎస్ మిత్రులు'గా ఏర్పడి, రాచర్ల గొల్లపల్లి బాల్యమిత్ర ఫౌండేషన్ పేరుతో గ్రామంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పాఠశాలలోని స్టేజీపై షెడ్ నిర్మాణానికి ఫౌండేషన్ సభ్యులు ముందుకు వచ్చి, నిర్మాణాన్ని తమ సొంత ఖర్చులతో పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు.పాఠశాలలో పదో తరగతి పరీక్షల్లో ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థిని నహేదాకు గ్రామ వార్డు సభ్యుడు ఆకుల రామచంద్రం రూ.5,116 విలువైన చెక్కును అందజేసి అభినందించారు.పాఠశాల అభివృద్ధికి సహాయ సహకారాలు అందించిన సర్పంచ్ కొండ రమేష్ గౌడ్, బాల్యమిత్ర ఫౌండేషన్ సభ్యులు, వార్డు సభ్యుడు ఆకుల రామచంద్రంలకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి. మురళీధర్, ఉపాధ్యాయ బృందం, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ జనగామ రమ, సభ్యులు, విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు.

# మేడిపల్లి తహసీల్దార్ కార్యాలయం వద్ద బీఆర్ఎస్ భారీ ధర్న

## కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను యథావిధిగా కొనసాగించాలని డిమాండ్

## వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తగిన మూల్యం చెల్లించుకుంటుంది

## తులం బంగారం ఎక్కడ బిఆర్ఎస్ ఆరోపణ



ఆగస్టు 17, అరుణ ప్రభ.... తెలంగాణలో పేదింటి ఆడబిడ్డల కలలను కాంగ్రెస్ పార్టీ కను మరుగు చేస్తుంది. బిఆర్ఎస్ పార్టీ ఆరోపించింది పెళ్లిళ్లకు ఆర్థిక అండగా నిలిచిన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను యథావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మేడిపల్లి తహసీల్దార్ కార్యాలయం వద్ద భారీ ధర్నా నిర్వహించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన నిరసనల్లో భాగంగా బోడుప్పల్ సర్కిల్ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఈ ఆందోళన చేపట్టారు. మాజీ జడ్పీటీసీ మంద సంజీవరెడ్డి, మాజీ మేయర్లు జక్క వెంకట్‌రెడ్డి, సామల బుచ్చిరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ధర్నాలో నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.ఈ సందర్భంగా మంద సంజీవరెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలపై కోర్టులో కేసు వేయించి, హైకోర్టు తీర్పును సాకుగా చూపుతూ పేదింటి ఆడబిడ్డలకు అండగా ఉన్న పథకాలను ఎత్తివేయాలని చూస్తోందని ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ పేద కుటుంబాల్లో ఆడపిల్లల వివాహాలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు ఈ పథకాలను ప్రవేశపెట్టారని గుర్తుచేశారు. మహిళలను కోటీశ్వరులను చేస్తామని

పథకాలను ప్రవేశపెట్టారని గుర్తుచేశారు. మహిళలను కోటీశ్వరులను చేస్తామని చెప్పిన సీఎం రేవంత్‌రెడ్డి.. పేద మహిళలకు అండగా ఉన్న కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను కొనసాగించలేకపోవడం ప్రభుత్వ వైఫల్యమని విమర్శించారు. వ్యక్తిగత కేసుల కోసం కోట్లాది రూపాయలు ఖర్చు చేసే ప్రభుత్వ పెద్దలు.. పేద మహిళలకు సంబంధించిన ఈ పథకాల విషయంలో హైకోర్టులో సమర్థవంతంగా వాదనలు వినిపించేందుకు న్యాయవాదులను ఏర్పాటు చేయకపోవడం నిర్లక్ష్యానికి నిదర్శనమని ఆరోపించారు.

చెప్పిన సీఎం రేవంత్‌రెడ్డి.. పేద మహిళలకు అండగా ఉన్న కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను కొనసాగించలేకపోవడం ప్రభుత్వ వైఫల్యమని విమర్శించారు. వ్యక్తిగత కేసుల కోసం కోట్లాది రూపాయలు ఖర్చు చేసే ప్రభుత్వ పెద్దలు.. పేద మహిళలకు సంబంధించిన ఈ పథకాల విషయంలో హైకోర్టులో సమర్థవంతంగా వాదనలు వినిపించేందుకు న్యాయవాదులను ఏర్పాటు చేయకపోవడం నిర్లక్ష్యానికి నిదర్శనమని ఆరోపించారు.మేడిపల్లి తహసీల్దార్ కార్యాలయం వద్ద బీఆర్ఎస్ భారీ ధర్నా మేడిపల్లి తహసీల్దార్ కార్యాలయం వద్ద బీఆర్ఎస్ భారీ ధర్నా మేడిపల్లి తహసీల్దార్ కార్యాలయం వద్ద బీఆర్ఎస్ ధర్నా. కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను యథావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేసిన నాయకులు. కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ పేద కుటుంబాల్లో ఆడపిల్లల వివాహాలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు ఈ ఎన్నికల సమయంలో ఎన్నో హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని అమలు చేయడంలో విఫలమైందని నాయకులు విమర్శించారు. పేదల సంక్షేమానికి ఉపయోగపడే పథకాలను నిర్వీర్యం చేయడం సరికాదన్నారు. ప్రభుత్వం వెంటనే న్యాయవాదులను ఏర్పాటు చేసి కోర్టులో సమర్థవంతంగా వాదనలు వినిపించాలని, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను యథావిధిగా కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరును ప్రజలు గమనిస్తున్నారని, ప్రజా వ్యతిరేక విధానాలకు తగిన సమాధానం చెప్పే రోజులు వస్తాయని బీఆర్ఎస్ నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రఘువర్ధన్‌రెడ్డి, లేతకుల రఘుపతిరెడ్డి, కొత్త రవిగౌడ్, నిర్మల, శ్రీధర్‌గౌడ్, కొత్త చక్రపాణిగౌడ్, మీసాల కృష్ణ, కౌడె పోచయ్య, రాజిరెడ్డి, పైల్ల ప్రభాకర్‌రెడ్డి, మహేష్, మహిళా నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ముసాయిదా ఓటరు జాబితా విడుదల




## సెప్టెంబర్ 16లోగా క్లెయిమ్‌లు, అభ్యంతరాలు, మార్పులు, సవరణలకు దరఖాస్తు చేసుకోవాలి

## కలెక్టర్ భవేష్ మిశ్రా

నిజామాబాద్, ఆగస్టు 17 : ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా నిజామాబాద్ జిల్లా ముసాయిదా ఓటరు జాబితాను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ భవేష్ మిశ్రా సోమవారం విడుదల చేశారు. ముసాయిదా ఓటరు జాబితాలో తమ పేరు, ఇతర వివరాలను ప్రతి అర్హత కలిగిన ఓటరు పరిశీలించుకోవాలని ఈ సందర్భంగా సూచించారు. ఓటరు జాబితాలో పేరు లేకపోయినా, వివరాల్లో తప్పులు ఉన్నా లేదా మార్పులు, సవరణలు అవసరమైనా సెప్టెంబర్ 16, 2026లోగా సంబంధిత ఎన్నికల అధికారులను సంప్రదించి నిర్ణీత విధానంలో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. జిల్లాలో ఎస్ఐఆర్ - 2026 ప్రక్రియకు పూర్వం 14,39,734 మంది ఓటర్లు ఉండగా, స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ తరువాత 17-08-2026 నాటికి జిల్లాలోని ఆరు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో ముసాయిదా జాబితా ప్రకారం మొత్తం 12,28,064 మంది ఓటర్లు ఉన్నారని వివరించారు. వీరిలో 5,83,035 మంది పురుషులు, 6,44,987 మంది మహిళలు, 42 మంది థర్డ్ జెండర్ ఓటర్లు ఉన్నారని అన్నారు.

**ముసాయిదా జాబితా ప్రకారం నియోజకవర్గాల వారీగా ఓటర్ల వివరాలు:**

ఆర్మూర్ : 1,89,457బోధన్ : 1,95,344బాన్సువాడ: 1,76,449నిజామాబాద్ అర్బన్ : 2,24,979నిజామాబాద్ రూరల్ : 2,33,578బాల్కొండ : 2,08,257 అర్హత కలిగిన ప్రతి ఓటరు ముసాయిదా జాబితాలో పేరు పరిశీలించుకోవాలి అర్హత కలిగిన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఉండేలా చూడటంతో పాటు, అనర్హుల పేర్లు లేకుండా పారదర్శకమైన, తప్పులు లేని ఓటరు జాబితా రూపొందించడమే లక్ష్యంగా ఎన్నికల సంఘం మార్గదర్శకాలను అనుసరిస్తూ స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియను నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ భవేష్ మిశ్రా స్పష్టం చేశారు. అర్హత కలిగిన ప్రతి ఓటరు ముసాయిదా జాబితాలో పేరు పరిశీలించుకోవాలని సూచించారు. పేరు లేని అర్హత కలిగిన వ్యక్తులు, అలాగే ఓటరు వివరాల్లో మార్పులు లేదా సవరణలు కోరుకునే వారు నిర్ణీత గడువులోగా క్లెయిమ్‌లు, అభ్యంతరాలు లేదా సవరణలకు దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. ముసాయిదా ఓటరు జాబితాపై అందిన క్లెయిమ్‌లు, అభ్యంతరాలను నిబంధనల ప్రకారం పరిశీలించి తుది ఓటరు జాబితా రూపొందిస్తామని తెలిపారు.

# జర్నలిస్టుల ఇళ్ల స్థలాలపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలి: టీడబ్ల్యూజేఎఫ్



హైదరాబాద్, ఆగస్టు 17 (అరుణ ప్రభ): రాష్ట్రంలో జర్నలిస్టుల ఇళ్ల స్థలాల కేటాయింపు అంశంపై ప్రభుత్వం స్పష్టమైన విధాన ప్రకటన చేయాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) డిమాండ్ చేసింది. సుప్రీంకోర్టు తీర్పును సాకుగా చూపుతూ అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల కేటాయింపులో జాప్యం చేయడం సరికాదని ఫెడరేషన్ నాయకులు పేర్కొన్నారు. జర్నలిస్టుల సంక్షేమానికి సంబంధించిన పలు కీలక అంశాలను వెంటనే పరిష్కరించాలని వారు ప్రభుత్వాన్ని కోరారు.సోమవారం సచివాలయంలో రాష్ట్ర సమాచార పౌర సంబంధాలు, రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య, ప్రధాన కార్యదర్శి తన్నీరు శ్రీనివాస్ ఆధ్వర్యంలోని ప్రతినిధి బృందం కలిసింది. ఈ సందర్భంగా జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలపై మంత్రితో సుదీర్ఘంగా చర్చించి పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సమర్పించారు.కేబుల్, ఐపీ న్యూస్ ఛానళ్లకు అక్రెడిటేషన్ ఇవ్వాలిరాష్ట్రంలోని కేబుల్ టీవీ న్యూస్ ఛానళ్లకు అక్రెడిటేషన్ కార్డులు మంజూరు చేయడంలో జాప్యం జరుగుతోందని ఫెడరేషన్ నేతలు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. అన్ని కేబుల్ న్యూస్ ఛానళ్లకు వెంటనే అక్రెడిటేషన్ కార్డులు మంజూరు చేయాలని, అలాగే ఇంటర్నెట్ ప్రోటోకాల్ (ఐపీ) ఆధారిత న్యూస్ ఛానళ్లకు కూడా అక్రెడిటేషన్ సౌకర్యం కల్పించాలని కోరారు. జిల్లాస్థాయిలో నాలుగు, రాష్ట్రస్థాయిలో 12 అక్రెడిటేషన్ కార్డులు మంజూరు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.జర్నలిస్టులందరికీ హెల్త్ కార్డులుఅక్రెడిటేషన్ కార్డులు ఉన్నప్పటికీ హెల్త్ కార్డుల విషయంలో అనేక మంది జర్నలిస్టులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఫెడరేషన్ పేర్కొంది. ప్రభుత్వ ఉద్యోగులకు అమలు చేస్తున్న విధానంలోనే అర్హులైన జర్నలిస్టులందరికీ హెల్త్ కార్డులు మంజూరు చేయాలని కోరింది. ప్రైవేట్, కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఉచిత వైద్య సేవలు అందేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేసింది.అర్హులైన వారందరికీ ఇళ్ల స్థలాలుజర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్య దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉందని పేర్కొన్న నాయకులు, సుప్రీంకోర్టు తీర్పుతో సంబంధం లేకుండా చట్టపరమైన మార్గాలను అన్వేషించి అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు కేటాయించాలని కోరారు. విధి నిర్వహణలో లేదా ఇతర కారణాలతో మరణించిన జర్నలిస్టుల కుటుంబాలను కూడా ఈ పథకంలో భాగస్వామ్యం చేయాలని విజ్ఞప్తి చేశారు.తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన జర్నలిస్టులను గుర్తించి వారికి ప్రత్యేక సంక్షేమ చర్యలు, ఆర్థిక సహాయం అందించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టుల ఇళ్ల స్థలాల అంశాన్ని ప్రభుత్వం సానుకూల దృక్పథంతో పరిష్కరిస్తుందనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల కేటాయింపుపై కట్టుబడి ఉందని గతంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పలుమార్లు ప్రకటించిన విషయం తెలిసిందే.ప్రకటనల బకాయిలు వెంటనే చెల్లించాలిచిన్న, మధ్యతరహా పత్రికలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని ఫెడరేషన్ నేతలు పేర్కొన్నారు. గత రెండేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ప్రభుత్వ ప్రకటనల బిల్లులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. చిన్న, మధ్యతరహా పత్రికలను ప్రభుత్వ ప్రకటనల ఎంపానెల్‌మెంట్‌లో చేర్చి వాటి మనుగడకు తోడ్పడాలని కోరారు.రిటైర్డ్ జర్నలిస్టులకు పెన్షన్ పథకంసీనియర్, రిటైర్డ్ జర్నలిస్టుల కోసం ప్రత్యేక పెన్షన్ పథకాన్ని ప్రవేశపెట్టి అమలు చేయాలని టీడబ్ల్యూజేఎఫ్ కోరింది. జర్నలిస్టుల పిల్లలకు విద్యా రంగంలో ప్రత్యేక రాయితీలు కల్పించాలని, వారు ఎంతవరకు చదువుకున్నా ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో ఉచిత విద్య అందించేలా ప్రత్యేక జీవో జారీ చేయాలని విజ్ఞప్తి చేసింది.అదేవిధంగా జర్నలిస్టులందరికీ ఉచిత జీవిత బీమా సౌకర్యం కల్పించాలని, జర్నలిస్ట్ మరణించిన సందర్భంలో కుటుంబానికి రూ.10 లక్షల బీమా పరిహారం అందించే విధంగా ప్రత్యేక పథకాన్ని అమలు చేయాలని కోరింది.సమస్యల పరిష్కారానికి హామీజర్నలిస్టుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని, వారి సమస్యలను సానుకూలంగా పరిశీలించి వీలైనంత త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి హామీ ఇచ్చినట్లు ఫెడరేషన్ నాయకులు తెలిపారు. జర్నలిస్టుల సంక్షేమంపై ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి ఇటీవల కూడా పేర్కొన్నట్లు సమాచారం.మంత్రి పొంగులేటిని కలిసిన వారిలో టీడబ్ల్యూజేఎఫ్ జాతీయ కౌన్సిల్ సభ్యుడు కుంచం శ్రీనివాస్, హైదరాబాద్ జిల్లా కన్వీనర్ వి. రవికుమార్, కో-కన్వీనర్లు ఆర్. శ్రీనివాస్ గౌడ్, ఎస్. రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## రాచర్ల బొప్పాపూర్ శివపరాశక్తి పీఠంలో
# ఘనంగా నాగుల చవితి పూజలు

**శివయ్యకు పంచామృతాభిషేకాలు.. కన్నులపండువగా నాగహారతి, సప్తహారతులు**





ఎల్లారెడ్డిపేట, అరుణప్రభ న్యూస్, ఆగస్టు 17:రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల బొప్పాపూర్ గ్రామంలోని శ్రీ శివపరాశక్తి పీఠంలో సోమవారం, నాగుల చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని పరమశివునికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు ఘనంగా నిర్వహించారు. శ్రావణ సోమవారం, నాగుల చవితి ఒకే రోజు రావడంతో పీఠం ప్రాంగణం భక్తులతో కిటకిటలాడుతూ ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది.పీఠాధిపతి శ్రీశ్రీ మనోహర్ రాజు గురూజీ ఆధ్వర్యంలో పరమశివునికి పంచామృతాలు, గంధం, విభూతితో విశేష అభిషేకాలు నిర్వహించారు. అనంతరం నాగుల చవితి సందర్భంగా ప్రత్యేక నాగహారతిని సమర్పించారు. పీఠంలో ప్రత్యేకత కలిగిన సప్తహారతుల కార్యక్రమం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది.వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకుని శంభో శంకర నామస్మరణతో పీఠాన్ని మార్మోగించారు. పూజా కార్యక్రమాల అనంతరం పీఠాధిపతి మనోహర్ రాజు గురూజీ భక్తులకు అక్షింతలతో ఆశీర్వచనాలు అందించారు.కార్యక్రమం ముగిసిన అనంతరం పీఠాధిపతి సమక్షంలో భక్తులందరికీ అన్నప్రసాద వితరణ నిర్వహించారు.

## గుండారం గ్రామంలో
## ఫామ్‌పాండ్ నిర్మాణ పనులు ప్రారంభం



ఎల్లారెడ్డిపేట, అరుణప్రభ న్యూస్, ఆగస్టు 17:ఎల్లారెడ్డిపేట మండలం గుండారం గ్రామంలో జలసిరి కార్యక్రమంలో భాగంగా ఫామ్ ఫండ్ ద్వారా నీటి నిల్వ కోసం ఫామ్‌పాండ్ నిర్మాణ పనులను సర్పంచ్ ముడావత్ సరోజ చంద్రు నాయక్ సోమవారం ప్రారంభించారు. గ్రామానికి చెందిన మొగుటం నర్సయ్య చేనులో ఈ పనులకు శ్రీకారం చుట్టారు.ఈ సందర్భంగా సర్పంచ్ సరోజ మాట్లాడుతూ భూగర్భ జలాలను పెంపొందించేందుకు ఫామ్‌పాండ్లు, చెక్‌డ్యామ్‌లు నిర్మించడంతో పాటు ఇంకుడు గుంతలు, రీచార్జ్ పిట్లు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. వర్షపు నీరు వృథాగా వెళ్లకుండా ఒడిసిపట్టి భూమిలోకి ఇంకేలా చేయడం ద్వారా భూగర్భ జలాలను పెంచవచ్చని తెలిపారు.జలసిరి కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం ఫామ్ ఫండ్ ద్వారా నీటి నిల్వ కోసం ఫామ్‌పాండ్ల నిర్మాణానికి సహకారం అందిస్తోందని సర్పంచ్ పేర్కొన్నారు. రైతులు వర్షపు నీటిని సద్వినియోగం చేసుకుని నీటి వనరులను సంరక్షించాలని ఆమె కోరారు."వర్షపు నీటిని ఒడిసిపట్టి.. ప్రతి చుక్కను సద్వినియోగం చేసుకుందాం" అని సర్పంచ్ సరోజ పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ జెట్టి కిషన్, ఎఫ్ఏ శ్రీను, ముడావత్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఉచిత ఆవు పాల పంపిణీ.




నాగుల పంచమి సందర్భంగానిజామాబాద్ నగరంలోని గాయత్రి నగర్ లో ఉచితంగా ఆవు పలు పంపిణీ చేశారు.ఇందూరు గో సేవా సమితి, తెలంగాణ చేనేత పద్మ సమాఖ్య ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.పదేళ్లుగా ప్రతియేటా నాగుల పంచమి పర్వదినం రోజున ఈ కార్యక్రమం చేపడుతున్నట్లు నిర్వాహకులు తెలిపారు.20 లీటర్ల ఆవుపాలు భక్తులకు ఉచితంగా పంపిణీ చేసినట్లు వారు వెల్లడించారు. కార్యక్రమంలో తెలంగాణ చేనేత పద్మ సమైక్య గౌరవ అధ్యక్షులు గణేష్ సిలివేరి, ఉపాధ్యక్షులు శంకర్ సిలివేరి,కార్యదర్శి అందె నరేందర్, అందె దివాకర్ పాల్గొన్నారు

## వీబిజి రాంజీ పథకంలో మొక్కల పంపిణీ





ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 17 (అరుణప్రభ న్యూస్):ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల గొల్లపల్లి గ్రామంలో వీబిజి రాంజీ పథకంలో భాగంగా మొక్కల పంపిణీతో పాటు ఫామ్‌పాండ్ పనులను సర్పంచ్ కొండ రమేష్ గౌడ్ ఆధ్వర్యంలో సోమవారం ప్రారంభించారు.ఈ సందర్భంగా సర్పంచ్ కొండ రమేష్ గౌడ్ మాట్లాడుతూ.. వీబిజి రాంజీ పథకం ద్వారా రైతులు ఫామ్‌పాండ్లు, బోర్‌వెల్ రీఛార్జి పిట్‌ల వంటి పనులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ, అభివృద్ధి పథకాలపై అవగాహన కల్పిస్తూ, అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.కార్యక్రమంలో ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి, ఫీల్డ్ అసిస్టెంట్, రైతులు, కూలీలు పాల్గొన్నారు.

## ఎల్లారెడ్డిపేట గ్రామపంచాయతీలో
# నూతన ఓటరు జాబితా



ఎల్లారెడ్డిపేట, అరుణప్రభ న్యూస్:ఎల్లారెడ్డిపేట గ్రామపంచాయతీలో ఎస్ఐఆర్ కార్యక్రమం పూర్తైన అనంతరం నూతన ఓటరు జాబితాను గ్రామపంచాయతీ కార్యాలయంలో అతికించారు.గ్రామ ప్రజలు తమ పేర్లు నూతన ఓటరు జాబితాలో నమోదై ఉన్నాయో లేదో పరిశీలించుకోవాలని గ్రామ సర్పంచ్ ఎలగందుల నర్సింలు, పాలకవర్గ సభ్యులు సూచించారు. జాబితాలో తమ పేరు లేకపోతే వెంటనే గ్రామపంచాయతీ కార్యదర్శిని సంప్రదించాలని కోరారు.

## కమ్యూనిటీ హాళ్లకు నిధులు
## మంజూరు చేయాలని ఎమ్మెల్యేకు వినతి



ఎల్లారెడ్డిపేట, అరుణప్రభ న్యూస్:ఎల్లారెడ్డిపేట మండలంలోని కమ్యూనిటీ హాళ్ల నిర్మాణానికి అవసరమైన నిధులు మంజూరు చేయాలని కోరుతూ మండల నాయకులు చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంను కలిసి వినతిపత్రం అందజేశారు.కమ్యూనిటీ హాళ్ల నిర్మాణంతో గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు వివాహాలు, సమావేశాలు, ఇతర సామాజిక కార్యక్రమాలు నిర్వహించుకునేందుకు సౌకర్యం కలుగుతుందని నాయకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. నిధులు మంజూరు చేసి పనులు త్వరగా చేపట్టేలా చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఎల్లారెడ్డిపేట మండల అధ్యక్షుడు సూడిద రాజేందర్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు ఉడుగుల సురేందర్, మాదాసు బాబు, అక్కపెల్లి సర్పంచ్, ప్యాక్స్ డైరెక్టర్ రానావేని లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్‌కే మోయిజ్ కంప్యూటర్ ఇన్‌స్టిట్యూట్ ప్రారంభం



ఎల్లారెడ్డిపేట, అరుణప్రభ న్యూస్, ఆగస్టు 17:ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని కలీమ్ కమర్షియల్ కాంప్లెక్స్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన ఎస్‌కే మోయిజ్ కంప్యూటర్ ఇన్‌స్టిట్యూట్‌ను మార్కెట్ కమిటీ చైర్మన్ ఎస్‌కే సాబేరా బేగం, స్థానిక సర్పంచ్ ఎలగందుల నర్సింలుతో కలిసి సోమవారం ప్రారంభించారు.ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ చైర్మన్ సాబేరా బేగం మాట్లాడుతూ మండల ప్రజలకు అందుబాటులో కంప్యూటర్ సేవలను అందించేందుకు ఇన్‌స్టిట్యూట్‌ను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఇక్కడ జిరాక్స్, కలర్ జిరాక్స్, డీటీపీ వర్క్స్, నోటరీ, లామినేషన్ తదితర సేవలు అందుబాటులోకి తీసుకురావడం ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. ఇన్‌స్టిట్యూట్ నిర్వాహకుడు ఎస్‌కే మోయిజ్‌ను ఆమె అభినందించారు.ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దొమ్మాటి నరసయ్య, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రామ్‌రెడ్డి, ఉప సర్పంచ్ బందారపు బాల్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు వంగ గిరిధర్‌రెడ్డి, ఎస్‌కే సాహెబ్, బండారి బాల్‌రెడ్డి, నంది కిషన్, చేన్ని బాబు, రాజేశం గుప్తా, అజీజ్ భాయ్, మర్రి శ్రీనివాస్‌రెడ్డి, మైనారిటీ మండల అధ్యక్షుడు షాదుల్లా బాయి తదితరులు పాల్గొన్నారు.

## దిండి లో ప్రజావాణి కార్యక్రమ నిర్వహణ



.అరుణ ప్రభ, డిండి ,ఆగస్టు 17,దేవరకొండ నియోజకవర్గం పరిధిలోని దిండి మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమం ఎంపీడీవో నర్రా వేజన్న అధ్యక్షతన నిర్వహించబడినది.ప్రజావాణి కార్యక్రమంలో శాఖల వారీగా, బాధితులు ఫిర్యాదులు చేశారు.రెవెన్యూ శాఖకు సంబంధించిన మూడు దరఖాస్తులు పంచాయతీరాజ్ శాఖ సంబంధించిన ఒక దరఖాస్తు ,విద్యుత్ శాఖకు రెండు ,ఇరిగేషన్ శాఖకు ఒకటి స్త్రీ శిశు సంక్షేమ శాఖకు ఒకటి చొప్పున దరఖాస్తులు చేసుకున్నారు.ఈ దరఖాస్తులను సంబంధిత ప్రభుత్వ శాఖలకు పంపించడం జరుగుతుందని ,నెల రోజుల్లో దరఖాస్తులకు సంబంధించిన సమస్యలు పరిష్కరించబడుతుందని ఎంపీడీవో తెలిపారు.ఈ కార్యక్రమంలో తహసిల్దార్ శ్రీనివాస్ గౌడ్, మరియు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## కబ్జాల బారిన ఆర్ అండ్
## భూములు ఆర్‌అండ్‌బీ స్థలాలు కబ్జాకు గురవుతున్నాయి

అక్రమ కట్టడాలను వెంటనే తొలగించాలి

ప్రజావాణిలో అధికారులకు దరఖాస్తు



అరుణ ప్రభ:- బూర్గంపహాడ్ మండలంలోని ప్రధాన గ్రామాల్లో ఆర్‌అండ్‌బీ శాఖకు చెందిన స్థలాలు ఆక్రమణలకు గురవుతున్నాయని, అక్రమ నిర్మాణాలను వెంటనే తొలగించి ప్రజల భద్రతకు చర్యలు చేపట్టాలని కోరుతూ ప్రజావాణిలో అధికారులకు దరఖాస్తు అందజేశారు.మండలంలోని మొరంపల్లి బంజర, లక్ష్మీపురం, బూర్గంపహాడ్, సారపాక గ్రామాల్లోని ప్రధాన రహదారులు, బస్టాండ్ ప్రాంతాల్లో ఆర్‌అండ్‌బీ స్థలాలను ఆక్రమించి పలు కట్టడాలు, దుకాణాలు, షాపులు నిర్మిస్తున్నారని దరఖాస్తులో పేర్కొన్నారు. దీంతో ఆయా ప్రాంతాల్లో రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడటంతో పాటు, వాహనదారులు, ప్రయాణికులకు ప్రమాదకర పరిస్థితులు నెలకొంటున్నాయని తెలిపారు.ఆర్‌అండ్‌బీ శాఖ పరిధిలోని స్థలాల్లో జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి, క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టాలని కోరారు. అక్రమ నిర్మాణాలను తొలగించి బస్టాండ్ ప్రాంతాలు, ప్రధాన రహదారుల వద్ద ప్రయాణికులకు, వాహనదారులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో మండల అభివృద్ధి అధికారి జమలారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మొరంపల్లి బంజర గ్రామానికి చెందిన భారతీయ పౌరుడు జక్కిరెడ్డి మల్లారెడ్డి అధికారులకు ఈ మేరకు దరఖాస్తు అందజేశారు.ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని సంబంధిత అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లి, తక్షణ చర్యలు చేపట్టేందుకు కృషి చేస్తామని అధికారులు సానుకూలంగా స్పందించినట్లు మల్లారెడ్డి తెలిపారు.ప్రజల ప్రాణాలకు ముప్పు కలిగించే పరిస్థితులు ఏర్పడకముందే అధికారులు స్పందించి, ఆర్‌అండ్‌బీ స్థలాల పరిరక్షణకు మరియు అక్రమ నిర్మాణాల తొలగింపునకు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

## కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను కొనసాగించాలి




ఎల్లారెడ్డిపేట అరుణప్రభ న్యూస్ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 17: కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను రద్దు చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న కుట్రను నిరసిస్తూ బీఆర్ఎస్ పార్టీ సిరిసిల్ల పట్టణ శాఖ ఆధ్వర్యంలో సోమవారం సిరిసిల్ల ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో మహిళలు ధర్నాలో పాల్గొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆడపిల్లల వివాహ సమయంలో ఆర్థిక భరోసా కల్పిస్తున్న కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను ఎట్టి పరిస్థితుల్లోనూ రద్దు చేయవద్దని డిమాండ్ చేశారు.గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన ఈ పథకాలను కొనసాగిస్తూ అర్హులైన ప్రతి కుటుంబానికి సకాలంలో ఆర్థిక సహాయం అందించాలని నాయకులు, మహిళలు కోరారు. పథకాలపై స్పష్టత ఇవ్వడంతో పాటు వెంటనే వాటిని కొనసాగించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు

## ప్రజావాణిలో ఫిర్యాదు.. తక్షణమే స్పందించిన ఎంపీడీవో

**వార్డు మెంబర్ గౌతమి,కాంగ్రెస్ నాయకులు చిప్పా రాజు చొరవతో బోరింగ్ మరమ్మతులు పూర్తి**



ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన ఫిర్యాదుపై ఎంపీడీవో కుదుముల జమలారెడ్డి తక్షణమే స్పందించడంతో సమస్యకు పరిష్కారం లభించింది. బూర్గంపహాడ్ మండల పరిధిలోని ఓ వార్డులో బోరింగ్ పనిచేయక ప్రజలు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని ప్రజావాణి కార్యక్రమంలో అధికారులు దృష్టికి తీసుకెళ్లగా, వెంటనే స్పందించిన ఎంపీడీవో సంబంధిత సిబ్బందిని అప్రమత్తం చేసి బోరింగ్ మరమ్మతులు చేపట్టేలా చర్యలు తీసుకున్నారు.బోరింగ్ పనిచేయకపోవడంతో తాగునీటి కోసం స్థానిక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పిర్యాదు చేయగా వార్డు మెంబర్ గౌతమి, స్థానిక నాయకుడు చిప్పా రాజు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ప్రజలకు నిత్యావసరమైన తాగునీటి సమస్య కావడంతో దీనిని అత్యవసరంగా పరిష్కరించాలని వారు కోరారు.ఫిర్యాదును స్వీకరించిన ఎంపీడీవో జమలారెడ్డి సమస్య తీవ్రతను తెలుసుకుని సంబంధిత సిబ్బందితో మాట్లాడారు. బోరింగ్‌ను పరిశీలించి అవసరమైన మరమ్మతులు వెంటనే చేపట్టాలని ఆదేశించారు.కాగా వార్డు మెంబర్,నాయకులు చిప్ప రాజు సమక్షంలోనే అధికారులు,సిబ్బంది బోరింగ్‌ను పరిశీలించి లోపాలను గుర్తించారు. అనంతరం అవసరమైన మరమ్మతులు చేపట్టి బోరింగ్‌ను తిరిగి వినియోగంలోకి తీసుకువచ్చారు. దీంతో స్థానిక ప్రజలు ఊపిరి సంతోషం వ్యక్తం చేశారు.ప్రజలకు నిత్యావసరమైన తాగునీటి సమస్యపై వెంటనే స్పందించి మరమ్మతులు పూర్తి చేయించిన ఎంపీడీవో జమలారెడ్డికి స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

## మండల స్థాయి ప్రజావాణికి 7 దరఖాస్తులు



ఎల్లారెడ్డిపేట అరుణప్రభ న్యూస్ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 17: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మండల స్థాయి ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 7 దరఖాస్తులు వచ్చినట్లు ఎంపీడీవో కార్యాలయం తెలిపింది.శాఖల వారీగా పరిశీలిస్తే వైద్య, ఆరోగ్య శాఖకు 2, రెవెన్యూ శాఖకు 2, విద్యుత్ శాఖకు 1, డీఆర్డీఓ శాఖకు 1, పంచాయతీరాజ్ శాఖకు 1 దరఖాస్తు అందాయి.ప్రజలు తమ సమస్యలను ప్రజావాణి ద్వారా అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. సంబంధిత శాఖల అధికారులు దరఖాస్తులను పరిశీలించి సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు.

## వి యం ఆర్ నగర్ యానాదులు స్థితిగతులు



దొరవారిసత్రం మండలము (అరుణప్రభ దినపత్రిక ) మాది తిరుపతి జిల్లా దొరవారిసత్రం మండలము, తల్లంపాడు పంచాయతీ, వి .యం . ఆర్ నగర్ లో మొత్తం 24 యానాది కుటుంబాల వారము దాదాపు మొత్తము 85 మంది జనాభా కలిగి గత 35 సం××ల నుండి నివసిస్తున్నాము, మేము యానాది కులస్తులము, మేము అందరమూ కూలి పనులు చేసుకొని జీవిస్తున్నాము, మా గ్రామంలో చాలా కాలం నుండి త్రాగడానికి నీళ్లు లేక చాలా ఇబ్బందులు పడుతున్నాము, మా సెంటర్ లో గతంలో పైపు లైను ద్వారా ఒక వీధి కొళాయి మాత్రము ఏర్పాటు చేసివున్నారు, అందులో నీళ్లు ఎప్పుడు వస్తాయో తెలీదు, మేము కూలి పనులకు వెళ్లి సాయంత్రం ఇంటికి రాగానే నీళ్లు లేక చీకటి సమయంలో దాదాపు 1 కి.మీ దూరంలో వున్న కాళంగి నది నుండి తెచ్చుకుంటున్నాము. పైన తెలిపినటువంటి సమస్యను గురించి గతంలో అనేక సార్లు తల్లంపాడు పంచాయతీ సెక్రటరీ గారికి 2603.2026 మరియు 15.06.2026 తేదీలల్లో రూరల్ వాటర్ స్కీమ్ - అసిస్టెంట్ ఇంజనీర్ గారికి అర్జీలు ఇచ్చి మా బాధలు చెప్పుకొనివున్నాము, కానీ మా గ్రామంలో ఇప్పటివరకు ఎలాంటి త్రాగునీటి సదుపాయం కల్పించలేదు.అదేవిదంగా మాకు స్మశానం లేదు, మాలో ఎవరైనా చనిపోతే అంత్యక్రియలు చేయడానికి స్మశానము లేక మా కాలనీ పక్కనున్న నెర్రి కాలువ గట్టు మీద శవాలన పూడ్చుకుంటాము, అయితే నెర్రి కాలువకు ముందు రైతులకు భూములు వున్నాయి, వారు పంటలు వేసినప్పుడు పొలాలకు కంచి వేసేస్తారు, అలాంటి సమయాల్లో ఎవరైనా చనిపోతే మేము రైతుల పొలాల్లో శవాలను తీసుకెళితే , రైతులు మమ్మల్ని చాలా యిబ్బందులు పెడతారు, వెళ్ళడానికి దారి లేక చాలా ఇబ్బందులకు గురౌతుంటాము. స్మశానానికి సంబంధించి అనేక సార్లు కూడా తహసీల్దార్ కార్యాలయంలోనూ, మరియు 27.04.2025 మరియు 27.03.2026 తేదీలల్లో శ్రీ గౌ// లైన విజయశ్రీ, శాసన సభ్యురాలు గారికి కూడా అర్జీలు ఇచ్చి నేరులోనే పరిస్థితులను తెలియ జేసివున్నాము, కానీ ఇప్పటివరకు ఎవరి వైపు నుండి ఎలాంటి స్పందన లేదు. మాకు వీధి రోడ్లు లేవు, రోడ్డు దారి మొత్తం చెట్లు, కంపలతోనిండి ఉంది, వర్షాకాలంలో మోకాలు లోతు నీళ్ళల్లో నడుస్తుంటాము,నీళ్ళల్లో నడిచి కాళ్ళల్లో కురుపులు కూడా వస్తాయి, ముఖ్యంగా



వర్షాకాలంలో దారి మొత్తం గుంతలు, బురదతో నిండి నడవడానికి కూడా వీలు లేనటువంటి పరిస్థితి వుంటుంది. విధుల్లో విషపురుగులు తిరుగుతున్నా చూస్తుండడము తప్ప ఏమి చెయ్యలేకఉన్నాము ,చిన్న పిల్లలు మరియు ముసలివారు బయటకు రాలేక అనేక ఇబ్బందులు పడుతున్నారు. కాబట్టి మాకు సిమెంట్ రోడ్లు ప్రభుత్వం వేస్తే బాగుంటుందని దొరవారిసత్రం మండలంలో ఆయా సమస్యలకు సంబంధించి ,ఆయా సంబంధిత అధికారులకు అర్జీలు ఇచ్చాము. అదే విదంగా సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ ,నెల్లూరు మరియు జిల్లా గిరిజన సంక్షేమాధికారికి కూడా వాట్స్ యాప్ ద్వారా పంపినాము .ఇప్పటికైనా మాకు సహాయం చేస్తారని ఆశిస్తున్నాము అని గ్రామ నివాసి తుపాకుల మహేష్ మరియు గ్రామస్తులు అరుణప్రభకు తెలియజేశారు. వి యం ఆర్ నగర్ యానాదులు పరిస్థితిని అధికారులు ఏమాత్రం పట్టించుకుంటారో చూడాలి మరీ !

# అర్హులైన నేతన్నలకు పథకం అందించాలి




ధర్మవరం, ఆగస్టు 17; (అరుణ ప్రభ న్యూస్)అర్హులైన చేనేత కార్మికులందరికీ నేతన్న సేవా పథకం వర్తించేలా అధికారులు ఇంటింటి సర్వే నిర్వహించాలని ఏపీ చేనేత కార్మిక సంఘం డిమాండ్ చేసింది. సీపీఎం కార్యాలయంలో సంఘం జిల్లా కన్వీనర్ జె.వి. రమణ, జిల్లా నాయకులు ఎస్.హెచ్. భాష, టీ. అయూబ్‌ఖాన్ మాట్లాడుతూ తొలి విడతలో పలువురు అర్హులకు పథకం అందలేదన్నారు.రెండో విడతలో అర్హులందరికీ పథకం అందేలా చర్యలు తీసుకోవాలని, తొలి విడత లబ్ధిదారుల జాబితాలను అన్ని సచివాలయాల్లో ప్రదర్శించాలని కోరారు. అర్హులకు అన్యాయం జరిగితే జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

# మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



ధర్మవరం, ఆగస్టు 17; (అరుణ ప్రభ న్యూస్)మున్సిపాలిటీ ప్రైవేటీకరణ విధానాలను ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు అయూబ్‌ఖాన్ డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం సీఐటీయూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు అంబేద్కర్ సర్కిల్‌లో పారిశుద్ధ్య, ఇంజనీరింగ్ కార్మికులు మానవహారం నిర్వహించారు.ఈ సందర్భంగా అయూబ్‌ఖాన్, సీనియర్ నాయకులు ఎస్.హెచ్. భాష, చేనేత కార్మిక సంఘం జిల్లా కన్వీనర్ జె.వి. రమణ మాట్లాడుతూ శాశ్వత స్వభావం కలిగిన మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలని కోరారు. సమాన పనికి సమాన వేతనం అమలు చేసి నెలకు రూ.31 వేల వేతనం చెల్లించాలని, గ్రాట్యుటీ, రిటైర్మెంట్ బెనిఫిట్స్, హెల్త్ కార్డులు కల్పించాలని డిమాండ్ చేశారు. విధి నిర్వహణలో మృతి చెందిన కార్మికుల కుటుంబాల్లో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని కోరారు.కార్యక్రమంలో మున్సిపల్ కార్మిక సంఘం నాయకులు మేకల బాబు, ముకుంద, లక్ష్మీ ఓబిలీసు, బొగ్గు నాగరాజుతో పాటు పలువురు కార్మికులు పాల్గొన్నారు.

# ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



ధర్మవరం, ఆగస్టు 17; (అరుణ ప్రభ న్యూస్)విశ్వహిందూ పరిషత్ సేవా విభాగ్, శ్రీ కోదండరామ జల లింగేశ్వర స్వామి దేవాలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో సోమవారం రామ్‌నగర్‌లోని శ్రీ కోదండరామ స్వామి ఆలయ ప్రాంగణంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు.శ్రీ రమాదేవి మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, తిరుపతి వైద్యులు 130 మందికి పైగా రోగులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అత్యవసర చికిత్స అవసరమైన వారిని తదుపరి చికిత్స కోసం తిరుపతికి తరలించారు.కార్యక్రమంలో వి.హెచ్.పి. సేవా ప్రముఖ్ ఆర్. కేశవ యాదవ్, విభాగ్ కార్యదర్శి పులిచెర్ల వేణుగోపాల్, దేవరకొండ రామానుజులు, బైసాని శ్రీనివాస గుప్తా, జల్లా రాము, బీరే శ్రీనివాసులు, నల్లమాడ మనోహర్, టేకూరి శేషాద్రి, సిరివెళ్ల దామోదర్, గుడిబండ మహేష్, కండె విశ్వనాథ్‌తో పాటు ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు పామిశెట్టి కృష్ణయ్య, పూజారి వెంకటరాముడు, గట్టు చౌడప్ప, పామిశెట్టి వెంకటేష్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# గ్యాస్ పంపిణీలో నిబంధనలు పాటించాలి



ధర్మవరం, ఆగస్టు 17; (అరుణ ప్రభ న్యూస్)ఫోటో నంబర్: 14గ్యాస్ ఏజెన్సీదారులు నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని జిల్లా పౌర సరఫరాల అధికారి వంశీకృష్ణారెడ్డి సూచించారు. ధర్మవరంలోని అమరావతి గ్యాస్ ఏజెన్సీని ఆకస్మికంగా తనిఖీ చేసి దేశీయ, వాణిజ్య వంటగ్యాస్ సిలిండర్ల నిల్వలను పరిశీలించారు.సిలిండర్ డెలివరీకి నిర్ణయించిన రుసుము మాత్రమే వసూలు చేయాలని, ఐవీఆర్ఎస్ విధానాన్ని సక్రమంగా అమలు చేయాలని సూచించారు. వినియోగదారులకు బుకింగ్, డెలివరీ, ఇతర సేవలపై సరైన సమాచారం అందించడంతో పాటు సకాలంలో సిలిండర్లు అందించాలని ఆదేశించారు.అనివార్య కారణాలతో రెండు నెలలుగా నిలిచిన అమరావతి గ్యాస్ ఏజెన్సీ ప్రస్తుతం తిరిగి కార్యకలాపాలు ప్రారంభించిందన్నారు. దీంతో వినియోగదారులు ఇకపై జీపీఆర్ గ్యాస్ ఏజెన్సీకి బదులుగా అమరావతి గ్యాస్ ఏజెన్సీని సంప్రదించాలని సూచించారు. గ్యాస్ సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు.కార్యక్రమంలో సీహెచ్‌డీటీ ఇన్‌చార్జి రమణబాబు పాల్గొన్నారు.

# ముగిసిన శిఖర ప్రతిష్ఠ మహా కుంభాభిషేక పూజలు



గూడూరు - (అరుణ ప్రభ న్యూస్ ):గూడూరు పట్టణంలోని శ్రీకృష్ణ ధర్మరాజు స్వామి దేవస్థానంలో శిఖర ప్రతిష్ట మహా కుంభాభిషేక పూజా కార్యక్రమాలు వైభవంగా ముగిసాయి. భక్తులు అధిక సంఖ్యలో హాజరై పూజా కార్యక్రమాల్లో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు .గత మూడు రోజులుగా గూడూరు పట్టణంలోని శ్రీకృష్ణ ధర్మరాజు స్వామి దేవస్థానంలో జరుగుతున్న శికర ప్రతిష్ట మహా కుంభాభిషేక పూజా కార్యక్రమాలు ఘనంగా ముగిశాయి .ముందుగా విశ్వక్సేన పూజ అగ్ని ధాన్యం విశేష మూల మంత్ర హోమం శిఖర ప్రతిష్ట మహా పూర్ణాహుతి అర్చకులు వైభవంగా నిర్వహించారు. భారీ అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో కుంబాభిషేక పూజా కార్యక్రమాల్లో పాల్గొని అన్నప్రసాదాలు స్వీకరించారు. పాలకమండలి చైర్మన్ వాటంబేడు శివకుమార్ , వాటంబేడు హరికుమార్ ,ఈవో రవికృష్ణ భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లను పర్యవేక్షించారు.

# మెగా కంటి వైద్య శిబిరం



గూడూరు - (అరుణ ప్రభ న్యూస్ ):గూడూరు పట్టణంలోని న్యూ బాలాజీ నగర్ ఆవరణలో వెరిటాస్ జూనియర్ కాలేజీ ఆవరణలో సోమవారం కోట మండలం చెందోడు గ్రామానికి చెందిన విద్యా ప్రదాత స్వర్గీయ ముప్పవరపు వెంకటేశ్వరరావు, ఆదిలక్ష్మి జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన ఎం.వి. రావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వెరిటాస్ జూనియర్ కళాశాల చైర్మన్ , కరస్పాండెంట్ నాదెండ్ల హరిబాబు, సుకుమార్ నాయుడు ఈ ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని ప్రారంభించారు..గూడూరు పట్టణంలోని బాలాజీ నగర్ ఇతర ప్రాంతాల నుంచి కంటి సమస్యలతో బాధపడే వారు ఈ శిబిరానికి హాజరయ్యారు. కోట పట్టణానికి చెందిన రమేష్ ఐ కేర్ నేత్ర వైద్యుడు డాక్టర్ వి .రమేష్ బాబు నేత్ర సమస్యలతో బాధపడే వారికి కంప్యూటర్ ద్వారా కంటి పరీక్షలు నిర్వహించి దృష్టిలోపం ఉన్న వారిని గుర్తించారు.ఎం వి రావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ ఉచిత నేత్ర వైద్య శిబిరం ద్వారా 11701 కార్యక్రమంగా నిర్వహించారు.గూడూరు పట్టణం నుంచి వందల మంది ఈ శిబిరానికి హాజరై నేత్ర సమస్యలను చూపించుకున్నారు.దృష్టిలోపం ఉన్న వారికి అతి తక్కువ ధరకు కంటి అద్దాలు పంపిణీ చేయనున్నామని, కంటిలో శుక్లాలు ఇతర సమస్యలతో బాధపడేవారికి తిరుపతి పట్టణానికి చెందిన వాసన ఐ కేర్ లో శస్త్ర చికిత్సలు చేయించి వారికి నెలకు సరిపడా మందులను ఉచితంగా ఇవ్వనున్నామని ఎం వి రావు ఫౌండేషన్ చైర్మన్ ముప్పవరపు లీలా మోహన్ కృష్ణ తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎం వి రావు ఫౌండేషన్ చైర్మన్ ముప్పవరపు లీలా మోహన్ కృష్ణ, కార్యదర్శి ఎం విజయలక్ష్మి, డాక్టర్ సుగుణమ్మ, ప్రిన్సిపాల్ దొగ్గోలు బాబు రెడ్డి, కోలా మీరయ్య నాయుడు అంగన్వాడి టీచర్ ఎం షాజీదా కళాశాల అధ్యాపకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# మద్యం తాగి డ్రైవింగ్ చేస్తే జరిమానా తప్పదు

ధర్మవరం, ఆగస్టు 17; (అరుణ ప్రభ న్యూస్)మద్యం సేవించి వాహనాలు నడిపిన ఇద్దరికి కోర్టు రూ.20 వేల జరిమానా విధించినట్లు ధర్మవరం రెండో పట్టణ సీఐ జయానాయక్ తెలిపారు. రెండో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో నార్పల గ్రామానికి చెందిన శివానంద, కేతిరెడ్డి కాలనీకి చెందిన సాయిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేసినట్లు చెప్పారు.ఇద్దరినీ ధర్మవరం ద్వితీయ శ్రేణి మేజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరచగా, న్యాయమూర్తి ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున మొత్తం రూ.20 వేల జరిమానా విధించినట్లు తెలిపారు.మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, వాహనదారులు బాధ్యతగా వ్యవహరించి ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సీఐ జయానాయక్ సూచించారు.

# నాగ పంచమి సందర్భంగా ఆలయాల్లో భక్తుల సందడి



అల్వాల్: నాగ పంచమి పర్వదినాన్ని పురస్కరించుకుని పలు నాగదేవత ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఉదయం నుంచే భక్తులు ఆలయాలకు చేరుకుని నాగదేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయం సమీపంలోని నాగదేవత ఆలయంలో భక్తులు పుట్టలో పాలు పోసి మొక్కులు చెల్లించుకున్నారు. నాగదేవతను భక్తిశ్రద్ధలతో పూజించి కుటుంబ శ్రేయస్సు, ఆరోగ్యం, సౌభాగ్యం



కోసం ప్రార్థనలు చేశారు.ఇదిలా ఉండగా, బాలాజీ వెంకటేశ్వర స్వామి ఆలయ ప్రధానార్చకులు రవి పంతులు స్వగృహంలో నాగ పంచమి సందర్భంగా ప్రత్యేక పూజలతో పాటు సుదర్శన యాగాన్ని నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య శాస్త్రోక్తంగా యాగ క్రతువును నిర్వహించారు.ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ సుదర్శన యాగం ద్వారా దుష్టశక్తులు, నరదృష్టి, శత్రు ప్రభావం నుంచి రక్షణ లభిస్తుందని భక్తుల విశ్వాసమని తెలిపారు. అలాగే దీర్ఘకాలిక అనారోగ్యాలు, మానసిక ఆందోళనలు తొలగి, కుటుంబంలో సుఖశాంతులు నెలకొనడంతో పాటు అష్టైశ్వర్యాలు, శ్రీమహాలక్ష్మి కటాక్షం లభిస్తాయని పేర్కొన్నారు. నాగ పంచమి సందర్భంగా ఆలయాల్లో నిర్వహించిన ప్రత్యేక పూజలు, యాగాలతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

# ఇండియన్ పోలీస్ మెడల్‌తో మెరిసిన నిరంజన్ రెడ్డి.. అభినందనల వెల్లువ

**ఉమ్మడి కరీంనగర్ జిల్లా బ్యూరో, ఆగస్టు 17 కరీంనగర్ రూరల్ సీఐ అనుముల నిరంజన్ రెడ్డికి అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. నక్సల్స్ కార్యకలాపాల నియంత్రణతో పాటు అసాంఘిక కార్యకలాపాల కట్టడిలో విశేష సేవలు అందించిన ఆయన ప్రతిష్టాత్మక ఇండియన్ పోలీస్ మెడల్ (ఐపిఎమ్) అందుకున్నారు. ఆగస్టు 15న రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి చేతుల మీదుగా మెడల్ అందుకున్న నేపథ్యంలో పోలీస్ అధికారులు, సిబ్బంది, ప్రజలు ఆయనను అభినందించారు.**

**సీపీ గౌష్ ఆలం అభినందనలు:**

**సోమవారం కరీంనగర్ సీపీ గౌష్ ఆలంను సీఐ నిరంజన్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీపీ ఆయనను అభినందించారు. విధి నిర్వహణలో ధైర్యసాహసాలు ప్రదర్శిస్తూ అందించిన సేవలు ఆదర్శప్రాయమని కొనియాడారు. ఇండియన్ పోలీస్ మెడల్ అందుకోవడం కరీంనగర్ కమిషనరేట్‌కు గర్వకారణమన్నారు. అంకితభావంతో పనిచేసే పోలీస్ అధికారులకు గుర్తింపు తప్పకుండా లభిస్తుందని పేర్కొన్నారు.**

**ప్రజల అభినందనలు:**

# రాజాపేట లో మండల స్థాయి ప్రజావాణి

మండల స్థాయి ప్రజావాణి కార్యక్రమం సోమవారం రాజాపేట మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించారు.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమానికి మండలంలోని వివిధ శాఖల అధికారులు ఉదయం 10 గంటలకు హాజరయ్యారు. మధ్యాహ్నం ఒంటిగంట వరకు ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు.ఈ సందర్భంగా వివిధ సమస్యలపై మొత్తం 16 దరఖాస్తులు అందాయి. దరఖాస్తులను వెంటనే సంబంధిత శాఖలకు పంపించి, సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని మండల అభివృద్ధి అధికారి నాగవేణి తెలిపారు.ప్రజల సమస్యలను సంబంధిత శాఖల అధికారులు పరిశీలించి పరిష్కరించేలా కృషి చేస్తామని పేర్కొన్నారు.కార్యక్రమంలో తహసీల్దార్ రవి కిరణ్,ఎంపీఓ ఆవుల కిషన్,సూపరింటెండెంట్ ఇన్నారెడ్డి, ఎంఏవో పద్మజ,ఎంఈఓ రమేష్,వివిధ శాఖల అధికారులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# తాసిల్దార్ కు జర్నలిస్టుల వినతి పత్రం అందజేత

రాజాపేట మండల పరిధిలోని జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని కోరుతూ సోమవారం ప్రజావాణి సందర్భంగా తాసిల్దార్ రవి కిరణ్ కుమార్ కు వినతి పత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా గత మూడు దశాబ్దాలకు పైగా వర్కింగ్ జర్నలిస్టులుగా పని చేస్తున్నప్పటికీ నేటికీ ప్రభుత్వం నుండి ఎలాంటి ఇళ్ల స్థలాలను కేటాయించలేదని,ఇప్పటికైనా సంబంధిత అధికారులు పత్రిక నుండి గుర్తింపు కలిగి ఉన్న జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు అందజేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో (టీజేయు) తెలంగాణ జర్నలిస్ట్ యూనియన్ జిల్లా వైస్ ప్రెసిడెంట్ ఎండి.యూసుఫ్ మండల జర్నలిస్టులు బిర్రు బాలకిషన్, పెంట సత్తనారాయణ,బాలరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# దమ్మపేట మండలం

# ముష్టి బండలో ఎస్సీల ఇనాం భూముల ఆక్రమణ..

కలెక్టర్‌కు బాధితుల ఫిర్యాదు..

):దమ్మపేట మండలంలోని ముల్కలబండ రెవెన్యూ పరిధి సర్వే నంబర్ 114/3/8 లో తమ పూర్వీకుల కాలం నుండి సాగులో ఉన్న ఇనాం భూములను అగ్రవర్ణాల వారు అక్రమంగా కబ్జా చేశారని పేర్కొంటూ బాధితులు సోమవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.నిజాం నవాబుల కాలంలో (1947 నాటి) తమ తాతలు వెట్టిచాకిరీ చేసినందుకు గాను మాదిగ (ఎస్సీ) వర్గానికి చెందిన సుమారు 48 మంది పేదలకు ప్రభుత్వం ఈ ఇనాం భూములను కేటాయించిందని బాధితులు తెలిపారు. నాటి నుంచి తామే సాగు చేసుకుంటుండగా, కొందరు అక్రమార్కులు రికార్డులను తారుమారు చేసి తప్పుడు పాస్‌బుక్కులు సృష్టించుకున్నారని ఆరోపించారు. ప్రభుత్వ పథకాలైన రైతుబంధు, రైతుభరోసా నిధులను కూడా అక్రమంగా పొందుతూ, అసలైన హక్కుదారులమైన తమను భూమి నుండి వెళ్లగొట్టేందుకు ప్రయత్నిస్తున్నారని వాపోయారు.?వెంటనే అధికారులు స్పందించి విచారణ జరిపి, అక్రమంగా జారీ చేసిన పాస్‌బుక్కులను రద్దు చేయాలని, అసలైన వారసులకు ఆక్యుపెన్సీ రైట్స్ సర్టిఫికేట్ ( ఓ ఆర్ సి ) మంజూరు చేసి భూమిని తమకు అప్పగించి న్యాయం చేయాలని దరఖాస్తుదారులు కె. కాంతారావు, కె. మధు, కె. జగపతిరావు, కె. నాగేశ్వరరావు, శ్యామ్ కుమార్ తదితరులు కలెక్టర్‌ను కోరారు.

# యాదాద్రి భువనగిరి జిల్లా సర్పంచుల ఫోరం అధ్యక్షులు అనిల్ కుమార్ నియామకం

తెలంగాణ సర్పంచుల సంఘం జెఏసి యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులుగా జూకంటి అనిల్ కుమార్ నియామకం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో జరిగిన తెలంగాణ సర్పంచుల సంఘం జేఏసీ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులుగా టంగుటూరు గ్రామ సర్పంచ్ జూకంటి అనిల్ కుమార్ నియమితులయ్యారు. మాజీ మంత్రివర్యులు వి. శ్రీనివాస్ గౌడ్ నియామక పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ సర్పంచుల సంఘం వ్యవస్థపాకులు సుర్వి యాదయ్య , రాష్ట్ర ఉపాధ్యక్షులు గుంటి మధుసూదన్ రెడ్డి, జనరల్ సెక్రటరీ నాగయ్య, రామ్ మోహన్ రావు, వివి రావు, శర్బణపురం సర్పంచ్ మొగులగాని నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇల్లు స్లాబ్ పనులను ప్రారంభించిన.

- క్యాతనపల్లి మునిసిపాలిటీ 18 వ వార్డు కౌన్సిలర్ పల్లె శ్రీదేవి - రాజన్న.

తెలంగాణ ప్రభుత్వము ప్రతిష్టాత్మక కార్యక్రమంలో ఇందిరమ్మ ఇల్లు నిర్మాణంలో భాగంగా మూడో విడతలో ఇంటి స్లాబ్ నిర్మాణము స్థానిక క్యాతనపల్లి మునిసిపాలిటీ 18 వ వార్డులో ప్రజా ప్రతినిధులు, రాజకీయ నాయకులు పాల్గొని లబ్ధిదారుని ఇల్లు పనులను ప్రారంభించారు.ఈ సందర్భంగా స్థానిక వార్డులో ఇల్లు లేని వారికి విడతల వారీగా ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయించడానికి అన్ని విధాలుగా కృషి చేస్తానని కౌన్సిలర్ హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మాజీ పట్టణ అధ్యక్షుడు పల్లె రాజు, బోనగిరి రవీందర్,గోళ్ళ మల్లేష్,ఎర్రల శంకర్,మహిళా కాంగ్రెస్ నాయకులు రాజేశ్వరి, సృజన తదితరులు పాల్గొన్నారు.

# యాదాద్రి భువనగిరి జిల్లాలో పిఎసి సమావేశంలో ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి పట్టణంలోని న్యూ వివేర హోటల్‌లో యాదాద్రి భువనగిరి, నల్లగొండ, సూర్యాపేట జిల్లాల కాంగ్రెస్ పార్టీ పీఏసీ (పొలిటికల్ అఫైర్స్ కమిటీ --రాజకీయ వ్యవహారాల కమిటీ) సమావేశం నిర్వహించారు.ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ హాజరయ్యారు.మూడు ఉమ్మడి జిల్లాల పరిధిలో పార్టీ సంస్థాగత బలోపేతం, రాజకీయ పరిస్థితులు, ప్రజా సమస్యలు, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడం తదితర అంశాలపై సమావేశంలో చర్చించారు.ఈ సమావేశంలో తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి రోడ్లు--భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ శాఖ, ఉమ్మడి నల్లగొండ జిల్లా ఇన్‌చార్జి మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ,యాదాద్రి భువనగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య సమావేశంలో పాల్గొన్నారు.కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయడంతో పాటు, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని సమావేశంలో నాయకులు సూచించారు.

# ప్రభుత్వ ధాన్యం దుర్వినియోగం, సీఎంఆర్ బకాయిలపై కఠిన చర్యలు.....జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష

- 38 మంది రైస్ మిల్లర్ల వద్ద రూ.238 కోట్ల మేర బకాయిలు
- 7 క్రిమినల్ కేసులు నమోదు, ఒకరిపై పీడీ యాక్ట్ అమలు.. 31 మిల్లుల్లో పంచనామా కొనసాగింపు

ప్రభుత్వ ధాన్యాన్ని కస్టమ్ మిల్లింగ్ కోసం తీసుకుని, నిబంధనల ప్రకారం సీఎంఆర్ బియ్యాన్ని ప్రభుత్వానికి అందించకుండా బకాయిలు పెట్టిన రైస్ మిల్లర్లపై కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.పెద్దపల్లి జిల్లాలో ప్రభుత్వ ధాన్యం, సీఎంఆర్‌కు సంబంధించి 38 మంది రైస్ మిల్లర్ల వద్ద సుమారు రూ.238 కోట్ల మేర బకాయిలు ఉన్నట్లు తెలిపారు. ప్రభుత్వ ధాన్యం దుర్వినియోగం, తరలింపు, లెక్కల్లో చూపకపోవడం తదితర అంశాలపై అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహిస్తూ, రికార్డులను పరిశీలిస్తున్నారని పేర్కొన్నారు.ఇప్పటికే ప్రభుత్వ ధాన్యం విషయంలో 7 క్రిమినల్ కేసులు నమోదు చేయగా, ఒకరిపై పీడీ యాక్ట్ కేసు కింద చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. మరో 31 రైస్ మిల్లుల్లో ప్రభుత్వ ధాన్యం నిల్వలు, సీఎంఆర్ డెలివరీ, సంబంధిత రికార్డులపై పంచనామా ప్రక్రియ కొనసాగుతోందని వెల్లడించారు.ప్రభుత్వ ధాన్యం ప్రజాధనం ద్వారా కొనుగోలు చేసిన ఆస్తి అని, కస్టమ్ మిల్లింగ్ కోసం మిల్లర్లకు అప్పగించిన ధాన్యాన్ని నిబంధనల మేరకు మిల్లింగ్ చేసి, నిర్ణీత సీఎంఆర్‌ను ఎఫ్‌సీఐ/టీజీఎస్‌సీఎస్‌సీఎల్‌కు అందించాల్సిన బాధ్యత మిల్లర్లపై ఉంటుందని కలెక్టర్ స్పష్టం చేశారు. అప్పగించిన ధాన్యాన్ని లెక్కల్లో చూపకుండా ఉంచడం, ఇతర అవసరాలకు మళ్లించడం లేదా సీఎంఆర్‌ను అందించకుండా బకాయి పెట్టడం వంటి చర్యలను తీవ్రంగా పరిగణిస్తామని తెలిపారు.సుల్తానాబాద్ మండలం సుగ్లాంపల్లి గ్రామంలోని లక్ష్మీ ఇండస్ట్రీస్‌పై ఆగస్టు 6న నిర్వహించిన తనిఖీలో ప్రభుత్వ ధాన్యం నిల్వలు భౌతికంగా అందుబాటులో లేనట్లు గుర్తించినట్లు కలెక్టర్ తెలిపారు. 2023-24 ఖరీఫ్, రబీ సీజన్లకు సంబంధించి మొత్తం 7,493.610 మెట్రిక్ టన్నుల ధాన్యం డిఫాల్ట్‌గా ఉన్నట్లు ప్రాథమికంగా గుర్తించామని, 25 శాతం పెనాల్టీతో కలిపి రూ.24.18 కోట్ల మేర డిఫాల్ట్ మొత్తం ఉన్నట్లు పేర్కొన్నారు.ఈ వ్యవహారంలో సంబంధిత మిల్లర్ ప్రభుత్వ ధాన్యాన్ని సక్రమంగా లెక్కించకపోవడం, సీఎంఆర్‌ను అందించకపోవడం వంటి అంశాలపై టీజీఎస్‌సీఎస్‌సీఎల్ జిల్లా మేనేజర్ పోలీసులకు ఫిర్యాదు చేసి ఎఫ్‌ఐఆర్ నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అసలు రికార్డులు, ధాన్యం అప్పగింత వివరాలు, సీఎంఆర్ డెలివరీ రికార్డులు, రవాణా వివరాలు, భౌతిక తనిఖీ నివేదికలను పరిశీలించి పూర్తి వివరాలను నిర్ధారించనున్నట్లు పేర్కొన్నారు.కొన్ని మిల్లుల వద్ద గత సీజన్లకు సంబంధించిన ప్రభుత్వ ధాన్యం కూడా భౌతికంగా అందుబాటులో లేనట్లు గుర్తించిన నేపథ్యంలో, సంబంధిత రికార్డులను పరిశీలించి బాధ్యులపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు.ప్రభుత్వ ధాన్యం, సీఎంఆర్ బకాయిల విషయంలో ఎలాంటి అవకతవకలకు తావులేకుండా తనిఖీలు, పంచనామాలు, రికార్డుల పరిశీలన నిరంతరం కొనసాగించాలని సంబంధిత అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. ప్రభుత్వానికి రావాల్సిన సీఎంఆర్‌ను సకాలంలో అందించడంతో పాటు, బకాయిలను పూర్తిగా వసూలు చేసేందుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ స్పష్టం చేశారు.ప్రభుత్వ

## కేంద్ర ప్రభుత్వ రైతాంగ, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను వ్యతిరేకించండి - సంయుక్త కిసాన్ మోర్చా



అశ్వరావుపేట ఆర్సి/ ఆగస్టు 17( కేంద్ర ప్రభుత్వం స్వదేశీ, విదేశీ కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా, రైతు, కార్మిక, ప్రజలకు వ్యతిరేకంగా అనుసరిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో అశ్వారావుపేట శాసనసభ్యులు జారే ఆదినారాయణ గారికి మెమోరాండం సమర్పించారు.అమెరికా, బ్రిటన్, న్యూజిలాండ్, యూరోపియన్ దేశాలతో కేంద్ర ప్రభుత్వం చేసుకున్న స్వేచ్ఛ వాణిజ్య ఒప్పందాలు దేశంలోని రైతులు మరియు శ్రామిక ప్రజలు ఎదుర్కొంటున్న తీవ్ర వ్యవసాయ, ఆర్థిక, సామాజిక సంక్షోభానికి కారణమవుతున్నాయని నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. డిమాండ్ల చార్టర్‌తో కూడిన ఈ మెమోరాండం సంయుక్త కిసాన్ మోర్చా జాతీయ కమిటీ పిలుపులో భాగంగా సమర్పించినట్లు తెలిపారు.ఈ సందర్భంగా ఎస్ కె ఎం నాయకులు అమర్లపూడి రాము, దొడ్డ లక్ష్మీనారాయణ, సుంకిపాక ధర్మ, గోకినపల్లి ప్రభాకర్, మోరంపూడి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఢిల్లీ సరిహద్దుల్లో జరిగిన చారిత్రాత్మక రైతు పోరాటం సందర్భంగా 2021 డిసెంబర్ 9న కేంద్ర ప్రభుత్వం ఎంఎస్పి, రుణమాఫీ, విద్యుత్ ప్రైవేటీకరణ మరియు రైతులపై కేసుల ఉపసంహరణపై ఇచ్చిన లిఖితపూర్వక హామీని అమలు చేయకపోవడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.ఢిల్లీ సరిహద్దుల్లో 385 రోజుల పాటు కొనసాగిన నిరంతర భారీ మహా పడావ్ పోరాటం రేయింబవళ్లు శాంతియుతంగా జరిగిందని, ఆ ఉద్యమంలో 736 మంది అమరులయ్యారని గుర్తు చేశారు. అమరవీరుల ప్రాణత్యాగం నేపథ్యంలో 2020 నవంబర్ నుండి అన్ని పంటలకు సేకరణతో కూడిన చట్టబద్ధమైన సి2 ప్లస్ 50 శాతం ఎంఎస్పి, గ్రామీణ రుణభారాన్ని అంతం చేసేందుకు సమగ్ర రుణమాఫీ, విద్యుత్ ప్రైవేటీకరణను అడ్డుకోవడం అనే ప్రధాన డిమాండ్ల సాధన కోసం ఎస్ కె ఎం పోరాటం కొనసాగుతుందన్నారు.స్వాతంత్ర్యానంతరం జరిగిన అతి పెద్ద ప్రజా పోరాటమైన ఈ రైతు పోరాటం 2021 నవంబర్ 19న 3 వ్యవసాయ చట్టాల రద్దును సాధించిందని, 2021 డిసెంబర్ 9 నాటి లిఖితపూర్వక హామీతో డిసెంబర్ 11న పోరాటాన్ని విరమించామని, అయితే గత ఐదేళ్లలో ఎన్డీఏ నేతృత్వంలోని మోదీ ప్రభుత్వం ఏ హామీలను అమలు చేయలేదని విమర్శించారు.శ్రామిక ప్రజలపై పెరుగుతున్న కార్పొరేట్ దాడిని ఉదహరిస్తూ గత 12 సంవత్సరాలుగా అధికారంలో ఉన్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 2014 బిజెపి ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన గిట్టుబాటు ధర సి2 ప్లస్ 50 శాతం ఫార్ములాకు చట్టబద్ధమైన హామీ వాగ్దానాన్ని నిరాకరించారని, పేద మరియు మధ్యతరగతి రైతులకు, కౌలు రైతులకు మరియు వ్యవసాయ కూలీలకు సంపూర్ణ కేంద్ర రుణమాఫీని నిరాకరిస్తూ రూ. 16 లక్షల కోట్ల కార్పొరేట్ బకాయిలను మాత్రం రద్దు చేశారని ఆరోపించారు.2026 ఆక్సాఫామ్ నివేదిక ప్రకారం భారతదేశంలో అత్యంత సంపన్నులైన 1 శాతం మంది 40 శాతం సంపదను కలిగి ఉండగా, పై స్థాయిలోని 10 శాతం మంది జాతీయ ఆదాయంలో 60 శాతం సంపాదిస్తున్నారని, అట్టడుగు 50 శాతం మంది జాతీయ ఆదాయంలో కేవలం 15 శాతం ఆదాయంతో జీవనం కొనసాగిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో కల్లూరి కిషోర్, పండూరి వీరబాబు, చిరంజీవి, కురసం ముత్యాలరావు, చెన్నారావు, కేశవరావు, బండి ఆదినారాయణ, కేసరి వెంకటేష్, సోయం నాగేశ్వరావు, సోయం లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## పింఛన్ కోసం ఎవరికీ డబ్బులు ఇవ్వకండి -- మోసపోవద్దు



హనుమకొండ జిల్లా/భీమదేవరపల్లి మండలం ప్రతినిధి: బుగ్గ సుధీర్ కుమార్, ఆగస్టు 17 గ్రామంలోని అర్హులైన ప్రజలకు ముఖ్యమైన విజ్ఞప్తివృద్ధాప్య, వితంతు, దివ్యాంగుల , గీత కార్మికుల , గీత కార్మికుల , బీడీ కార్మికుల పింఛన్ మరియు ప్రభుత్వం అమలు చేస్తున్న ఇతర ప్రభుత్వ పథకాలు,సామాజిక భద్రతా పింఛన్లకు అర్హత ఉన్న లబ్ధిదారులను ప్రభుత్వం నిర్ణయించిన నిబంధనల ప్రకారం సంబంధిత అధికారులు గుర్తిస్తారు.కాబట్టి పింఛన్ ఇప్పిస్తామని, పింఛన్ మంజూరు చేయిస్తామని, జాబితాలో పేరు చేర్పిస్తామని చెప్పి ఎవరైనా డబ్బులు అడిగినా లేదా డబ్బులు డిమాండ్ చేసినా ఇవ్వకండి. డబ్బులు ఇచ్చి మోసపోవద్దు.ప్రభుత్వ పింఛన్ అనేది అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం అందే సంక్షేమ పథకం. పింఛన్ కోసం మధ్యవర్తులకు లేదా వ్యక్తులకు డబ్బులు చెల్లించాల్సిన అవసరం లేదని ప్రజలు గుర్తుంచుకోవాలి.ఎవరైనా పింఛన్ ఇప్పిస్తామని చెప్పి డబ్బులు డిమాండ్ చేసినట్లు మీకు తెలిసినా, అలాంటి విషయం మీ దృష్టికి వచ్చినా, దయచేసి మా దృష్టికి తీసుకురాగలరు. అవసరమైన విషయాన్ని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు కృషి చేస్తాము. గ్రామంలోని వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, గీత కార్మికులు, గీత కార్మికులు, బీడీ కార్మికులు మరియు ఇతర వివిధ రకాలైన పెన్షన్ లకు అర్హులైన ప్రజలు ఎటువంటి మోసానికి గురికాకుండా ప్రజా అవగాహన తో అప్రమత్తంగా ఉండాలని విజ్ఞప్తి చేస్తున్నాను.ప్రభుత్వ పింఛన్ కోసం డబ్బులు ఇవ్వకండి -- అప్రమత్తంగా ఉండండి -- మోసపోవద్దు అని కొత్తపల్లి 8వ వార్డు సభ్యులు కాంగ్రెస్ నాయకుడు నడిగోటి నరేష్ మండల ప్రజలకు గ్రామ ప్రజలకు సూచించారు ..

## ఆడబిడ్డలకు మేనమామల కేసీఆర్... మాజీ ఎమ్మెల్యే మెచ్చ నాగేశ్వరరావు....



అశ్వరావుపేట ఆర్సి/ ఆగస్టు 17: కాంగ్రెస్ ప్రభుత్వం కావాలనే కళ్యాణ్ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాన్ని నిలిపివేయడాన్ని నిరసిస్తూ బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాలమేరకు నేడు దమ్మపేట ఎంఆర్ఓ కార్యాలయం ఎదుట అశ్వారావుపేట నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే, బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ మెచ్చా నాగేశ్వరావు నాయకులతో కలిసి నిరసన చేపట్టారు. డిమాండ్లతో కూడిన మెమోరాండంను డిప్యూటీ తహశీల్దార్ గారికి అందజేశారు.ఈ సందర్భంగా మెచ్చా నాగేశ్వరరావుమాట్లాడుతూ దోచుకోవడం దోచుకోవడమే పనిగా ముఖ్యమంత్రి నుంచి ఎమ్మెల్యే వరకు పెట్టుకున్నారని ఆరోపించారు. ప్రజల సంక్షేమాన్ని పూర్తిగా గాలికి వదిలేశారని విమర్శించారు. కోట్లాది సాధించుకున్న రాష్ట్రంలో ఈ ఆడబిడ్డ ఇబ్బంది పడకూడదనే ఆలోచనతో ఒక మేనమామలా కెసిఆర్ గారు కళ్యాణ్ లక్ష్మి షాదీ ముబారక్ పథకాన్ని ప్రవేశపెట్టి ఎంతోమందికి ఆర్థికంగాసహాయపడ్డారని అన్నారు. 2023 ఎన్నికల సమయంలో కెసిఆర్ కేవలం లక్ష మాత్రమే ఇస్తున్నారు, నేను గెలిచిన రోజు నుంచి లక్షతో పాటు తులం బంగారం కూడా ఇస్తానని ఆడబిడ్డలను నమ్మబలికి, నేడు అధికారంలోకి వచ్చాక హామీని అమలు చేయకపోగా ఇప్పటికే అమలులో ఉన్న పథకాన్ని ప్రశ్నార్థకంగా మార్చేశారని అన్నారు.గ్రామాల్లో ఆడబిడ్డలు కాంగ్రెస్ నాయకులను నిలదీస్తుంటే ఏం చెయ్యాలో తెలియని పరిస్థితుల్లో కాంగ్రెస్ నాయకులు ఉన్నారని, తులం బంగారం భారం నుంచి తప్పించుకోవడం కోసమే ఈ పథకాన్ని నిలిపివేయడానికి కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు.పెండింగ్ లో ఉన్న అర్హులైన ప్రతి లబ్ధిదారునికి ఆలస్యం లేకుండా ఆర్థిక సహాయం విడుదల చెయ్యడంతో పాటు, హైకోర్టు కేసులో ప్రభుత్వం తీసుకున్న చర్యలపై స్పష్టత ఇవ్వాలని, ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన తులం బంగారం హామీని ఎప్పుడు, ఎలా అమలు చేస్తుందో స్పష్టమైన ప్రకటన చెయ్యాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షులు దొడ్డ రమేష్, మాజీ వైస్ ఎంపీపీ దారా మల్లిఖార్జునరావు, మాజీ మండల ఉపాధ్యక్షులు గాజుబోయిన యేసుబాబు, నాయకపోడు సంఘం రాష్ట్ర నాయకులు రావుల శ్రీనివాసరావు, మండల



నాయకులు తుమ్మల లక్ష్మనరావు, మాజీ నియోజకవర్గ యూత్ కార్యదర్శి యార్లగడ్డ శ్రీనివాసరావు, మాజీ ఎంపీటీసీలు దేవరలపల్లి అజయ్ కుమార్, జలగం వాసు, చీకటి రామయ్య, గుత్తి శ్రీను, అబ్దుల్ జిన్నా, సర్పంచ్లు యాట్ల రాందాస్, కొమరం సుశీల, ఉప సర్పంచ్ రామకృష్ణ, వార్డ్ మెంబర్లు దారా రాము, రూప రాంబాబు, ఉయ్యాలలక్ష్మీనారాయణ, తోలేం మల్లేశ్వరరావు, సున్నం కృష్ణ, వేలుగోటి మహేష్, కాసిని శ్రీను, మద్దెల పుల్లారావు, అడపా వెంకట నరసయ్య నాయుడు, పాశం ప్రసాద్, వల్లేపు నాగేశ్వరరావు, గుడిపూడి రవి, గొర్రెపాటి వెంకటేశ్వరరావు, కవులూరి నాగయ్య, గుమ్మడపు విష్ణు, కోర్స వెంకటేష్, వాసం పండు, కవులూరి ఏసు, కందుకూరి రాంబాబు, గణేష్, అశోక్, పాశ్యం శరన్, మచ్చల ముత్యాలు, నాటి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## నాగపంచమి పర్వదినాన్ని ఘనంగా నిర్వహించిన భక్తులు



నాగపంచమి పర్వదినాన్ని పురస్కరించుకుని మంథని పట్టణంతో పాటు పరిసర గ్రామాల్లో భక్తులు నాగదేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంథని పట్టణంలోని నాగుల సందిలో ఉన్న నాగమయ్య పుట్ట వద్ద, గాజులపల్లె గ్రామంలోని నాగదేవతల ఆలయంలో భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకుని పూజలు చేశారు. వంశపారంపర్య సంప్రదాయాలను అనుసరిస్తూ పలువురు తమ ఇళ్లలో నాగదేవతను ప్రతిష్ఠించి పూజలు నిర్వహించారు. నాగపంచమి రోజున నాగపుట్టను పూజించడం, మట్టితో తయారు చేసిన నాగప్రతిమలకు పంచోపచార పూజలు చేయడం శ్రేష్ఠమని ధర్మశాస్త్రాలు పేర్కొంటున్నాయని పండితులు తెలిపారు. పంచాంగ గణన ప్రకారం పంచమి తిథి, చిత్రా నక్షత్రం, శుభయోగం, బాలవ కరణం, కన్యారాశిలో చంద్రుని సంచారం వంటి అంశాల మధ్య నాగపంచమి పర్వదినం వచ్చిందని తెలిపారు. నాగదోషం, రాహు--కేతువుల ప్రతికూల ప్రభావాలు, గ్రహణ దోషాలు ఉన్నవారు ఈ రోజున నాగదేవతకు ప్రత్యేక పూజలు నిర్వహించడం శుభప్రదంగా భావిస్తారని పేర్కొన్నారు. నాగపూజతో కుటుంబంలో శాంతి, మానసిక ప్రశాంతత కలుగుతాయని, వివిధ సమస్యలు, భయాలు తొలగుతాయని భక్తుల విశ్వాసం. సూర్యుని రాశి మార్పు, అగస్త్య నక్షత్రోదయం వంటి ఖగోళ పరిణామాలు కూడా ఈ పర్వదినానికి ప్రత్యేకతను కలిగించాయని పండితులు వివరించారు. నాగపంచమి సందర్భంగా ఆలయాలు, నాగపుట్టల వద్ద ఉదయం నుంచే భక్తుల సందడి నెలకొంది. మహిళలు, చిన్నారులు సంప్రదాయబద్ధంగా పూజలు నిర్వహించి నాగదేవతకు నైవేద్యాలు సమర్పించారు.

## కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్‌కు రాజ్యాంగ హక్కు కల్పించాలి

### మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య



సత్తుపల్లి ఆర్సి / ఆగస్టు 17:పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆడపిల్లల వివాహం ఆర్థిక భారంగా మారకుండా అండగా నిలుస్తున్న కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలకు రాజ్యాంగబద్ధమైన హక్కు కల్పించాలని మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు సండ్ర వెంకట వీరయ్య కల్లూరు లో విలేకరుల సమావేశంలో డిమాండ్ చేశారు.పేద కుటుంబాల్లోని ఆడపిల్లల వివాహాలకు ఆర్థిక సహాయం అందించడం ద్వారా ఈ పథకాలు ఎంతోమంది కుటుంబాలకు ఊరట కలిగించాయని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వం మారినప్పుడల్లా సంక్షేమ పథకాలపై అనిశ్చితి లేకుండా, అర్హులైన ప్రతి కుటుంబానికి ఈ సహాయం అందేలా చట్టబద్ధమైన, శాశ్వత హక్కుగా అమలు చేయాల్సిన అవసరం ఉందని అన్నారు.పేదల సంక్షేమం కోసం ప్రవేశపెట్టిన పథకాలను రాజకీయాలకు అతీతంగా కొనసాగించాలని, అర్హత ఉన్న ప్రతి లబ్ధిదారుడికి పారదర్శకంగా ప్రయోజనం అందించాలని సండ్ర వెంకట వీరయ్య కోరారు."పేదింటి ఆడపిల్ల పెళ్లి తల్లిదండ్రులకు ఆర్థిక భారంగా మారకూడదు. కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ కేవలం ప్రభుత్వ పథకాలు కాకుండా పేద కుటుంబాలకు భరోసాగా నిలిచే హక్కుగా మారాలి" అని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## కమ్యూనిటీ హాళ్ల నిర్మాణాలను వెంటనే పునఃప్రారంభించాలి - సిపిఎం డిమాండ్



సత్తుపల్లి ఆర్సి / ఆగస్టు 17సత్తుపల్లి మండలంలో నిలిచిపోయిన కమ్యూనిటీ హాళ్ల నిర్మాణాలను వెంటనే పునఃప్రారంభించాలని సిపిఎం సత్తుపల్లి మండల కమిటీ ఆధ్వర్యంలో సోమవారం సత్తుపల్లి మండల స్థాయి ప్రజావాణిలో అధికారులకు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందించారు.ఈ సందర్భంగా పార్టీ మండల కార్యదర్శి జాజిరి జ్యోతి మాట్లాడుతూ గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయంలో 2023లో సత్తుపల్లి మండలంలోని సిద్ధారం, గంగారం, కిష్టారం, రామ గోవిందపురం, తుమ్మూరు, నారాయణపురం, పాకలగూడెం, బేతుపల్లి, రేజర్ల, కాకర్లపల్లి, బుగ్గపాడు గ్రామాలలో ఎస్సి, ఎస్టి కమ్యూనిటీ హాళ్ల కోసం సత్తుపల్లి మండలానికి రూ. 2.75 కోట్లు కేటాయించారని తెలిపారు. ఒక్కొక్క కమ్యూనిటీ హాల్ కు రూ.25 లక్షలు మంజూరు అయినాయని అన్నారు.లైబ్రరీ, రీడింగ్ రూములతో కూడిన ఈ భవనాల నిర్మాణాలను కాంట్రాక్టర్లు సగంలోనే వదిలివేయడంతో ప్రజలకు ఎలాంటి ఉపయోగం లేకుండా పోయిందన్నారు. ఈ సమస్యపై సంబంధిత అధికారుల దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినప్పటికీ ఇప్పటివరకు శాశ్వత పరిష్కారం లభించలేదన్నారు.ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని సంబంధిత అధికారులతో విచారణ చేయించి, సమస్యను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో పార్టీ మండల కమిటీ సభ్యులు కువ్వారపు లక్ష్మణరావు, తడికమళ్ళ రామకృష్ణ, అయినంపూడి సనందరావు, ఫరీదా, ఆంగోతి చిట్టెమ్మ, శారద తదితరులు పాల్గొన్నారు.

## గౌడ్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సర్దార్ గౌతు లచ్చన్న జయంతి వేడుకలు




శ్రీకాళహస్తి నియోజకవర్గం, :సర్ధార్ గౌతు లచ్చన్న జయంతి వేడుకలు నేడు గౌడ్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సాగాయి. స్వతంత్ర సమర యోధుడు సర్దార్ అనే బిరుదు పొందిన రెండవ వ్యక్తి మన సర్దార్ గౌతు లచ్చన్న అని ఈ సందర్భంగా వారు గుర్తు చేసుకున్నారు. ఆయన జయంతిని పురష్కరించుకొని శ్రీకాళహస్తిలోని బాలుర ఉన్నత పాఠశాల ఎదురుగా ఉన్న ఆయన విగ్రహానికి పాలు, పెరుగు తో అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం గౌడ్ సంఘం నాయకులు పండ్లు, స్వీట్ లు అందరికి పంపిణీ చేసారు.ఈ కార్యక్రమంలో ఉదయగిరి మోహన్ గౌడ్, తిరుక్కాల ఆనంద్ గౌడ్, ముద్దా రాధాకృష్ణ గౌడ్, తిరుకాభత్తిని బత్తయ్య గౌడ్ ,అంజూరు ఈశ్వరయ్య గౌడ్, కళాత్తురు రవి గౌడ్, జడపల్లి మునిశేఖర్ గౌడ్, అప్పలాల గణేష్ గౌడ్, వన్నెటి సెల్వ గౌడ్, అనేం చక్రి గౌడ్, బంగారప్ప గౌడ్, రామస్వామి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## 24న ఛలో కలెక్టరేట్- కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం




శ్రీకాళహస్తి నియోజకవర్గం, (17.08.2026):సామాజిక శంఖారావంలో వెలుగు చూసిన దళిత సమస్యల పరిష్కారానికై ఈనెల 24న కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు అంగేరి పుల్లయ్య వెల్లడించారు. స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో కెవిపిఎస్, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో సోమవారం సామాజిక శంఖారావంపై సమీక్షా సమావేశం నిర్వహించారు. జూలై 15వ తేదీ నుంచి నియోజకవర్గంలో సామాజిక శంకరావం కార్యక్రమాన్ని చేపట్టినట్లు పేర్కొన్నారు. సమస్యలను సచివాలయం స్థాయి నుంచి ఆర్డీవో వరకు తీసుకెళ్లిన పరిష్కారం కాలేదన్నారు. స్వాతంత్రం సిద్ధించి 80 ఏళ్ళు దాటినా దళితవాడల్లో ఇంకా సామాజిక అంతరాలు, అస్పృశ్యతలు వివిధ రూపాల్లో దర్శనమిస్తున్నాయని వాపోయారు. కొన్ని గ్రామాల్లో దళితులకు ఇప్పటికీ ఆలయ ప్రవేశం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వారింకా అంటరానివారుగానే పరిగణించబడుతున్నారని అగ్రహం వ్యక్తం చేశారు. దళితవాడలు కనీస మౌలిక వసతులకు నోచుకోలేదని విచారం వ్యక్తం చేశారు. ముఖ్యంగా దళితులకు శ్మశానాలు లేక కాలువ గట్లపై అంత్యక్రియలు నిర్వహించుకోవాల్సిన దుస్థితి ఏర్పడిందని వాపోయారు. దళితవాడల్లో అంటరానితనం, కుల వివక్ష, మౌలిక వసతుల లేమిపై కమిటీలు వేశామనీ, ఛలో కలెక్టరేట్ కు దళితులు పెద్ద ఎత్తున హాజరై ఆందోళనలో పాలుపంచుకోవాలని పిలుపునిచ్చారు. వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు గంధం మణి, పెనగడం గురవయ్య, కేవీపీఎస్ నాయకులు వెంకటేష్, రాధమ్మ తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు పంటనష్ట పరిహారం, పంటల బీమా అందించాలి

### ఆర్డీవోకు కాంగ్రెస్ పార్టీ వినతి





ఆగస్టు 17 వర్షాభావ పరిస్థితుల కారణంగా రైతులు పంటలు సాగు చేయలేకపోతున్నారని, ఇప్పటికే సాగు చేసిన పంటలు సైతం ఎండిపోతున్న నేపథ్యంలో రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేసింది. పంట నష్టపోయిన రైతులకు ఎలాంటి షరతులు లేకుండా పంటనష్ట పరిహారం, పంటల బీమా అందించాలని కోరింది.ఈ మేరకు సోమవారం కళ్యాణదుర్గం ఆర్డీవో వసంతబాబుకు కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి రాంభూపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు రైతుల తరఫున వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ.. సూపర్ ఎల్‌నినో ప్రభావంతో దేశంలోనే అత్యల్ప వర్షపాతం నమోదయ్యే అనంతపురం జిల్లాలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయని తెలిపారు. పంటలు సాగు చేసేందుకు రైతులు ఇంట్లోని బంగారాన్ని బ్యాంకుల్లో తాకట్టు పెట్టి, అప్పులు చేసి పెట్టుబడులు పెట్టారని, అయితే వర్షాభావంతో పంటలు దెబ్బతిని తీవ్రంగా నష్టపోయి దిక్కుతోచని స్థితిలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు.రైతుల నుంచి పంటల బీమా ప్రీమియం వసూలు చేస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పంటలు నష్టపోయినప్పుడు 100 శాతం పంటల బీమా పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. అలాగే ప్రతి రైతుకుఎకరాకు రూ.25 వేల పంటనష్ట పరిహారం చెల్లించి ఆదుకోవాలని కోరారు.తీవ్ర వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో వ్యవసాయ కూలీలకు ఉపాధి లేకుండా పోయిందని, మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్) పనులను యథావిధిగా కొనసాగించి రైతు కూలీలకు పెద్ద ఎత్తున ఉపాధి పనులు కల్పించాలని కోరారు. తద్వారా కరువు పరిస్థితుల్లో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల సమస్యలపై సానుకూలంగా స్పందించి తక్షణమే సహాయక చర్యలు చేపట్టకపోతే కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని వారు హెచ్చరించారు.కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రజావాణికి జనం.. పరిష్కారానికి ఎదురుచూపులు




### దరఖాస్తులు స్వీకరణకే పరిమితం కాకుండా సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టాలి

మంథని, ఆగస్టు 17మంథని మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం తొలిరోజు ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీవో శ్రీజారెడ్డి, తహసీల్దార్ ఆరిఫోద్దీన్ ప్రజల నుంచి వివిధ సమస్యలకు సంబంధించిన దరఖాస్తులను స్వీకరించారు. తమ సమస్యలకు పరిష్కారం లభిస్తుందనే ఆశతో పలువురు ప్రజలు ప్రజావాణిని ఆశ్రయించారు. అయితే గతంలో ప్రజావాణిలో ఫిర్యాదులు అందజేసినా నెలల తరబడి సమస్యలు పరిష్కారం కాకపోవడంతో ప్రజల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది. దరఖాస్తులు స్వీకరించడం, సంబంధిత అధికారులకు పంపించడం వరకే ప్రక్రియ పరిమితమవుతోందని పలువురు బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### ఫిర్యాదులపై చర్యలు ఎక్కడ?

ప్రజావాణిలో ఇచ్చిన ఫిర్యాదులపై క్షేత్రస్థాయిలో విచారణ జరిపి వాస్తవ పరిస్థితులను పరిశీలించాల్సిన అధికారులు, సమస్యల పరిష్కారానికి స్పష్టమైన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఒక్కో సమస్య పరిష్కారానికి ఎంత సమయం పడుతుందో ఫిర్యాదుదారులకు తెలియజేసే విధానం ఉండాలని అంటున్నారు.

### పెండింగ్ ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి

ఇప్పటికే ప్రజావాణిలో అందిన పెండింగ్ దరఖాస్తులను గుర్తించి, వాటిపై తీసుకున్న చర్యలను సమీక్షించాలని ప్రజలు కోరుతున్నారు. ప్రజావాణి కార్యక్రమం కేవలం దరఖాస్తుల స్వీకరణకు పరిమితం కాకుండా, ప్రజల సమస్యలకు పరిష్కారం చూపే వేదికగా మారాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రజల నుంచి స్వీకరించిన ప్రతి ఫిర్యాదును సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి నిర్ణీత గడువులో పరిష్కరించేలా జిల్లా యంత్రాంగం పర్యవేక్షణ చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. ఫిర్యాదు చేసిన తర్వాత పరిష్కారం లభించినప్పుడే ప్రజావాణిపై ప్రజలకు విశ్వాసం పెరుగుతుందని పేర్కొంటున్నారు.

## గోపాల్‌పూర్‌లో సీసీ రోడ్డు, డ్రైనేజీ పనులకు శ్రీకారం
## రూ.25 లక్షల నిధులతో అభివృద్ధి పనులు ప్రారంభం



మంథని, ఆగస్టు 1 మంథని మండలం గోపాల్‌పూర్ గ్రామంలోని ఐదో వార్డులో సీసీ రోడ్డు, డ్రైనేజీ నిర్మాణ పనులకు సోమవారం శ్రీకారం చుట్టారు. రూ.25 లక్షల నిధులు మంజూరు కావడంతో వార్డు సభ్యుడు కొప్పుల రాఘవ పటేల్ కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభించారు. రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ల శ్రీను బాబు ఆదేశాల మేరకు గ్రామ అభివృద్ధి, పారిశుద్ధ్యాన్ని మెరుగుపరిచేందుకు నిధులు మంజూరైనట్లు నాయకులు తెలిపారు. సీసీ రోడ్డు, డ్రైనేజీ నిర్మాణంతో వార్డులో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారం లభించడంతో పాటు పారిశుద్ధ్యం మెరుగుపడుతుందని పేర్కొన్నారు. గ్రామంలో మౌలిక వసతుల అభివృద్ధికి నిధులు మంజూరు చేసిన మంత్రి శ్రీధర్ బాబు, శ్రీను బాబులకు స్థానిక ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. పనులను నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని నాయకులు సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మేడ రాజయ్య, ఉపసర్పంచ్ దాసరి రమాదేవి, వార్డు సభ్యులు సుంకరి రవి, జంగం సుమన్, పద్మ, సరిత, సీనియర్ కాంగ్రెస్ నాయకులు కొప్పుల భూమయ్య, చంద్రు, రాజమల్లు, రాజయ్య, యూత్ కాంగ్రెస్ నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలో తెలంగాణ ప్రభుత్వం ప్రజల సమస్యలను స్థానిక స్థాయిలో పరిష్కరానికే మండలస్థాయిలో ప్రజావాణి నిర్వహణ



ఇబ్రహీంపట్నం ఆగస్టు 17 జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలో వివరాలు ఇలాఉన్నాయి ఎంపిడివో కార్యాలయం లో మండల స్థాయిలో తెలంగాణ ప్రభుత్వం ప్రజల పరిష్కరానికి ప్రజావాణి కార్యక్రమం ఈరోజు ఉదయం 10.00గంటల నుండి మధ్యాహ్నం 1.00 గంటల వరకు మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపిడివో)కార్యాలయం ఇబ్రహీంపట్నం నందు నిర్వహించబడింది ప్రజల నుండి 10.00 గం నుండి 1.00వరకు వినతులులను స్వీకరించడం జరిగింది ఇట్టి వినతులు రెవెన్యూ డిపార్ట్మెంట్ కి 7 మిషన్ భగీరథ డిపార్ట్మెంట్ కి 2 విబిజిఆర్ఎఎంజి కి 1చొప్పున వచ్చాయి వాటిని సంబంధిత శాఖలకు పంపడం జరిగింది వాటి పరిష్కరానికి తక్ష్యనమే చర్యలు చేపట్టాలని ఎంపిడివో సిహెచ్ గణేష్ ఆదేశించారు ఈ కార్యక్రమంలో తాసిల్దార్ ప్రసాద్ ఎంపిఓ రామకృష్ణ రాజు ఎంఈఓ మధు వ్యవసాయ అధికారి రాజ్ కుమార్ మరియు మండల స్థాయిలో గల వివిధ 23 శాఖల అధికారులు పాల్గొన్నారు

## మండల స్థాయిలో ప్రజావాణి కా ర్యక్రమాలకు శ్రీకారం.

--నారాయణపేట ఎం.పి.డి.వో కా ర్యాలయంలో

ప్రజావాణిని ప్రారం భించిన జిల్లా కలెక్టర్ ప్రియాంక...



నారాయణపేట జిల్లా ప్రతినిధి1 7 )నారాయణపేట జిల్లా లో మండ ల స్థాయి ప్రజావాణి కార్యక్రమా లు సోమవారం నుంచి ప్రారంభ మయ్యాయి.రాష్ట్రవ్యాప్తంగా అ న్ని మండలాల్లోని ఎంపీడీవో కా ర్యాలయాల్లో ప్రజావాణి కార్యక్ర మాలను నిర్వహిస్తున్నారు.అం దులో భాగంగా నారాయణపేట ఎం పీ డీ



వో కార్యాలయంలో ఏ ర్పాటుచేసిన మండల స్థాయి ప్ర జావాణి కార్యక్రమాన్ని సోమవా రం జిల్లా కలెక్టర్ ప్రియాంక లాంఛ నంగా ప్రారంభించారు. ఈ సంద ర్భంగా ప్రజల నుంచి వివిధ సమ స్యలు,వినతులను స్వీకరించి,వా టిని పరిశీలించి సత్వర పరిష్కా రానికి చర్యలు తీసుకోవాలని అ ధికారులను కలెక్టర్ ఆదేశించారు ప్రజలకు అందుబాటు లో ఉండే విధంగా మండల స్థాయిలో ప్రజా వాణి కార్యక్రమాన్నిసమర్థవంతం గా నిర్వహించాలనిసూచించారు అనంతరం ఎం పీ డీ వో కార్యాల యంలో కొత్త పింఛన్లకు వచ్చిన దరఖాస్తుల వివరాలను కంప్యూ టర్ ఆపరేటర్ ను అడిగితెలుసు కున్నారు.కార్యాలయ కార్య కలా పాలను పారదర్శకంగాకొనసాగిం చాలని సంబంధితఅధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమం లో తహసిల్దార్ అమరేంద్ర కృష్ణ, ఎం పీ డీ వో విజయలక్ష్మి, ఎం ఈ వో బాలాజీ, వివిధ శాఖలకు చెందిన అధికారులు, ఉద్యోగులు పాల్గొ న్నారు.

## ఇబ్రహీంపట్నం మండల ప్రధానోపాధ్యాయుల సమావేశం నిర్వహించిన మండల విద్యాధికారి



ఇబ్రహీంపట్నం ఆగస్టు 17జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం కేంద్రంలోని మండల అభివృద్ధి అధికారి కార్యాలయంలో మండలంలోని అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయుల సమావేశాన్ని మండల వనరుల కేంద్రాల్లో నిర్వహించారు ఇట్టి సమావేశానికి అధ్యక్షత వహించినటువంటి మండల విద్యాధికారి బందారి మధు మాట్లాడుతూ ఇటీవల నిర్వహించిన వృత్యాంతర శిక్షణలో నేర్చుకున్న ఎఫ్ ఎల్ ఎన్ మరియు ఎల్ఐపి గురించి పూర్తిగా అనాలసిస్ చేసుకుని ఎక్కడైతే వెనుకబడి ఉన్నారు అక్కడ ప్రత్యేక శ్రద్ధ వహించి మెరుగైన ఫలితాలు సాధించగలరని తెలియజేయడం జరిగింది ఉపాధ్యాయుల యొక్క ప్రాథమిక కర్తవ్యం విద్యార్థికి చదువు వచ్చేల చూడడం కావున దీనిపైన దృష్టి పెట్టగలరని సూచించారు ఎఫ్ఆర్ఎస్ అటెండెన్స్ కూడా ఉపాధ్యాయులది మరియు విద్యార్థులది ప్రతిరోజు నమోదు అవుతుందో లేదో సరి చూసుకోగలరని తెలిపారు ఎన్రోల్మెంట్ గ్యాప్ లేకుండా చూసుకోగలరని తెలియజేయడం జరిగింది స్కూల్ ఎడ్యుకేషన్ వెబ్సైట్లో అడిగినటువంటి సమాచారాన్ని ఎప్పటికప్పుడు పొందుపరచగలరని తెలిపారు ఇట్టి సమావేశంలో ప్రధానోపాధ్యాయులు సిఆర్పిలు మరియు ఎంఆర్సీలు సిబ్బంది పాల్గొన్నారు

## నూతనంగా ఏర్పాటు చేసిన మొ దటి ప్రజావాణి కార్యక్రమం విజ యవంతం.

--ప్రజల సమస్యల పై13 దరఖా స్తులు వచ్చాయని మరికల్ ఎం. పీ.డీ.వో. పృథ్వి తెలిపారు.




నారాయణపేట జిల్లా ప్రతినిధి1 7 నారాయణపేట జిల్లా, మరికల్ మండల ఎం. పీ. డీ.వో. కార్యాల యంలో తెలంగాణ రాష్ట్ర ప్రభు త్వం మొట్ట మొదట ఏర్పాటుచే సిన మండల ప్రజావాణి కార్యక్ర మం విజయవంతమైందని ఎంపీ డీవో పృథ్వి తెలిపారు.ఈ కార్యక్ర మానికి చుట్టు పక్కన గల వివిధ గ్రామాల ప్రజలు తమ సమస్యల పై ఇచ్చిన దరఖాస్తులు వివరాలు ఇలా,రెవిన్యూ శాఖకు సంబంధిం



చినవి10దరఖాస్తులు,ఇందిరమ్మ ఇల్లు కావాలని1,విద్యుత్తు కనెక్ష న్ కోసం1, పంచాయతీ రాజ్ 1,ఈ ప్రకారంగా మొత్తము13 దర ఖాస్తులు వచ్చినాయని వీటి గు రించి ఎం.పీ.డీ.వో. నో డల్ అధి కారి ప్రజావాణి సంబంధిత వివి ధ శాఖల వారికి ఆన్లైన్లోదరఖాస్తు లను పంపించడం జరుగుతుంది. మీరు వెంటనే వారి సమస్యలను పరిష్కరించి,ఆన్ లైన్ ద్వారా ఒ క కాపీని మాన్యువల్ గా మండ ల పరిషత్ కార్యాలయానికి సమ ర్పించవలసినదిగా సమావేశము నందు కోరినారు.ఇక మీదట ప్రతి సోమవారం విధి గా ఇట్టి ప్రజావా ణి కార్యక్రమానికి అధికారులంద రూ హాజరు రావలసిందిగా ఎం పీడీవో పృథ్వీ కోరడం జరిగినది.

## బస్టాండ్‌ను సందర్శించిన డిపో మేనేజర్



కరీంనగర్ జిల్లా, ఆగస్టు 17:శంకరపట్నం మండలం కేశవపట్నం బస్టాండ్‌ను సోమవారం హుజురాబాద్ డిపో మేనేజర్ వి. రవీంద్రనాథ్ సందర్శించారు. ఇటీవల కురిసిన వర్షాలకు బస్టాండ్ ఆవరణలో గుంతలు ఏర్పడటంతో ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా వాటిని తాత్కాలికంగా మరమ్మతులు చేయించామని తెలిపారు.ప్రయాణికుల సౌకర్యార్థం అవసరమైన చర్యలు చేపడతామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సీఐ అంజెల్, డీసీ రాణి, బస్టాండ్ ప్యాసింజర్ గైడ్ హనుమంతరావు, ఓఎస్జీ హరిమ్యాల్ రెడ్డి పాల్గొన్నారు.

## దమ్మపేట మండలంలో ఎంపీ, ఎమ్మెల్యేల సంయుక్త పర్యటన



అశ్వరావుపేట ఆర్సి / ఆగస్టు 17 అశ్వారావుపేట నియోజకవర్గం దమ్మపేట మండలంలో ఉమ్మడి ఖమ్మం జిల్లా పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురామిరెడ్డి, అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ సోమవారం సంయుక్తంగా విస్తృతంగా పర్యటించారు.ఈ పర్యటనలో భాగంగా దమ్మపేట మండలంలోని పట్వారిగూడెం గ్రామంలో నూతనంగా నిర్మించనున్న గ్రామపంచాయతీ భవన నిర్మాణ పనులకు నాయకులు ఘనంగా శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ పరిపాలనను ప్రజలకు మరింత చేరువ చేయడమే లక్ష్యంగా, గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని తెలిపారు.



పట్వారిగూడెంలో నూతన పంచాయతీ భవన నిర్మాణం పూర్తయితే స్థానిక ప్రజలకు పాలనా సేవలు మరింత వేగవంతంగా మరియు సులభంగా అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు నిరంతరం కృషి చేస్తామని పునరుద్ఘాటించారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, మండల స్థాయి అధికారులు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, గ్రామ పంచాయతీ ప్రతినిధులు మరియు పట్వారిగూడెం గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పశువుల ఆరోగ్య విషయం పై ప ట్టించుకోని పశువైద్య అధికారు లు.

-రైతుకు తీవ్ర నష్టం జరిగిందని గ్రామస్తుల ఆరోపణ....



నారాయణపేట జిల్లా ప్రతినిధి1 7నారాయణపేట జిల్లా, ధన్వాడ మండలం, యంనోనిపల్లి గ్రామా నికి చెందిన రైతు దొబ్బలి రాము లు కాడి ఎద్దు అనారోగ్యానికి గు రైందని, ఎద్దు ఆరోగ్యం విషమం గా ఉందని, రైతు పలుమార్లు ప శు వైద్య అధికారులకు సమాచా రం ఇచ్చినా, వారు స్పందించ లే దని, రైతు ఆవేదన వ్యక్తం చేశా రు. సకాలంలో పశువైద్యులు వ చ్చి చికిత్స చేసి, ఇంజెక్షన్ వేసి ఉంటే ఎద్దు ప్రాణాలు నిలిచేవని రైతు కన్నీరు మున్నీరుగా విలపి స్తున్నారు.పశువును కోల్పోవడం తో రైతు కుటుంబానికి తీవ్ర ఆర్థి క నష్టం జరిగింది.కాబట్టి రైతు ఫి ర్యాదును పట్టించుకోకుండా నిర్ల క్ష్యంగా వ్యవహరించిన ధన్వాడ మండల పశువైద్య అధికారులపై విచారణ జరిపి, బాధ్యులపై తగి న చర్యలు తీసు కోవాలని కోరు తున్నారు. తెలంగాణ పశుసంవ ర్ధక శాఖ మంత్రివాకిటి శ్రీహరి ఈ ఘటనపై వెంటనే విచారణ జరి పించి, బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవడం తో పాటు బాధిత రైతుకు ప్రభుత్వం ద్వార తగిన నష్టపరిహారం అందించాల ని మనవి చేశారు.

## కోతుల బెడద పై ప్రజావాణి లో సర్పంచ్ పిర్యాదు



కరీంనగర్ జిల్లా ఆగస్టు 17 శంకరపట్నం మండలం ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజావాణిలో రాజాపూర్ సర్పంచ్ కొంకటి రవి కోతుల బెడద నివారించాలని పిర్యాదు చేశాడు, గ్రామంలో కోతుల బెడద వల్ల 25 మందికి గాయాలయ్యనీ సర్పంచ్ తో పాటు పలువురు వార్డు సభ్యులు ఎంపీడీవో కు పిర్యాదు చేశారు .90%వికలాంగత్వం ఉన్న తన కుమారుడికి పెన్షన్, భర్త చనిపోయి ఎళు ్ళ గడుస్తున్న తనకు వితంతు పెన్షన్ రావడం లేదని తాడికల్ గ్రామానికి చెందిన అల్లేపుల లావణ్య అనే మహిళ అధికారులకు ఫిర్యాదు చేశారు .ప్రజావాణిలో వివిధ గ్రామాలకు చెందిన ప్రజలు తమ సమస్యల పై పిర్యాదు చేయగ మండల ప్రత్యేక అధికారి భాగ్యలక్ష్మి సమస్యలు విన్నారు. ప్రజావాణి కార్యక్రమం ఉదయం 10 గంటలకు ప్రారంభం కాగా అటవీ శాఖ ఉద్యోగి ఆలస్యంగా మధ్యానం 12 గంటలకు హాజరయ్యారు ,ప్రజావాణి ఆలస్యంగా హజారైనా సదరు ఉద్యోగి పై శాఖ పరమైన చర్యలకు నివేదించనున్నట్లు ఎంపీడీవో తెలిపారు .ఈ కార్యక్రమంలో ఎంపీడీవో అనిత,తహసిల్దార్ సురేఖ, ఎంపీఓ ప్రభాకర్ , ఎస్సై శేఖర్ రెడ్డి,వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు .

## ప్రజావాణి ఫిర్యాదులకు ప్రాధా న్యత ఇచ్చి పరిష్కరించాలి.

నారాయణపేట జిల్లా ప్రతినిధి1 7 ) ప్రజావాణి ఫిర్యాదుల కు ప్రాధా న్యత ఇచ్చి వీలైనంత త్వరగా



వాటిని పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ప్రియాంక ఆదేశించారు. జిల్లా కలెక్టరేట్ లోని ప్రజావాణి సమావేశ మందిరంలో సోమవా రం నిర్వహించిన ప్రజావాణి కా ర్యక్రమాని కి15 ఫిర్యాదులు వ చ్చాయి. జిల్లా లోని వివిధ ప్రాం తాలనుండి వచ్చిన ఫిర్యాదు దా రులు తమ సమస్యలను జిల్లా కలెక్టర్ కు విన్నవిస్తూ అర్జీలు స మర్పించారు.ఈ సందర్భంగ కలె క్టర్ మాట్లాడుతూ...ప్రజావాణి అ ర్జీలను పెండింగ్ లో పెట్టకుండ స త్వరం పరిష్కరించాలన్నారు. శా ఖల వారీగ ఆయా అర్జీలనుఎప్ప టికప్పుడు పరిశీలించి వెంటనే ప రిష్కరించాలని కలెక్టర్ సూచిం చారు.ఈ కార్యక్రమంలోరెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీను, డి.ఆర్.ఓ. రాజేశ్వరి,వివిధ శాఖల జిల్లాఅధి కారులు పాల్గొన్నారు.గ

# గ్రామీణ ప్రాంతాల సమగ్ర అభివృ ద్ధికి, బేస్ లైన్ డేటా కీలకం.

-ప్రతి గ్రామ పంచాయతీకి సంబం ధించిన సమాచారాన్ని క్షుణ్ణంగా సేకరించి ధృవీకరించాలి.....

--నారాయణపేట జిల్లా కలెక్టర్ సి హెచ్ ప్రియాంక....



నారాయణపేట జిల్లా ప్రతినిధి1 7 గ్రామ పంచాయతీలు, మున్సిపా లిటీల స్థాయిలో సమగ్ర బేస్‌లైన్ డేటా సేకరణకు అత్యంత ప్రాధా న్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ ప్రి యాంక అధికారులకు సూచించా రు. భవిష్యత్‌లో మౌలిక వసతు లు,విద్య, వైద్యం,



తాగునీరు, పా రిశుద్ధ్యం,రవాణా,విద్యుత్,వ్యవ సాయం, పరిశ్రమలు తదితర రం గాల్లో అభివృద్ధి ప్రణాళికలు రూ పొందించేందుకు ఈ డేటా కీలక ఆధారంగా ఉంటుందని ఆమె తె లిపారు. సోమవారం జిల్లా కలెక్ట రేట్ లోని ప్రజావాణి హాల్ లో జ రిగిన డీ సీ హెచ్ బీ - జనగణన - 2027సమావేశంలో జిల్లా అధికా రులకు కలెక్టర్ పలు సూచనలు, కీలక ఆదేశాలు జారీ చేశారు.ప్ర స్తుతం జరుగుతున్న భారత జ నాభా లెక్కలు 2027 (16 వ జ నగణన) లో భాగంగా, మునుప టి కంటే భిన్నంగా ఈసారి సరికొ త్త డిజిటల్ పద్ధతుల్లోడీ సీ హెచ్ బీ డేటా సేకరణ ప్ర క్రియ సాగు తోందనీ,జిల్లాకు విడివిడిగా డీ సీ హెచ్ బీనివేదికనునిరంతరాయం గా ప్రచురిస్తున్నారని, ఇది క్షేత్రస్థా యి (గ్రామ, పట్టణ) ప్రణాళికలు, అభివృద్ధి పథకాల రూపకల్పన కు ప్రధాన వనరుగా ఉపయోగప డుతుందని కలెక్టర్ స్పష్టంచేశారు గ్రామ పంచాయతీ కార్యదర్శులు ఫీల్డ్ ఫంక్షనరీల కు డేటా సేకరణ విధానంపై ఇప్పటికే శిక్షణఅందిం చినట్లు తెలిపారు.ప్రతి గ్రామ పం చాయతీకి సంబంధించిన సుమా రు 400 అంశాలు,మున్సిపాలిటీ లకు సుమారు 420 అంశాల కు సంబంధించిన సమాచారాన్నిసం బంధిత శాఖల నుంచి సేకరించా ల్సి ఉంటుందని పేర్కొన్నారు.వి ద్యకు సంబంధించిన పాఠశాల లు, కళాశాలలు,వృత్తి విద్యాసం స్థలు, వాటి నిర్వహణ విధానం, దూరం తదితర వివరాలను న మోదు చేయాలని సూచించారు. అదే విధంగా వైద్య రంగంలో ప్ర భుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులు, వై ద్య సిబ్బంది, పడకల సంఖ్య, పా రామెడికల్ సిబ్బంది,మెడికల్ షా పులు తదితర వివరాలను సేక రించాలన్నారు.తాగునీరు,పారిశుద్ధ్యం, రవాణా, పోస్టల్, మొబై ల్ నెట్‌వర్క్, విద్యుత్, బ్యాంకిం గ్, భూముల వినియోగం, సాగు నీరు, వ్యవసాయం, పశుసంవర్ధ క, పరిశ్రమలు తదితర అన్ని రం గాలకు సంబంధించిన సమాచా రాన్ని సమగ్రంగా నమోదుచేయా లని సూచించారు.ప్రతి డేటా ను క్షుణ్ణంగా పరిశీలించాలని, డేటా సేకరణలో ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా సంబంధిత అధి కారులు బాధ్యతగా వ్యవహరిం చాలని తెలిపారు. పంచాయతీ స్థాయి లో సేకరించిన సమాచా రాన్ని మండల, జిల్లా స్థాయి లో సంబంధిత లైన్ డిపార్ట్‌మెంట్ అ ధికారులు తప్పనిసరిగా పరి శీ లించి ధ్రువీకరించాలన్నారు.ప్రతి గ్రామ పంచాయతీలో సంబంధిత శాఖల ఫీల్డ్ అధికారులు, పంచా యతీ కార్యదర్శులు, ఉపాధ్యా యులు, విద్యుత్ శాఖ సిబ్బంది, వ్యవసాయ, వైద్య, రవాణా తది తర శాఖల అధికారులు సమన్వ యం తో సమావేశాలు నిర్వహిం చి సమాచారాన్ని నిర్ధారించు కో వాలని సూచించారు.

### 15 రోజుల్లో ప్రక్రియ పూర్తి చేయా లి...

డేటా సేకరణ, పరిశీలన, అవసర మైన సవరణల ప్రక్రియను 15 రో జుల్లో పూర్తి చేయాలని అధికారు లకు సూచించారు.వచ్చేవారంలో మండల, జిల్లా స్థాయిలో సమీక్ష నిర్వహించి ప్రతి గ్రామ పంచాయ తీకి సంబంధించిన డేటా సేకరణ ఎంతవరకు పూర్తయింది, సంబం ధిత అధికారులు ధ్రువీకరించారా లేదా అనే అంశాలను పరిశీలించ నున్నట్లు తెలిపారు.ప్రతిగ్రామపం చాయతీకి ప్రత్యేకతగా ఉన్న ప ర్యాటక ప్రాంతాలు, చేనేత, స్థాని క ఉత్పత్తులు, ప్రత్యేక వృత్తులు, ఇతర అభివృద్ధి అవకాశాలను డేటాలో నమోదు చేయాలని సూ చించారు. భవిష్యత్‌లో 20 నుం చి 30 సంవత్సరాల వరకు అభి వృద్ధి ప్రణాళికలకు ఈ బేస్‌లైన్ డేటా ఉపయోగ పడే అవకాశం ఉన్నందున ప్రతి అధికారి ఈ కా ర్యక్రమాన్ని అత్యంత బాధ్యతతో నిర్వహించాలని కోరారు.అన్నిశా ఖల అధికారులు సమన్వయం తో పనిచేసి నాణ్యమైన, ఖచ్చిత మైన డేటాను అందించాలని సూ చించారు. ఈ కార్యక్రమంలో జి ల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీ ను, డీఆర్వో రాజేశ్వరి ఉన్నారు.

# అందానికి అదృష్టం తోడైతే ఇలాగే ఉంటుంది మరి!



'మిరాయ్'తో మెప్పించిన రితికా

బలమైన కథ కోసమే తీసుకున్న గ్యాప్

'కొరియన్ కనకరాజు'తో భారీ హిట్

మరిన్ని అవకాశాలతో దూసుకుపోయే ఛాన్స్

ఒకప్పుడు మీనా .. రంభ .. నగ్మా వంటి బొద్దుగా ఉన్న బ్యూటీలు తెలుగు తెరను ఒక ఊపు ఊపేశారు. స్టార్ హీరోలతో కలిసి వరుస విజయాలను అందుకుంటూ, తమ కెరియర్ ను పరుగులు తీయించారు. అలా కాస్త బొద్దుగా కనిపిస్తూ .. క్యూట్ ఎక్స్ ప్రెషన్స్ తో ఈ మధ్య కాలంలో యూత్ ను ఆకట్టుకున్న బ్యూటీగా రితికా నాయక్ కనిపిస్తుంది. 'మిరాయ్' సినిమాలో ఈ సుందరిని చూసిన కుర్రాళ్లు, థియేటర్స్ దగ్గరే మనసులు పోగొట్టుకున్నారు. ఈ ముద్దుగుమ్మ నెలకో సినిమా చేస్తే బాగుండునే అనుకున్నారు. కానీ 'మిరాయ్' మాదిరిగానే తనకి బాగా నచ్చే కంటెంట్ కోసం రితికా ఎదురుచూస్తూ వచ్చిందనే విషయం, 'కొరియన్ కనకరాజు' రిలీజ్ తరువాతనే అర్థమవుతోంది. రీసెంటుగా విడుదలైన ఈ సినిమా, అనూహ్యమైన రెస్పాన్స్ ను అందుకుంది. కొంత కాలంగా అసంతృప్తిగా ఉన్న వరుణ్ తేజ్ కి ఈ సినిమా ఫలితం ఊరటను ఇచ్చింది .. కొత్త ఉత్సాహాన్ని ఇచ్చింది.



ఈ సినిమాలోను నటన పరంగా .. గ్లామర్ పరంగా రితికా మంచి మార్కులు కొట్టేసింది. అందానికి అదృష్టం తోడైతే ఇలాగే ఉంటుందని అనిపించింది. కొంత కాలంగా టాలీవుడ్ లో హీరోయిన్స్ వైపు నుంచి సందడి తగ్గిందనే చెప్పాలి. ఒకటి రెండు సినిమాలు చేసుకుపోతున్నారే తప్ప, నిలకడగా ఎవరూ సక్సెస్ లు సాధించలేకపోతున్నారు. టాప్ త్రీ .. టాప్ 5 అంటూ గతంలో మాదిరిగా ఒక జాబితా చూసుకుంటే, ఎవరూ కనిపించని ఒక గందరగోళం ఉంది. అలాంటి పరిస్థితుల్లో మరో భారీ హిట్ ను అందుకున్న రితికా, మరిన్ని అవకాశాలతో బిజీ అవుతుందేమో చూడాలి.



# ప్రళయ్.. ధురంధర్ తర్వాత రణ్‌వీర్ సింగ్ కొత్త ప్రాజెక్టు ఇదే..



## సెట్స్‌పైకి భారీ సర్వైవల్ థ్రిల్లర్

'ప్రళయ్' అనే కొత్త సినిమా షూటింగ్‌ను ప్రారంభించిన రణ్‌వీర్ సింగ్

ముంబై నేపథ్యంలో భారీ స్థాయిలో పోస్ట్-అపోకలిప్టిక్ సర్వైవల్ థ్రిల్లర్

'స్కామ్ 1992' ఫేమ్ జై మెహతా దర్శకత్వం, కీలక పాత్రలో కళ్యాణి ప్రియదర్శన్

సుమారు రూ.300 కోట్ల బడ్జెట్‌తో బిర్లా, హన్సల్ మెహతా, రణ్‌వీర్ సంయుక్త నిర్మాణం

'ధురంధర్' సిరీస్ బ్లాక్‌బస్టర్ విజయం తర్వాత రణ్‌వీర్ నటిస్తున్న చిత్రం

భారత సినీ చరిత్రలోనే అత్యధిక వసూళ్లు సాధించిన 'ధురంధర్: ది రివెంజ్' తర్వాత బాలీవుడ్ ఎనర్జిటిక్ స్టార్ రణ్‌వీర్ సింగ్ తన తదుపరి భారీ ప్రాజెక్ట్‌ను పట్టాలెక్కించారు. 'ప్రళయ్' పేరుతో తెరకెక్కుతున్న ఈ ప్రతిష్ఠాత్మక చిత్రం షూటింగ్ ఆదివారం ముంబైలో ప్రారంభమైంది. పోస్ట్-అపోకలిప్టిక్ సర్వైవల్ థ్రిల్లర్‌గా రూపొందుతున్న ఈ సినిమా చిత్రీకరణను ముంబై పరిసర ప్రాంతాల్లోని లైవ్ లొకేషన్లలో నిర్వహిస్తున్నారు. 'స్కామ్ 1992: ది హర్షద్ మెహతా స్టోరీ', 'లూటేరే' వంటి విమర్శకుల ప్రశంసలు పొందిన సిరీస్‌లకు దర్శకత్వం వహించిన జై మెహతా ఈ చిత్రానికి దర్శకుడు. ప్రముఖ దర్శకుడు హన్సల్ మెహతా కుమారుడైన జై, చాలాకాలంగా ఈ కథపై పనిచేస్తున్నట్లు తెలుస్తోంది. ఇక ఈ చిత్రంలో రణ్‌వీర్ సింగ్‌కు జోడీగా కాకుండా, ఓ కీలక పాత్రలో 'లోకా' ఫేమ్, మలయాళ నటి కల్యాణి ప్రియదర్శన్ నటిస్తున్నారు. కుప్పకూలుతున్న ప్రపంచంలో మనుగడ, ధైర్యం, విలువైన వాటి కోసం సాగే పోరాటమే ఈ చిత్ర కథాంశం. సుమారు రూ.300 కోట్ల భారీ బడ్జెట్‌తో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నట్లు సమాచారం. భారతదేశంలో ఇంత భారీ స్థాయిలో ఇలాంటి కథాంశంతో సినిమా రావడం ఇదే తొలిసారని దర్శకుడు హన్సల్ మెహతా పేర్కొన్నారు. రణ్‌వీర్ సింగ్ ఈ ప్రాజెక్ట్‌పై చూపిన ఆసక్తి, నిబద్ధత వల్లే ఇది సాధ్యమైందని ఆయన తెలిపారు. ఈ చిత్రాన్ని ప్రముఖ పారిశ్రామికవేత్త అనన్య బిర్లాకు చెందిన బిర్లా స్టూడియోస్, హన్సల్ మెహతా-సాహిల్ సైగల్‌కు చెందిన ట్రూ స్టోరీ ఫిలింస్, రణ్‌వీర్ సింగ్ సొంత నిర్మాణ సంస్థ మా కసమ్ ఫిలింస్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. జై మెహతా, విశాల్ కపూర్ కలిసి రాసిన ఈ ఒరిజినల్ కథపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ప్రస్తుతం చిత్రీకరణ



# పవర్ స్టార్ 'OG2' పై బిగ్ అప్‌డేట్..

ఏర్పాట్లు పూర్తి కాగానే

రెగ్యులర్ అప్‌డేట్స్!

పవర్ స్టార్ పవన్ కల్యాణ్ అభిమానులకు పండుగలాంటి వార్త బయటకు వచ్చింది. టాలీవుడ్‌లో ఎంతోమంది ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'దే కాల్ హిమ్ 'OG' సీక్వెల్ ''OG 2'పై ఒక క్రేజీ అప్‌డేట్ సోషల్ మీడియాను ఊపేస్తోంది. ఇక పవన్ కల్యాణ్ ఈ ప్రాజెక్ట్ కోసం డేట్స్ కేటాయించినట్లు వార్తలు వస్తుండటంతో అభిమానుల ఆనందానికి అవధులు లేవు. ప్రాజెక్ట్‌కి సంబంధించిన కొన్ని ముఖ్యమైన పనులు పూర్తయిన వెంటనే వరుస అప్‌డేట్స్ ఇచ్చేందుకు చిత్రబృందం సమాయత్తమవుతోంది. ఆ విశేషాలు చూద్దాం.. ؟ాశ్రీంశీ =ముం - రామ్ చరణ్ తర్వాత బుచ్చిబాబు కథ ఎవరికి? హీరోల లిస్ట్‌లో ఎవరెవరు ఉన్నారంటే? డేట్స్ ఇచ్చేసిన పవన్ కల్యాణ్: దర్శకుడు సుజీత్ రూపొందించిన ''OG' ప్రపంచంలో పవన్ కల్యాణ్ 'ఓజస్ గంభీర' అలియాస్ ''OG'గా చూపించిన స్టైల్, పవర్‌ఫుల్ స్క్రీన్ ప్రెజెన్స్ అభిమానులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఇక ఇప్పుడు పార్ట్ 2 కోసం పవన్ కల్యాణ్ డేట్స్ కేటాయించారని తెలుస్తుండటంతో షూటింగ్ పనులు త్వరలోనే ఊపందుకోనున్నాయి. మేకర్స్ ప్రాథమిక ఏర్పాట్లలో నిమగ్నమై ఉన్నారు. సెప్టెంబర్ 2న బర్త్‌డే స్పెషల్ ప్రోమో?: ఇప్పటికే ఫిల్మ్ నగర్‌లో వినిపిస్తున్న సమాచారం ప్రకారం.. ''OG 2' కోసం ఒక ప్రత్యేకమైన యానిమేషన్ ప్రోమోను సిద్ధం చేయాలని చిత్రయూనిట్ ప్లాన్ చేస్తోంది. ఇక పవన్ కల్యాణ్ పుట్టినరోజైన సెప్టెంబర్ 2న ఈ స్పెషల్ ప్రోమోను విడుదల చేసే ఆలోచనలో ఉన్నట్లు వార్తలు వస్తున్నాయి. అయితే దీనిపై మేకర్స్ నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. ప్రస్తుతం సినిమాకు సంబంధించి కొన్ని కీలకమైన ప్రీ-ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఇవి పూర్తి కాగానే అభిమానుల కోసం రెగ్యులర్ అప్‌డేట్స్ ఇవ్వడం ప్రారంభించాలని ప్రొడక్షన్ టీమ్ భావిస్తోంది. ఇక పవన్ క్యారెక్టరైజేషన్, యాక్షన్ ఎపిసోడ్స్ ఈ సీక్వెల్‌లో మరింత పవర్‌ఫుల్‌గా ఉండబోతున్నట్లు టాక్. మరింత వినూత్నంగా సుజీత్ మేకింగ్: మొదటి భాగంలో పవన్ కల్యాణ్‌ను ఒక రేంజ్‌లో చూపించిన సుజీత్, ''OG 2'ని అంతకుమించి తీర్చిదిద్దేందుకు పక్కా స్క్రిప్ట్‌ను సిద్ధం చేశారు. ఇక యాక్షన్, ఎమోషన్ కలగలిపి గ్లోబల్ స్థాయిలో ఈ చిత్రాన్ని తెరకెక్కించేందుకు ఏర్పాట్లు ముమ్మరం చేశారు. పవర్ స్టార్ అభిమానులకు ''OG 2' ఒక గ్రాండ్ విజువల్ ట్రీట్‌లా ఉండబోతోందనడంలో ఎలాంటి సందేహం లేదు. పవన్ కల్యాణ్ గ్రాండ్ ఎంట్రీ, సుజీత్ విజన్ కలగలిసి థియేటర్లలో ఏ స్థాయి సంచలనం సృష్టిస్తాయో వేచి చూడాలి.



# 'స్పిరిట్' లో ప్రభాస్ ఇంట్రోపై భారీ హైప్.. వంగా కొత్త ప్లాన్ ఇదేనా?

: టాలీవుడ్ రెబల్ స్టార్ ప్రభాస్, సంచలన దర్శకుడు సందీప్ రెడ్డి వంగా కాంబినేషన్‌లో వస్తున్న 'స్పిరిట్' సినిమాపై అంచనాలు ఆకాశాన్ని తాకుతున్నాయి. పాన్-ఇండియా స్థాయిలో హైప్ వున్నా మూవీస్ స్పిరిట్ కూడా ఒకటి. ఇందులో ప్రభాస్ ఒక శక్తివంతమైన పోలీస్ ఆఫీసర్‌గా కనిపిస్తున్నారు. ముఖ్యంగా ఇందులో ఆయన పాత్రను ఎలా పరిచయం చేయబోతున్నారనే దానిపై రోజుకో ఆసక్తికరమైన వార్త బయటకు వస్తూ, అభిమానుల్లో క్యూరియాసిటీని రెట్టింపు చేస్తోంది. సెంట్రల్ జైల్లో అసలైన విధ్వంసం: తాజా సమాచారం ప్రకారం, 'స్పిరిట్' సినిమా ఒక సెంట్రల్ జైలు వాతావరణంలో ప్రారంభమవుతుందట. జైల్లో ఉన్నట్టుండి పెద్ద గందరగోళం చెలరేగడం, నేరస్థులు నియంత్రణ కోల్పోవడం, అక్కడున్న పోలీసులు కూడా ఆ పరిస్థితిని అదుపు చేయలేక చేతులెత్తేయడం వంటి సన్నివేశంతో కథ మొదలవుతుంది. ఇక ఈ రచ్చ జరుగుతున్న సమయంలోనే ప్రభాస్ క్యారెక్టర్ ఎంట్రీకి వేదిక సిద్ధమవుతుందని తెలుస్తోంది. భయంతో వణికించే పేరు: అయితే ఈ సీన్‌లో ప్రభాస్‌ను వెంటనే చూపించకుండా, అక్కడి నేరస్థుల భయం ద్వారా ఆయన పవర్‌ను చూపిస్తారట. ఆ పోలీస్ ఆఫీసర్ పేరు వినగానే ఖైదీల ముఖాల్లో స్పష్టమైన భయం కనిపిస్తుందట. ఇక ఎటువంటి డిజైన్డ్ ఫైట్స్ లేదా భారీ డైలాగులు లేకుండా, కేవలం ఆయన పేరుతోనే ఆ పాత్ర ఎంత ప్రమాదకరమైనదో దర్శకుడు సందీప్ వంగా చాలా పవర్‌ఫుల్‌గా ఎస్టాబ్లిష్ చేయబోతున్నారట. పాత హిందీ పాటతో వినూత్నంగా ఇంట్రో: ప్రభాస్ ఎంట్రీ ఎంతో సైలెంట్‌గా, సైకోటిక్ రేంజ్‌లో ఉండబోతోందని టాక్. ఖాకీ యూనిఫామ్‌లో ఉన్న ప్రభాస్ చాలా ప్రశాంతంగా, పాత హిందీ పాటలు వింటూ కేజువల్‌గా జైల్లోకి అడుగుపెడతారట. ఇక చుట్టూ ఉన్న నేరస్థులు భయంతో వణుకుతుంటే, ప్రభాస్ మాత్రం క్లాసిక్ సాంగ్ వింటూ కూల్‌గా కనిపించే ఈ కాంట్రాస్ట్ షాట్ సినిమాలోనే అతిపెద్ద హైలైట్‌గా నిలుస్తుందని అంటున్నారు.






# మంత మరో స్టార్ కి నో చెప్పిందా?

టాలీవుడ్ - కోలీవుడ్ పరిశ్రమల్లో తనకంటూ ప్రత్యేకమైన స్థానాన్ని ఏర్పరచుకున్న స్టార్ హీరోయిన్ సమంత గురించి ప్రస్తుతం ఫిల్మ్ నగర్ సర్కిల్స్‌లో ఓ వార్త చర్చనీయాంశమవుతోంది. అగ్ర నిర్మాణ సంస్థ నిర్మిస్తున్న ఓ ప్రతిష్టాత్మక చిత్రంలో నటించే అవకాశాన్ని సామ్ సున్నితంగా తిరస్కరించినట్లు తెలుస్తోంది. టాలీవుడ్ కు చెందిన ఓ స్టార్ హీరో సరసన నటించాల్సిన ఈ భారీ ప్రాజెక్ట్‌కు సమంత నో చెప్పడం సినీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. హీరోల లిస్ట్‌లో ఎవరెవరు ఉన్నారంటే? విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం ఈ ప్రాజెక్ట్ ఇప్పుడే పట్టాలెక్కేది కాదని, సరిగ్గా ఏడాది తర్వాత ప్రారంభం కానున్నట్లు తెలుస్తోంది. సుదీర్ఘ కాలం పాటు సెట్స్‌లో ఉండాల్సిన ఈ ప్రాజెక్ట్ షెడ్యూల్స్ ... భవిష్యత్ ప్రణాళికలు తన ప్రస్తుత వ్యక్తిగత, వృత్తిపరమైన ఆలోచనలకు సరిపడకపోవడంతోనే సమంత ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. ఈ భారీ బడ్జెట్ చిత్రానికి సామ్ డేట్స్ కేటాయించలేనని స్పష్టం చేసినట్లు తెలుస్తోంది. గత కొంతకాలంగా సమంత సినిమాల ఎంపికలో ఆచితూచి వ్యవహరిస్తున్న సంగతి తెలిసిందే. గ్లామర్ పాత్రలకే పరిమితం కాకుండా నటనకు ఆస్కారం ఉన్న బలమైన పాత్రలను మాత్రమే ఎంచుకుంటున్నారు. అలాగే సమంత ఆరోగ్యం, మానసిక ప్రశాంతతకు ప్రాధాన్యతనిస్తూ ప్రాజెక్ట్‌లను అంగీకరిస్తున్నారు. ఏడాది తర్వాత ప్రారంభమయ్యే ఈ ప్రాజెక్ట్ కోసం ఇప్పుడే కమిట్ అయితే ఇతర ప్రణాళికలకు ఆటంకం ఏర్పడుతుందనే ఉద్దేశంతోనే సమంత ఈ ఆఫర్‌ను వదులుకుంటుంది అన్నది మరో వెర్షన్.

మరోవైపు అగ్ర నిర్మాణ సంస్థ - స్టార్ హీరో సినిమా కావడంతో సమంత ఈ ఆఫర్‌ను తిరస్కరించడం పలువురిని ఆశ్చర్యానికి గురి చేస్తుంది. సాధారణంగా ఇలాంటి పెద్ద ప్రాజెక్ట్‌లను నటీనటులు వదులుకోవడానికి సాహసించరు. కానీ సమంత మాత్రం తాను తీసుకునే నిర్ణయాలపై ఎంతో స్పష్టతతో ఉంటానని మరోసారి నిరూపించారు. కథలో కొత్తదనం .. పాత్ర ప్రాధాన్యతను బట్టే అడుగులు వేస్తున్నారని ఈ ఘటన ద్వారా స్పష్టమవుతోంది. ప్రస్తుతం సమంత దృష్టిని వెబ్ సిరీస్‌లు, పాన్-ఇండియా ప్రాజెక్ట్‌లు , సొంత ప్రొడక్షన్ వెంచర్లపై ఎక్కువగా కేంద్రీకరిస్తున్నారు. సినిమాల ఎంపికలో సామ్ అనుసరిస్తున్న సెలెక్టివ్ అప్రోచ్ ఆమె కెరీర్‌ను మరింత భిన్నమైన మార్గంలో నడిపిస్తోంది. భారీ ఆఫర్లను సైతం వ్యక్తిగత ప్రాధాన్యతల కోసం పక్కన పెట్టే సమంత తెగింపు ఇండస్ట్రీలో ప్రత్యేక చర్చకు దారితీస్తోంది.





# నాకు అండగా ఆ ఇద్దరు హీరోలు

తన కష్టకాలంలో ఇద్దరు హీరోలు అండగా నిలుస్తారన్న అనుపమ

బాధలో ఉన్నప్పుడు దుల్కర్ సల్మాన్ నుంచి మెసేజ్ వస్తుందని వెల్లడి

దుల్కర్ తర్వాత రామ్ పోతినేనిని ఎక్కువగా విశ్వసిస్తానని స్పష్టం

మాజీ ప్రియుడి నుంచి ఎదుర్కొన్న మానసిక వేధింపుల గురించి ప్రస్తావన

దుల్కర్‌తో కలిసి గతంలో మలయాళ చిత్రంలో నటించిన అనుపమ



ప్రముఖ నటి అనుపమ పరమేశ్వరన్ తన సినీ జీవితంలో తనకు అండగా నిలిచే ఇద్దరు హీరోల గురించి ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన ఆమె, తాను మనసు బాగోలేనప్పుడు, కష్టకాలంలో ఉన్నప్పుడు తనను ఓదార్చే స్నేహితులు ఇండస్ట్రీలో ఉన్నారని తెలిపారు. వారిలో మలయాళ స్టార్ హీరో దుల్కర్ సల్మాన్, టాలీవుడ్ హీరో రామ్ పోతినేని ఉన్నారని వెల్లడించారు. తాను బాధలో ఉన్నప్పుడు గుర్తుకొచ్చే మొదటి పేరు దుల్కర్ సల్మాన్‌దేనని అనుపమ అన్నారు. "నేను ఎప్పుడు డల్‌గా ఉన్నా, దుల్కర్ నుంచి నాకు ఒక మెసేజ్ వస్తుంది. నేను బాధలో ఉన్న విషయం ఆయనకు ఎలా తెలుస్తుందో అని ఆశ్చర్యపోతాను. ఆయనతో కాసేపు మాట్లాడితే నా బాధ అంతా మాయమైపోతుంది" అని ఆమె వివరించారు. దుల్కర్ తర్వాత, తాను ఎక్కువగా విశ్వసించే మరో వ్యక్తి టాలీవుడ్ హీరో రామ్ అని అనుపమ తెలిపారు. వీరిద్దరితో ఉన్న స్నేహబంధం తనకెంతో విలువైందని ఆమె పేర్కొన్నారు. గతంలో అనుపమ, దుల్కర్ కలిసి మలయాళ చిత్రం 'జోమొంటే సువిశేషంగళ్'లో నటించిన విషయం తెలిసిందే. ఇదే సందర్భంగా, తన గత ప్రేమ సంబంధంలో ఎదుర్కొన్న మానసిక వేధింపుల (నార్సిసిస్టిక్ అబ్యూజ్) గురించి కూడా ఆమె ప్రస్తావించారు. అలాంటి వ్యక్తులు ఇతరులను ఎప్పుడూ తమ నియంత్రణలో ఉంచుకోవాలని ప్రయత్నిస్తారని, ఇది చాలా నిశ్శబ్దంగా జరిగే వేధింపు అని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.

# యూపీలో జడ్జి సంచలనం.. 4 నెలల్లో 22 మందికి మరణశిక్ష!

యూపీలో ఓ జడ్జి నాలుగు నెలల్లో 22 మందికి ఉరిశిక్ష విధించిన జడ్జి

ముజఫర్‌నగర్ అదనపు సెషన్స్ జడ్జి రవికుమార్ దివాకర్ తీర్పులు

న్యాయవాది హత్య, దోపిడీ వంటి 10 తీవ్రమైన కేసుల్లో ఈ శిక్షలు ఖరారు



ఢిల్లీ: ఉత్తరప్రదేశ్‌లోని ముజఫర్‌నగర్‌కు చెందిన అదనపు జిల్లా, సెషన్స్ జడ్జి కేవలం నాలుగు నెలల కాలంలోనే 10 వేర్వేరు కేసుల్లో 22 మందికి మరణశిక్ష విధించి దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించారు. ఈ వరుస తీర్పుల నేపథ్యంలో దేశంలో మరణశిక్షల అమలుపై మరోసారి విస్తృత చర్చ ప్రారంభమైంది. ప్రభుత్వ న్యాయవాది వెల్లడించిన వివరాల ప్రకారం, జడ్జి రవికుమార్ దివాకర్ ఈ ఏడాది ఏప్రిల్ నుంచి ఆగస్టు మధ్య కాలంలో ఈ కీలక తీర్పులను వెలువరించారు. న్యాయవాది సమీర్ సఫీ హత్య కేసు, హోంగార్డు హత్య, హైవే దోపిడీ, ఆర్థిక లాభం కోసం కిడ్నాప్ చేసి హత్య చేయడం వంటి అత్యంత క్రూరమైన నేరాల్లో నిందితులకు ఈ కఠిన శిక్షలు ఖరారు చేశారు. ఇందులో భాగంగా ఏప్రిల్‌లో ఏడుగురికి, మే నెలలో ఒకరికి, జూన్‌లో ఇద్దరికి, జూలైలో ఏడుగురికి, ఆగస్టు 13 నాటికి మరో ఐదుగురికి మరణశిక్ష విధించారు. ఇటీవల ఆగస్టు 12న, 1999 నాటి కిడ్నాప్, హత్య కేసులో షానవాజ్‌కు, ఆగస్టు 13న షామ్లీ జిల్లాలో జరిగిన పవన్ కుమార్ హత్య కేసులో నలుగురికి ఉరిశిక్ష విధిస్తూ ఆయన తీర్పునిచ్చారు. జడ్జి దివాకర్ గతంలో బరేలీలో పనిచేస్తున్న సమయంలోనూ 13 మందికి మరణశిక్ష విధించిన చరిత్ర ఉంది. దీంతో ఆయన ఇప్పటివరకు తన పదవీ కాలంలో మొత్తం 35 మందికి మరణశిక్ష విధించినట్లయింది. 2022లో వారణాసిలోని జ్ఞానవాపి మసీదులో వీడియోగ్రాఫిక్ సర్వేకు ఆదేశాలు జారీ చేసి జడ్జి రవికుమార్ దివాకర్ దేశవ్యాప్త గుర్తింపు పొందారు. అయితే, సెషన్స్ కోర్టు విధించిన మరణశిక్షలు అమలు కావాలంటే నిబంధనల ప్రకారం హైకోర్టు వాటిని ధ్రువీకరించాల్సి ఉంటుంది. అలాగే, ఈ తీర్పులను సవాలు చేస్తూ నిందితులకు సుప్రీంకోర్టులో అప్పీల్ చేసుకునే చట్టపరమైన అవకాశం కూడా ఉంటుంది.

# ఇల్లు, పిల్లల చదువుకే రూ.7 లక్షలు.. చైనాలో భారతీయ కుటుంబం ఖర్చు వైరల్!

షాంఘైలో నెలకు రూ.9.81 లక్షల ఖర్చు

ఇంటి అద్దెకే నెలకు రూ.3.5 లక్షలు

పిల్లల స్కూల్ ఫీజు రూ.3.5 లక్షలు

కిరాణాకు నెలకు రూ.70,750 ఖర్చు

ఇంటి పనివాళ్లకు రూ.లక్షకుపైగా చెల్లిస్తున్న వైనం



చైనాలో జీవితం అంటే తక్కువ ఖర్చుతోనే సాగిపోతుందని చాలామంది అనుకుంటారు. కానీ షాంఘైలో ఉంటున్న ఓ భారతీయ కుటుంబం నెలవారీ ఖర్చులు మాత్రం అందుకు భిన్నమైన చిత్రాన్ని చూపిస్తున్నాయి. నలుగురు సభ్యులున్న ఆ కుటుంబం నెలకు దాదాపు రూ.9.81 లక్షలు ఖర్చు చేస్తోంది. అద్దె, పిల్లల చదువు, కిరాణా, ఇంటి పనివాళ్లు, వినోదం ఇలా పలు ఖర్చులను ఆ కుటుంబానికి చెందిన అదితి శర్మ సోషల్ మీడియాలో వివరించారు. అదితి శర్మ కుటుంబం షాంఘైలోని ఇంటి అద్దెకు నెలకు 25,000 యువాన్లు చెల్లిస్తోంది. మన కరెన్సీలో ఇది దాదాపు రూ.3.5 లక్షలు. పిల్లలు అంతర్జాతీయ పాఠశాలలో చదువుతున్నారు. వారి చదువుకు కూడా నెలకు మరో 25,000 యువాన్లు, అంటే సుమారు రూ.3.5 లక్షలు ఖర్చవుతున్నాయి. కుటుంబం నెలవారీ బడ్జెట్‌లో ఎక్కువ భాగం ఈ రెండు ఖర్చులకే వెళ్తోంది. కిరాణా సరుకులకు నెలకు దాదాపు 5,000 యువాన్లు ఖర్చవుతున్నాయి. అంటే సుమారు రూ.70,750. ఇంటి పనుల కోసం పెట్టుకున్న సిబ్బందికి నెలకు రూ.లక్షకుపైగా చెల్లిస్తున్నారు. విద్యుత్, నీరు, ఇతర యుటిలిటీ ఖర్చులకు సుమారు రూ.21,230 వెచ్చిస్తున్నారు. ప్రజా రవాణాకు మరో రూ.10 వేల వరకు ఖర్చవుతోంది. పిల్లల వినోదం, అదనపు కార్యక్రమాల కోసం నెలకు మరో 1,500 యువాన్లు ఖర్చు చేస్తున్నారు. బయట తినడం, షాపింగ్‌కు సుమారు 4,000 యువాన్లు, అంటే రూ.56,650 వరకు వెచ్చిస్తున్నారు. ఇలా అన్ని ఖర్చులు కలిపితే నెలకు దాదాపు రూ.9,81,860 అవుతున్నాయని అదితి తెలిపారు. అయితే ఈ మొత్తాన్ని షాంఘైలో ప్రతి కుటుంబానికి వర్తించే ఖర్చుగా చూడొద్దని ఆమె స్పష్టం చేశారు. తమ జీవనశైలి, పిల్లలు చదివే స్కూల్, ఉండే ప్రాంతం, ఇంటి అద్దె ఆధారంగా ఖర్చులు మారుతాయని చెప్పారు. తమకు ఎలాంటి ప్రవాస భత్యం రావడం లేదని, వైద్య బీమా మాత్రం 100 శాతం వైద్య ఖర్చులను కవర్ చేస్తుందని తెలిపారు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో పలువురు స్పందించారు. షాంఘై, బీజింగ్ వంటి పెద్ద నగరాల్లో అద్దెలు, అంతర్జాతీయ పాఠశాలల ఫీజులు భారీగా ఉంటాయని కొందరు పేర్కొన్నారు. చైనాలోని చిన్న నగరాలతో పోలిస్తే ఈ నగరాల్లో జీవన వ్యయం చాలా ఎక్కువగా ఉంటుందని మరికొందరు తెలిపారు.

# 72 ఏళ్ల వయసులో సాహసం.. యూరప్‌లో ఎత్తైన మంచు శిఖరాన్ని అధిరోహించిన విజయవాడ తాత!

విజయవాడకు చెందిన 72 ఏళ్ల రవీంద్రరావు సాహస యాత్ర

యూరప్‌లో ఎత్తైన ఎల్‌బ్రస్ శిఖరాన్ని అధిరోహించిన వైనం

వయసు కేవలం ఒక అంకె మాత్రమేనని నిరూపిస్తూ, విజయవాడకు చెందిన 72 ఏళ్ల వృద్ధుడు అరుదైన ఘనత సాధించారు. తన 17 ఏళ్ల మనవడితో కలిసి యూరప్‌లోనే అత్యంత ఎత్తైన పర్వత శిఖరాన్ని అధిరోహించి అందరినీ ఆశ్చర్యపరిచారు. పట్టుదల ఉంటే ఏ వయసులోనైనా అసాధ్యాన్ని సుసాధ్యం చేయవచ్చని ఆయన చాటిచెప్పారు. విజయవాడకు చెందిన లింగం రవీంద్రరావు (72), ఆయన మనవడు అనురాగ్ పోకూరి (17) కలిసి యూరప్‌లోని మౌంట్ ఎల్‌బ్రస్ వెస్ట్ పీక్‌ను అధిరోహించాలని నిర్ణయించుకున్నారు. 5,642 మీటర్ల (18,510 అడుగుల) ఎత్తు ఉండే ఈ మంచు శిఖరాన్ని ఈ నెల 14వ తేదీన విజయవంతంగా అధిరోహించారు. తాతా-మనవళ్లు కలిసి సాధించిన ఈ సాహస యాత్ర ఫొటోలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. అనురాగ్ పోకూరి, ప్రముఖ సినీ నిర్మాత, 'ఈతరం ఫిల్మ్స్' అధినేత పోకూరి బాబూరావుకు కూడా మనవడు కావడం విశేషం. ఏడు పదుల వయసు దాటినప్పటికీ, సరైన ఆరోగ్య సూత్రాలు, మంచి ఆహారం పాటిస్తే ఇలాంటి సాహసాలు చేయడం సాధ్యమేనని రవీంద్రరావు నిరూపించారు. ఆయన సాధించిన ఈ ఘనతపై పలువురు అభినందనలు తెలుపుతూ, ఆయన ఎంతో మందికి ఆదర్శంగా నిలిచారని ప్రశంసిస్తున్నారు.

# తాతయ్య, నాన్నమ్మ కథలు చెబితే పిల్లలకు ఇన్ని ప్రయోజనాలా? సైన్స్ చెబుతున్న 3 విషయాలు

ఇంట్లో తాతాయ్య, నాన్నమ్మలు చెప్పే కథలతో పిల్లలకు ఎన్నో ప్రయోజనాలు

కుటుంబ నేపథ్యం, పెద్దల అనుభవాలు తెలుసుకునే అవకాశం

కొత్త పదాలు, వాక్య నిర్మాణాలు, వివరణలు, సంభాషణలు నేర్చుకునే ఛాన్స్

సామాజిక, భావోద్వేగ నైపుణ్యాలు అభివృద్ధి అవకాశం



తాతయ్య, నాన్నమ్మల దగ్గర కూర్చొని వాళ్ల చిన్ననాటి కథలు వినడం పిల్లలకు ఓ మధురమైన జ్ఞాపకం. కుటుంబంలో జరిగిన సంఘటనలు, తల్లిదండ్రుల చిన్ననాటి అనుభవాలు, కష్టాలను ఎలా ఎదుర్కొన్నారనే విషయాలు పిల్లల ఆలోచనా విధానంపై కూడా ప్రభావం చూపుతాయని పరిశోధనలు సూచిస్తున్నాయి. ముఖ్యంగా కుటుంబ కథలు పిల్లల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంచడం, భాషా నైపుణ్యాలను మెరుగుపరచడం, ఇతరులతో అనుబంధాన్ని బలోపేతం చేయడంలో ఉపయోగపడతాయి.

1. 'నేను ఎవరు?' అనే భావన బలపడుతుంది

పిల్లలు తమ గురించి తెలుసుకునే క్రమంలో కుటుంబ కథలకు కూడా ప్రాధాన్యం ఉంటుంది. కుటుంబంలో జరిగిన విషయాలను పిల్లలకు పెద్దలు చెప్పినప్పుడు తమ కుటుంబ నేపథ్యం, తమ తల్లిదండ్రుల అనుభవాలు, ఎదుర్కొన్న కష్టాల గురించి పిల్లలకు తెలుస్తుంది. ఉదాహరణకు.. 'మీ అమ్మ కూడా చిన్నప్పుడు స్కూల్‌కి వెళ్లడానికి భయపడేది' అని అమ్మమ్మ చెబితే.. తనకే ఎదురవుతున్న సమస్య కాదని పిల్లలకు అర్థమవుతుంది. ఇలాంటి కథలు కష్టాలను ఎదుర్కొనే ధైర్యాన్ని, నేను అనే ఆత్మవిశ్వాసాన్ని పెంచే అవకాశం ఉంటుంది.

2. భాషా నైపుణ్యాలు

కథలు వినేటప్పుడు పిల్లలు కొత్త పదాలు, వాక్య నిర్మాణాలు, వివరణలు, సంభాషణలు వింటారు. ఒక సంఘటన మొదలై.. దాని తర్వాత ఏం జరిగిందో అర్థం చేసుకోవడానికి వారు శ్రద్ధగా వినాలి. ముఖ్యంగా చిన్న పిల్లల్లో కథలను అర్థం చేసుకునే సామర్థ్యానికి పదజాలం, వ్యాకరణ పరిజ్ఞానం కీలకమని పరిశోధనలు సూచిస్తున్నాయి. తాతయ్య, నాన్నమ్మలు చెప్పే భిన్నమైన కథలు పిల్లలకు కొత్త పదాలు, కొత్త అనుభవాలను పరిచయం చేయగలవు.

3. భావోద్వేగాలను అర్థం చేసుకోవడం

తాతయ్య లేదా నాన్నమ్మ ఒకప్పుడు తాము ఎదుర్కొన్న భయం, నిరాశ, సంతోషం లేదా వైఫల్యం గురించి చెప్పినప్పుడు పిల్లలు కేవలం కథ వినడం మాత్రమే చేయరు. 'అప్పుడు మీకు ఎలా అనిపించింది?', 'తర్వాత ఏం చేశారు?' అంటూ ప్రశ్నలు అడుగుతారు. దీంతో ఇతరుల భావాలను అర్థం చేసుకోవడం, తమ అనుభవాలతో పోల్చుకోవడం వంటి సామాజిక, భావోద్వేగ నైపుణ్యాలు అభివృద్ధి చెందుతాయి. తాతయ్య, నాన్నమ్మలతో ఏర్పడే ఆప్యాయమైన అనుబంధం కూడా పిల్లల సామాజిక నైపుణ్యాలకు మేలు చేస్తుందని పరిశోధనలు సూచిస్తున్నాయి.

అసలు కథలో ఉన్న మ్యాజిక్ ఇదే..

తాతయ్య, నాన్నమ్మ కథలు పిల్లలకు పెద్ద జీవిత పాఠాలు చెప్పాల్సిన అవసరం లేదు. వాళ్లు చిన్నప్పుడు చేసిన అల్లరి, ఎదుర్కొన్న కష్టం, మొదటి ఉద్యోగం, స్కూల్ అనుభవం.. ఇలా ఏ చిన్న జ్ఞాపకమైనా పిల్లలకు విలువైనదే. అందుకే వాళ్లు కథ చెబుతున్నప్పుడు ఫోన్ పక్కన పెట్టి పిల్లలను కాసేపు విననివ్వండి. ఏళ్ల తర్వాత పిల్లల మనసులో నిలిచిపోయేది పెద్దలు చెప్పిన ఉపదేశం కాకపోవచ్చు.. తమ పక్కనే కూర్చొని తాతయ్య, నాన్నమ్మ చెప్పిన ఆ చిన్న కథే కావచ్చు.

# 2026లో సోషల్ మీడియా ఇలా మారిపోతోంది.. మీరు చూస్తున్నదంతా మునుపటిలా ఉండదు!

పర్ఫెక్ట్ కంటే సహజమైన కంటెంట్‌కు ఆదరణ

చిన్న క్రియేటర్లకూ వైరల్ అయ్యే అవకాశం

సోషల్ మీడియాలోనే సమాచారం వెతుకుతున్న యూజర్లు



సోషల్ మీడియా ప్రతి ఏడాది కొత్తగా మారుతోంది. ఒకప్పుడు అందమైన ఫొటోలు, ట్రెండింగ్ పాటలు, భారీ ఫాలోయింగ్ ఉన్న సెలబ్రిటీలే ఎక్కువగా కనిపించేవారు. ఇప్పుడు పరిస్థితి క్రమంగా మారుతోంది. సాధారణంగా తీసిన వీడియోలు కూడా వైరల్ అవుతున్నాయి. లక్షలాది మంది ఫాలోవర్లు లేకపోయినా చిన్న క్రియేటర్లు పెద్ద ఆడియన్స్‌ను సంపాదించుకుంటున్నారు. అంతేకాదు.. సోషల్ మీడియా ఇప్పుడు కేవలం టైమ్‌పాస్ కోసం చూసే వేదికగా కాకుండా సమాచారం వెతకడానికి, వస్తువులు కొనడానికి, కొత్త ప్రదేశాలు తెలుసుకోవడానికి కూడా ఉపయోగపడుతోంది. 2026లో సోషల్ మీడియాను మార్చుతున్న ఐదు ముఖ్యమైన ట్రెండ్స్ ఇవే.

రియల్ లైఫ్‌కు ప్రాధాన్యం

ప్రతి ఫొటోను పర్ఫెక్ట్‌గా చూపించాలనే ఆలోచన క్రమంగా తగ్గుతోంది. కొంచెం బ్లర్‌గా ఉన్న ఫొటో, ఒక్క టేక్‌లో తీసిన వీడియో, సహజంగా మాట్లాడిన మాటలు కూడా ఇప్పుడు ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాయి. మరీ ఎక్కువగా ప్లాన్ చేసిన కంటెంట్ కంటే నిజ జీవితానికి దగ్గరగా కనిపించే పోస్టులకు ఆదరణ పెరుగుతోంది. క్రియేటర్లు తమ జీవితంలోని చిన్న చిన్న లోపాలను కూడా చూపిస్తున్నారు. అంటే సోషల్ మీడియాలో 'పర్ఫెక్ట్ లైఫ్' కంటే 'రియల్ లైఫ్'కు ప్రాధాన్యం పెరుగుతోంది.

లక్షల ఫాలోవర్లు లేకపోయినా..

గతంలో సోషల్ మీడియాలో గుర్తింపు రావాలంటే భారీ ఫాలోయింగ్ ఉండాలి. ఇప్పుడు అలాంటి పరిస్థితి లేదు. రికమెండేషన్ ఆధారిత ఫీడ్స్ వల్ల చిన్న క్రియేటర్లు కూడా ఒక్క పోస్టుతో వేలాది మందికి చేరుతున్నారు. ఇప్పటికే ఫేమస్ అయిన వ్యక్తుల కంటే కొత్తగా వచ్చినవారికీ వైరల్ అయ్యే అవకాశం పెరిగింది. కొన్నిసార్లు రోజుల తరబడి కష్టపడి తయారు చేసిన వీడియో కంటే సరదాగా తీసిన చిన్న క్లిప్ ఎక్కువగా వైరల్ అవుతోంది.

సోషల్ మీడియాలోనే సమాధానాలు!

రెస్టారెంట్ ఎలా ఉంది? ఏ హోటల్ బాగుంటుంది? ఏ స్కిన్‌కేర్ ప్రొడక్ట్ కొనాలి? జైపూర్‌లో రెండు రోజుల్లో ఏం చూడాలి? ఇలాంటి ప్రశ్నలకు ఇప్పుడు చాలామంది సోషల్ మీడియాలోనే సమాధానాలు వెతుకుతున్నారు. ముఖ్యంగా వీడియోల ద్వారా నిజమైన అనుభవాలు తెలుసుకోవడం ప్రజలకు ఆసక్తిగా మారింది. ఒక రెస్టారెంట్ పేరు తెలుసుకోవడం మాత్రమే కాదు.. అక్కడి వాతావరణం, ఫుడ్, ధరలు ఎలా ఉన్నాయో కూడా వీడియోల్లో చూసి నిర్ణయం తీసుకుంటున్నారు. దీంతో సోషల్ మీడియా క్రమంగా సెర్చ్ ఇంజిన్‌లా మారుతోంది.

ఏఐ కంటెంట్ పెరిగే కొద్దీ..

ఏఐతో ఫొటోలు, వీడియోలు, క్యాప్షన్లు, స్క్రిప్టులు క్షణాల్లో తయారవుతున్నాయి. దీంతో కంటెంట్ తయారు చేయడం చాలా సులభమైంది. కానీ అందరూ ఒకే రకమైన ఏఐ టూల్స్ ఉపయోగిస్తుండటంతో కేవలం అందంగా కనిపించే కంటెంట్ ప్రేక్షకులను ఎక్కువగా ఆకట్టుకోకపోవచ్చు. వ్యక్తిగత అనుభవం, ప్రత్యేకమైన హాస్యం, సహజమైన మాటతీరు, చిన్న చిన్న పొరపాట్లు కంటెంట్‌కు ప్రత్యేకతను ఇస్తున్నాయి. ఏఐ పోస్టును తయారు చేయగలదు.. కానీ దానిపై ఆసక్తి కలిగించే వ్యక్తిత్వాన్ని మాత్రం ఇవ్వలేదు.

### సోషల్ మీడియా నుంచి షాపింగ్ వరకు..

సోషల్ మీడియాలో చూసిన వస్తువును కొనడం ఇప్పుడు చాలా సాధారణంగా మారుతోంది. ఒకరు వేసుకున్న షూస్ నచ్చితే అవి ఎక్కడ దొరుకుతాయో తెలుసుకుంటున్నారు. ఒక మేకప్ ప్రొడక్ట్ లేదా గ్యాడ్జెట్ ఎలా పనిచేస్తుందో క్రియేటర్ వీడియోలో చూసి కొనుగోలు చేస్తున్నారు. అందుకే క్రియేటర్లు ఇప్పుడు వినోదం అందించడంతో పాటు కొనుగోలు నిర్ణయాలపై కూడా ప్రభావం చూపుతున్నారు. అయితే ప్రతి సిఫార్సు నిజాయతీగా ఉంటుందని భావించకూడదు. వినోదం, ప్రచారం, షాపింగ్.. ఈ మూడింటి మధ్య ఉన్న గీతలు మరింత చెరిగిపోతున్నాయి.









CORPORATE OFFICE:SNEHALA MEDIA PUBLICATIONS LLP, PLOT NO. 267,HUDA SAI NAGAR COLONY, BESIDE COMMUNITY HALL, VANASTHALIPURAM, RR DIST, HYDERABAD 500070.TG. CELL. 9348313999/8885727777.

Edited, Printed, Published & Owned By GURRAM PAPI REDDY,# H.No.4-57, Thorrur Village, Abdullapurmet Mandal, Turkayamal Municipality, Ranga reddy District.501511. Telangana. Printedat:GARUDA PRINT- ERS,# H.No.2-86/1, PlotNo.23-SP, SyNo.417, Sagar Highway, Ranganaguda Village, Abdullapurmet Mandal, Turkayamjal Municipality, Ranga reddy District.501510.Telangana.Published at: # H.No.4-57, Thorrur Village,Abdullapurmet Mandal, TurkayamalMunicipality, Ranga reddy District. 501511. Telangana...www.arunaprabha.com..email.arunaprabhadaily@gmail.com, RNI NO. TELTEL/2023/89778, Cell No. 9700127889